17-07Pg1exHMNWJQEK_17-07Pg1exHMNWJQEK.qxd 17/Jul/26 12:01 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు : fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 167 పేజీలు: 12 వెల: 6.50

డి.సిఎం పవన్‌ను పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు 2లో



గురువారం పూరీలో వైభవంగా సాగిన జగన్నాథ రథయాత్ర దృశ్యం

## కదిలిన జగన్నాథ రథాలు

- పూరీ యాత్రలో అపశ్రుతి
- తొక్కిసలాటలో ఇద్దరు మృతి.. 120 మందికిపైగా గాయాలు
- పది లక్షలు పైగా భక్తులు రాక
- రథాలు లాగేందుకు వారు పోటీ పడటంతో అనూహ్య ఘటన

**పూరి,జులై 16:** ఒడిశాలోని పూరీ క్షేత్రంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జగన్నాథ రథయాత్రలో అపశృతి చోటుచేసుకుంది. లక్షలాదిమంది తరలివచ్చిన ఈ యాత్రలో తొక్కిసలాట కారణంగా ఒకరు తీవ్ర అస్వస్థతకు లోనుకావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరేలోపే మరణించినట్లు నిర్వాహకులు తెలిపారు.మృతుడు కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించారు. అలాగే మరొక సంఘటనలో 35 ఏళ్ల వ్యక్తి >>2



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



అమరావతి చిత్రపటాన్ని శిరస్సున ధరించి రథయాత్రలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

## అమరావతిలో జగన్నాథ రథయాత్ర 2లో

## 'జమిలి'కి ఇసి రెడీ



### ఆరు నెలలు గడువు ఇస్తే 2029 నుంచే అమలు

### 2028లో సంబంధిత చట్టం ఆమోదించాలి

### 99% ప్రజలు కూడా ఈ విధానానికే ఓటు: జెపిసి ఛైర్మన్

**లక్నో,జులై 16:** కేంద్ర ఎన్నికల సంఘానికి ఆరు నెలల ముందస్తు సమయం ఇస్తే దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈసీతెలిపింది. ప్రతిపాదిత'ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు అంశాన్ని పరిశీలిస్తున్న పార్లమెంటు సంయుక్త కమిటీకి (జెపిసి) ఇసి తన ప్రాథమిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించినట్లు కమిటీ ఛైర్మన్ పి.పి. చౌదరి తెలిపారు. లక్నోలో విద్యావేత్తలతో మూడు రోజులపాటు జరిగిన సంప్రదింపుల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఇసి అభిప్రాయాలను కూడా కమిటీ పూర్తిగా విని, అనంతరం రాజ్యాంగ సవరణలపై తుది సిఫార్సులు చేస్తామని చెప్పారు. ఇసి ప్రణాళికపై తమ ప్రశ్నలను ఎన్నికల సంఘం ముందు ఉంచనున్నామని, ఒకేసారి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై ఇసి వివరణలను పరిశీలించిన తర్వాతే కమిటీ తన నివేదికను సిద్ధం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇసి ప్రాథమిక నివేదికను ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యమేనని, ఇందుకు కనీసం ఆరు నెలల ముందస్తు నోటీసు అవసరమని ఎన్నికల సంఘం అభిప్రాయపడిందని చౌదరి వెల్లడించారు. 2028లో పార్లమెంట్ సంబంధిత చట్టాన్ని ఆమోదిస్తే, 2029 నుంచి 'ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు అమలు' చేయవచ్చని ఎన్నికల సంఘం అభిప్రాయపడిందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ >>2

# భవిష్యత్తు పిపిపిలదే

### రాష్ట్రంలో 260 ప్రాజెక్టులకు అదే విధానం

### ప్రతి ప్రభుత్వ శాఖకు ఓ ఫైనాన్షియల్ ప్లాన్

### మెడికల్ కాలేజీలలో పిపిపికి కేంద్రం ప్రశంసలు

### విజిఎఫ్ పాలసీ మార్గదర్శకాలు త్వరలో : సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,జులై 16, ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే (పిపిపి) వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పిపిపి కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పిపిపి కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం అన్ని పిపిపి ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్థంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల విజిఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల విజిఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.

**వచ్చే కేబినెట్‌కు నూతన విధానం.**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం విజిఎఫ్ పాలసీ 1.0ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ యేటా పిపిపి కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేప >>2

## పర్యాటకంలో టాప్‌కి ఎపి

### దేశంలో అత్యంత ఆకర్షణీయ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం: మంత్రి దుర్గేష్

**విజయవాడ, జులై 16,ప్రభాతవార్తప్రతినిధి:** "పర్యాటకమే భవిష్యత్ ప్రగతి చక్రం" అని నమ్ముతూ ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. జులై 16,17 తేదీల్లో న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌లో ఇన్ క్రెడిబుల్ ఇండియా..ఇన్ వ్యాలబుల్ ఎకనామిక్స్ అంశంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న "ఫెయిత్ టూరిజం కాన్‌క్లేవ్ 2026" సదస్సులో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు,జమ్మూ అండ్ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, విద్యా, గ్రామీణ పనులు, పార్లమెంటరీ వ్యవహారాలు మరియు గ్రంథాలయాలశాఖ మంత్రి పాసాంగ్ దోర్జీ సోనా, కేంద్ర పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లా జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరైన ఈ ఉన్నత స్థాయి వేదికపై ఆంధ్రప్రదేశ్ అద్భుత పర్యాటక సామర్థ్యాన్ని, భవిష్యత్ కార్యాచరణను ఆయన అత్యంత సమర్థవంతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. సిఎంచంద్రబాబు నేతృత్వంలో రూపొందించిన 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047' ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పర్యాటక పటంలో అగ్రగామిగా నిలపడమే తమ సంకల్పమని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా, స్థానిక సమాజాల భాగస్వామ్యంతో పర్యావరణహిత, సుస్థిర పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైవిధ్యాన్ని వివరిస్తూ, భారతదేశంలోని అన్ని అద్భుతాలు ఎపిలో కొలువై ఉన్నాయని (ఎప్రీబిట్ ఆఫ్ ఇండియా ఈజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేర్కొన్నారు. 1,054 కి.మీ.లతో దేశంలోనే 3వ అతి పెద్ద సముద్ర తీరం, 283 బీచ్‌లున్నాయని, తిరుమల సహా 80,000కు పైగా దివ్య ఆలయాలు తమ సొంతమని పేర్కొన్నారు. అంతేగాక 13 వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు, 3 జాతీయ పార్కులు, దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్, విస్తారమైన బ్యాక్ వాటర్స్ (దేశంలో 2వస్థానం) కలిగిన రాష్ట్రం ఏపీ అని తెలిపారు.లేపాక్షి , తిరుమల కొండలు, ఎర్రమట్టి దిబ్బలు వంటి ప్రాంతాలు యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్నాయని వివరించారు. ప్రధానంగా ఆధ్యాత్మిక (తిరుపతి, అహోబిలం, శ్రీశైలం, సింహాచలం), బౌద్ధ (అమరా వతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన కొండ), వారసత్వ (లేపాక్షి, గండికోట, ఉండవల్లి గుహలు, చంద్రగిరికోట), ఎకో టూరిజం (అరకు, మారేడు మిల్లి, కొండకర్ల ఆవ,పులికాట్ సరస్సు), అరుదైన రుచులు (పూతరేకులు, చేపలపులుసు, రాగి సంగటి, బొంగు చికెన్), కళలుచేనేత (కొండపల్లి బొమ్మలు, కలంకారీ, నిమ్మలకుంట తోలుబొమ్మ లాట, కోనసీమ ప్రభలతీర్థం), సాహస క్రీడల్లో భాగంగా రాక్‌క్లైంబింగ్, స్కూబా డైవింగ్, సర్ఫింగ్, బౌల్డరింగ్, బీచ్ టూరిజం(సూర్యలంక, విశాఖ, పేరుపాలెం,సీతపాలెం, కోనసీమ బ్యాక్ వాటర్) వంటి సకల పర్యాటక అనుభూతుల సమాహారమే



## నీట్ రీఎగ్జామ్ ఫలితాలు విడుదల

### 11.21 లక్షల మందికి అర్హత

### 715 మార్కులతో ఆర్యన్ గుప్తా, పాన్షుల్ బన్సాల్ టాపర్లు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 16:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్, బిడిఎస్‌తోపాటు ఇతర మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-యుజి-2026 రీ ఎగ్జామినేషన్ ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టిఎ తుది ఫలితాలను విడుదల చేసింది. 720 మార్కులకు గానూ పంజాబ్‌కి చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకి చెందిన పాన్షుల్ బన్సాల్ ఇద్దరు 715 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. పరీక్షకు హాజరైన వారిలో 56.8 శాతం మంది మహిళలు, 55.1 శాతం మంది పురుషులు అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 11.21 లక్షల మంది అర్హత సాధించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. మే 3న జరిగిన నీట్-యుజీ-2026 ప్రశ్నాపత్రం లీకేజీ కావడంతో నీట్ యుజీ రీఎగ్జామ్‌ను జూన్ 21న మరోసారి ఎన్‌టిఎ నిర్వహించిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా 1.80 లక్షల మందితో భద్రతను ఏర్పాటు చేసి, పరీక్షకి అదనంగా 15 నిమిషాల సమయం కేటాయించింది ఎన్‌టీఎ. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించారు. పరీక్షను దేశ వ్యాప్తంగా 551 నగరాలతోపాటు విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. నీట్ యుజీ-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న 22,79,743 అందరికీ రీ ఎగ్జామ్ రాయడానికి ఎన్‌టిఎ అనుమతించింది. నీట్ రీ ఎగ్జామ్‌కి సుమారు 90 శాతం మంది హాజరైనట్టు ఎన్‌టిఎ ప్రకటించింది. పరీక్షను మొత్తం 13 భాషల్లో నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, >>2

## రేపు నింగిలోకి విక్రమ్-1 రాకెట్

**సూళ్లూరుపేట, జూలై 16 ప్రభాతవార్త:** ప్రథమంగా ఇస్రో, స్వదేశీ ప్రైవేట్ కీలక భాగస్వామ్యతో..అంతరిక్ష రంగంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా హైదరాబాదుకు చెందిన స్పేస్ టెక్ స్టార్ట్ అప్ సమస్థ రూపొందించిన విక్రమ్ 1అనే రాకెట్‌ను ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటల 30 నిమిషాలకు నింగిలోకి పంపనున్నది. ఈ రాకెట్ భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జ్ఞాపకార్థం విక్రమ్ అని పేరు పెట్టారు. ఇందుకు తగ్గట్టుగా అనుసంధా కార్యక్రమాలు శ్రీహరికోటలో పూర్తి చేశారు. ఈ చారిత్రత్మకమైన ప్రయోగానికి మిషన్ ఆగమన్ అనే పేరు పెట్టారు.

విక్రమ్ రాకెట్ 24 మీటర్ల ఎత్తు గల మల్టీ స్టేజ్‌లు కలిగి ఉన్న రాకెట్. రాకెట్ బరువును తగ్గించి, ఎక్కువ బరువును మోసుకెళ్లే విధంగా ఆల్ కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో ఈ రాకెట్‌ను తయారు చేశారు. నాలుగు దశల్లో ప్రయోగం. ఈ రాకెట్ ప్రయోగంలో నాలుగు దశలు ఉంటాయి మూడు దశల్లో ఘనఇంధనం నాలుగో దశలో కక్ష్యను కచ్చితంగా సర్దుబాటు చేయడం కోసం హైపర్ గోలిక్ ద్రవ ఇంధనాన్ని ఉపయోగిస్తారు. ఈ రాకెట్‌లో త్రీ డి ప్రింటెడ్ ఇంజన్లు ఉపయోగించడంతో నిర్మాణ ఖర్చు తగ్గడమే కాకుండా వేగంగా అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలవుతుంది.

## అమెరికాలో ప్రమాదం విజయవాడ యువకుని మృతి



**విజయవాడ, జులై 16,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడకు చెందిన ఒక యువకుడు అమెరికాలో జరిగిన ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. ఉన్నత భవిష్యత్తు కోసం అగ్రరాజ్యానికి వెళ్లిన ఆ యువకుడు, కొత్త ఉద్యోగంలో చేరడానికి కేవలం ఒక్క రోజు ముందు జరిగిన స్కైడైవింగ్ ప్రమాదంలో మృతి చెందడం అతని కుటుంబంలో, స్వగ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడుకు చెందిన గద్దం మణిచంద్ర తేజ (28), అమెరికాలోని మసాచుసెట్స్‌లో నివసిస్తున్నాడు. జులై 12న ఆరెంజ్ టౌన్‌లో స్కైడైవింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఆకాశం నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా బలమైన గాలులు వీయడంతో తేజ అదుపుతప్పి సుమారు 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే మరణించాడు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తేజ, బోస్టన్‌లోని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలో ఎంఎస్ పట్టా పొందాడు. ఇటీవల క్లావియా అనే ప్రముఖ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. అయితే, విధుల్లో చేరడానికి ఒక్కరోజు ముందే ఈ దుర్ఘటన జరగడం అందరినీ కలచివేస్తోంది. తేజ ఉన్నత చదువుల కోసం అతని తల్లిదండ్రులు గద్దం ప్రసాద్, ఉమాదేవి దంపతులు సుమారు రూ. 50 లక్షల వరకు విద్యా రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## 22న తల్లికి వందనం జమ

**విజయవాడ. జులై16, ప్రభాతవార్తప్రతినిధి:** తల్లికి వందనం లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఈ నెల 22న తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపింది. ఈ పథకం కింద ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాకు రూ. 13,000లు, పాఠశాల అభివృద్ధికి రూ.2000ల చొప్పున మొత్తం రూ.15,000ల నగదును నేరుగా జమ చేస్తోంది. >>2

## రాష్ట్రంలో 12కు పెరిగిన కరోనా కేసులు

### దేశ వ్యాప్తంగా రెండు వారాల్లో 339 కేసులు నమోదు

**విజయవాడ,జులై16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కొవిడ్ కేసులు చెదురుమొదురుగా బయటపడినట్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ నేడొక ప్రకటనలో తెలిపారు.జూన్ 26 నుంచి జులై 16 వరకు మొత్తం 12 మంది కోవిడ్ వైరస్ బారిన పడ్డారు. వీరిలో నలుగురు మృతిచెందారు. వీరికి అంతకుముందే తీవ్రమైన బీపీ,షుగర్, కిడ్నీ, ఇతర తీవ్ర వ్యాధులతో >>2



తుంగభద్ర నుంచి తాగునీరు విడుదల చేసిన దృశ్యం

## తుంగభద్ర నుంచి 1.5 టిఎంసిల నీటి విడుదల

### కర్నూలు జిల్లా తాగునీటి సంక్షోభానికి తాత్కాలిక ఊరట

### జలచౌర్యంపై అధికారుల్లో తీవ్ర ఆందోళన

### రెండు రాష్ట్రాల్లో భద్రతా ఏర్పాట్లు

**కర్నూలు, జూలై 16, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కర్నూలు జిల్లాలో తాగునీటి సంక్షోభాన్ని అధిగమించేందుకు తుంగభద్ర డ్యాం నుంచి 1.5 టిఎంసిల నీటిని విడుదల చేశారు. ప్రజల దాహార్తిని తీర్చడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి తెలిపారు. అయితే ఈ నీరు జిల్లాకు చేరే వరకు జలచౌర్యం, ప్రవాహంలో నీటి నష్టం వంటి అంశాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం కర్నూలు నగరానికి తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో కేవలం వారం రోజులకు మాత్రమే సరిపడే నీటి నిల్వలు ఉండటంతో గత పది రోజులుగా తుంగభద్ర నుంచి నీటి విడుదల కోసం జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తుంగభద్ర ప్రాజెక్టు అధికారులతో నిరంతరం చర్చలు జరిపారు. జిల్లా అధికారులు రెండు టిఎంసిల నీటిని కోరగా, ప్రాజెక్టు అధికారులు 1.5 టిఎంసిల నీటిని మాత్రమే విడుదల చేయడానికి అంగీకరించారు. జిల్లా >>2



గురువారం హైదరాబాద్‌లో డి.సిఎం పవన్‌ను పరామర్శిస్తున్న గవర్నర్ నజీర్

## డి.సిఎం పవన్‌ను పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

**విజయవాడ,జులై 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఇటీవల భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పరామర్శించారు. గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ గురువారం ఉదయం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఆయనతో మాట్లాడి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలని చెప్పారు. త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు.పవన్ కళ్యాణ్ లైబ్రరీని జస్టిస్ అబ్దుల్ నజీర్ తిలకించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను పరిశీలించారు. ప్రఖ్యాత రచయితలు, స్కాలర్స్, విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ మేకర్స్ రాసిన పుస్తకాలు పరిశీలించారు. వాటి గురించి పవన్ కళ్యాణ్‌తో ఆసక్తిగా చర్చించారు. పవన్ కళ్యాణ్ కోరడంతో ఓ పుస్తకంపై జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆటోగ్రాఫ్ చేశారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఎంతో ఆప్యాయంగా వచ్చి పరామర్శించినందుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## పెరిగిన కరోనా కేసులు

>> బాధపడుతున్నారని ఈ యేడాది తొలి కోవిడ్ కేసు జూన్ 26న కడప జిల్లాలో నమోదైంది. జులై 1 నుంచి 16 వరకు మరో 11 కేసులు బయటపడ్డాయి. వీరిలో ఇద్దరు కోవిడ్ సోకిన వ్యక్తులతో సన్నిహితంగా మెలిగినవారుగా గుర్తించారు. మొత్తం కేసుల్లో కడప జిల్లాలో అత్యధికంగా ఎనిమిది నమోదయ్యాయి. గుంటూరులో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున వెలుగుచూశాయి. ఇవన్నీ వేర్వేరు మండలాలు, ప్రాంతాల్లో నమోదైనవేనని.. ఒకచోట కేసులు గుంపుగా బయటపడలేదని వీర పాండియన్ తెలిపారు

**67 మందికి కోవిడ్ టెస్టులు**

జూన్ 26 నుంచి జులై 15 వరకు రాష్ట్రంలో 67 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా 11 మందికి పాజిటివ్‌గా తేలింది. కాకినాడ జిల్లాకు చెందిన మరొకరికి తమిళనాడులోని వేలూరు సిఎంసిలో నిర్వహించిన పరీక్షలో వైరస్ నిర్ధారణైంది.

**4 మరణాలు**

కోవిడ్ పాజిటివ్‌గా తేలినవారిలో కడప జిల్లాకు చెందిన ముగ్గురు, కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందారు. వీరందరికీ ముందునుంచే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది. వైరస్ జన్యు స్వరూపాన్ని గుర్తించేందుకు ఐదు నమూనాలను జులై 9న పుణెలోని జాతీయ వైరాలజీ సంస్థకు జన్యుక్రమ విశ్లేషణ కోసం పంపించారు. ప్రస్తుతం ముగ్గురు స్వీయ గృహ నిర్బంధంలో ఉన్నారు. ఇద్దరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముందు జాగ్రత్తలు పాటించాలని, వైద్యులు, ఆసుపత్రుల సిబ్బందిని అప్రమత్తం చేశామని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీర పాండియన్ తెలిపారు. జిల్లాలవారీగా కేసులు గమనిస్తే కడప 8, గుంటూరు 2, విశాఖపట్నం 1, కాకినాడ 1, మొత్తం కేసులు: 12

## 3 రోజులు వర్ష సూచన

**విజయవాడ. జులై 16,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా ఉన్న నిన్నటి అల్పపీడనం, ఈ రోజు, జులై 16, 2026, ఉదయం అదే ప్రాంతంలో బలమైన అల్పపీడన ప్రాంతంగా మారింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి, ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిశగా వంగి ఉంది.ఇది రాబోయే 2 రోజులలో ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమ బెంగాల్ మీదుగా వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. సగటు సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి ఇప్పుడు జమ్మూ, బరేలీ, బస్తీ, డాల్టన్‌గంజ్, వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా ఉన్న బలమైన అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా ప్రయాణించి, అక్కడి నుండి తూర్పుఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళా ఖాతం వైపు కదులుతుంది.వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాలపై ఏర్పడిన బలమైన అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి తూర్పుమధ్య అరేబియా సముద్రం మీదుగా కోస్తా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర వరకు సగటు సముద్ర మట్టానికి 5.8 నుండి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. నేటి సాయంత్రానికి భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 -50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.శుక్రవారం తెలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశ ముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభ వించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. శనివారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.ఈ రోజు రాత్రికి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది. శుక్రవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

## ఎపి లిక్కర్ కుంభకోణం కేసు: నిందితులను కస్టడీకి తీసుకున్న ఇడి

**విజయవాడ, జులై16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో నిందితులను ఇడి కస్టడీకి తీసుకోంది. వారిని మూడు రోజుల పాటు ఇడి ప్రశ్నించనుంది. రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, సునీల్‌కుమార్‌ను కస్టడీలోకి తీసుకోనున్నారు. ప్రస్తుతం చంచల్‌గూడ కారాగారంలో వీరు ముగ్గురు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. చంచల్‌గూడ జైలు నుంచి ముగ్గురిని ఇడి కార్యాలయానికి తరలించి విచారించనున్నారు. మనీలాండరింగ్, ఆర్థిక లావాదేవీలు, లిక్కర్ రవాణాపై ప్రశ్నించనున్నారు. విచారణలో మరిన్ని కీలక వివరాలు తెలిసే అవకాశం ఉందని ఈడీ భావిస్తోంది.నిందితులను ప్రశ్నించి మరిన్ని వివరాలు రాబట్టే ప్రయత్నం చేయనున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్ల కేటాయింపులో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇడి మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపడుతోంది.

# భవిష్యత్తు పిపిపిలదే

>> ట్టాల్సి రావొచ్చని సిఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సిఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సిఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడి దారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

**ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం..**

ప్రభుత్వం వద్ద నిరర్థకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సిఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పిపిపి కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సిఎం అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని.. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సిఎం సూచించారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సిఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# 'జమిలి'కి ఇసి రెడీ

>> కలల ప్రాజెక్టుగా పేర్కొన్న ఈ ప్రతిపాదనపై మాట్లాడుతూ, 1954 నుంచి 1960 మధ్యకాలంలో దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం అనేది కేవలం ఎన్నికల షెడ్యూల్‌ను సమన్వయం చేయడమే తప్ప, రాష్ట్రాల అధికారాలు లేదా రాజ్యాంగ హక్కులను ఏ విధంగానూ తగ్గించదని నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు చౌదరి చెప్పారు.ఈ ప్రతిపాదనకు ప్రజల నుంచి విస్తృత మద్దతు లభిస్తోందని పేర్కొంటూ, పౌర సమాజ ప్రతినిధులు, సాధారణ ప్రజల్లో దాదాపు 99 శాతం మంది ఒకే దేశం ఒకేసారి ఎన్నికలకు అనుకూలంగా ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రతిపాదన ప్రకారం, దేశవ్యాప్తంగా ప్రతి ఐదేళ్లకోసారి లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఎన్నికల చక్రాన్ని సమన్వయం చేసి, ఓటర్లు ఒకే సమయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కల్పించడమే లక్ష్యం.ఈ విధానాన్ని అమలు చేయడానికి రూపొందించిన భారత రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదం పొందడంతో పాటు, కనీసం సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదంకూడా పొందాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనలో పంచాయతీలు, మున్సి పాలిటీల ఎన్నికలు లేదా ఉపఎన్నికలు ప్రస్తుతం చేర్చలేదు. ఒకేసారి ఎన్నికల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 2023 సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2024లో సమర్పించిన నివేదికలో తొలి దశలో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను సమకాలీకరించాలని, అనంతరం 100 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని సిఫార్సు చేసింది.

మూడు స్థాయిల ప్రభుత్వాల ఎన్నికల కోసం ఒకే ఓటరు జాబితా మరియు ఒకే ఎలెక్టర్ ఫోటో ఐడెంటిటీ కార్డు అమలు చేయాలని కూడా కమిటీ సూచించింది.కోవింద్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్ర మంత్రివర్గం 2024 సెప్టెంబరులో ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రెండు దశల్లో అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, తొలి దశలో లోక్‌సభఅసెంబ్లీ ఎన్నికలను ఒకే సారి నిర్వహించడం, రెండో దశలో వాటి తర్వాత 100 రోజుల వ్యవధిలో మున్సిపాలిటీలు, పంచాయతీల ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించింది.

# నీట్ రీఎగ్జామ్ ఫలితాలు విడుదల

>> కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళంతోపాటు ఉర్దూ భాషల్లో పరీక్షను నిర్వహించారు. నీట్ రీ ఎగ్జామ్‌కి హాజరైన వారిలో 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్) నీట్(యుజి)-2026 ఫలితాలను ఎన్‌టిఏ ప్రకటించింది. అభ్యర్థుల మెడికల్ అడ్మిషన్. కౌన్సెలింగ్ ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం సాగేలా చూసేందుకు ఈ ఫలితాలను సకాలంలో విడుదల చేశారు. భారతదేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఉన్న 5,440 కేంద్రాలలో సుమారు 20 లక్షల మంది అభ్యర్థులు నీట్ రీఎగ్జామ్‌కి హాజరయ్యారు. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్, ఆయుష్ అనుబంధ కోర్సుల్లో ప్రవేశానికి 11.21 లక్షల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అభ్యర్థులందరి స్కోర్‌కార్డులు అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. 720 మార్కులకు గాను 138 మంది అభ్యర్థులు 690కి పైగా మార్కులు సాధించారు. వారిలో 93 శాతానికి పైగా అభ్యర్థులు మొదటిసారిగా నీట్ పరీక్షకు హాజరయ్యారు. 99 శాతం మంది 17 నుండి 19 ఏళ్ల వయస్సు గలవారు. ఉత్తరప్రదేశ్‌లో 1.7 లక్షలకు పైగా ఉండగా, లక్షద్వీప్‌లో 43 మంది పరీక్షకు హాజరయ్యారు. 17 మంది రాష్ట్ర స్థాయి టాపర్లు 700 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించగా, 26 మంది 690కి పైగా మార్కులు సాధించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 138 మంది అభ్యర్థులు దేశవ్యాప్తంగా 66 నగరాల నుండి ఉన్నారు. 705 మార్కులకు పైగా సాధించిన మొదటి 17 మంది ర్యాంకర్లు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు. 720 మార్కులకు గాను 19 మంది అభ్యర్థులు 700కు పైగా మార్కులు సాధించారు. 1,492 మంది అభ్యర్థులు 650 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 10,160 మంది అభ్యర్థులు 600 మరియు అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 90,780 మంది అభ్యర్థులు 500 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. జనరల్‌లో 2.91 లక్షలు, ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులు 5.12 లక్షలు, ఎస్సీ 1.59 లక్షలు, ఎస్టీ 63,716, జనరల్ ఈడబ్ల్యూఎస్ 95,026, పిడబ్ల్యూబిడి 3,666మంది, పిడబ్ల్యూడి 303 మంది అర్హత సాధించారు.

# తల్లికి వందనం జమ

>> ఈ మేరకు ఈ పథకాన్ని 2026-2027 విద్యాసంవత్సరానికి వర్తింపజేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇందుకోసం రూ.10,120.78 కోట్ల చెల్లింపునకు విద్యాశాఖ అనుమతినిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులిచ్చారు. తద్వారా 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.ఈనెల 22 నాటికి 64,76,590 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమకానుంది. అదే రోజున స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో అర్హుల జాబితా ప్రకటిస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఆగస్ట్ 3 వరకు స్వీకరిస్తారు. ఆ తర్వాత సప్లిమెంటరీ జాబితాను ఆగస్ట్ 10 నాటికి విడుదల చేస్తారు. కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆగస్ట్ 25 వరకు గడువు విధించారు. వీరిలో అర్హులైన వారిని ఆగస్ట్ 30న ప్రకటించి ఆదే రోజు వారి తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారు.

మరోవైపు తల్లికి వందనం పథకం కోసం 1.55 లక్షల మంది ఇళ్ల వివరాలు లేవని విద్యాశాఖ పేర్కొంది. ఈసారి ఈ పథకాన్ని అంగన్వాడీలకు కూడా వర్తింపజేస్తారు. దీంతో మంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం నెలకు రూ.10,000లు, పట్టణ ప్రాంతాల్లో రూ.12,00లకు మించకూడదు. రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబానికి 3 ఎకరాల్లోపు మగాణి, 10 ఎకరాల్లోపు మెట్ట లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఫోర్ వీలర్ ఉంటే పథకం వర్తించదు. ట్రాక్టర్లు, ఆటోలు, ట్యాక్సీలకు మినహాయింపు ఇచ్చారు.అలాగే సంవత్సరం నెలకు కరెంట్ వినియోగం సగటున 300 యూనిట్లలోపు ఉండాలి. పురపాలిక పరిధిలో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థిరాస్తిని కలిగి ఉండకూడదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ తర్వాత పింఛన్ పొందేవారు ఈ పథకానికి అనర్హులు. పారిశుద్ధ్య కార్మికులకు మినహాయింపు ఉంటుంది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఇన్ కమ్ ట్యాక్స్ చెల్లిస్తే ఈ పథకం వర్తించదు. రాష్ట్ర గృహ డేటాబేస్‌లో ఉండాలి.

## సెప్టెంబరులో స్థానిక ఎన్నికలు!

**విజయవాడ, జులై 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నాయి. తొలుత మున్సిపల్ ఎన్నికలను సెప్టెంబర్‌లో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనుంది. ఆ తర్వాత గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని ప్రాథమికంగా ఎపి సర్కార్ భావిస్తోంది. ఈ నెల 27వ తేదీ నుంచి 45 రోజుల పాటు తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రతిపక్ష నేతల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు. డోర్ టూ డోర్ క్యాంపెయిన్ ఎన్నికల ప్రచారంగా ఉపయోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు జోనల్ కోఆర్డినేటర్లు, పార్టీ నేతల సమావేశంలో టిడిపి అగ్రనేతలు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఖాళీగా ఉన్న నియామక పదవులన్నింటిని వెంటనే భర్తీ చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

## వారం - వర్జ్యం

17-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
తదియ ఉ.6.28, చవితి తె.4.44
మఖ సా.6.40
వర్జ్యం : ఉ.7.19-ఉ.8.50, 2) రా.2.29-తె.4.02
దు.ఉ.8.19-ఉ.9.11, 2) మ.12.39-మ.1.31
శుభసమయం : ఉ.6.00-7.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వారఫలం

**మేషం:** మిత్రులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. రాజకీయ రంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం:** చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.

**మిథునం:** పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించడానికి కాలం కలిసి రాదు. జాగ్రత్తలు అవసరం.

**కర్కాటకం:** సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.దూర ప్రాంతాల నుండి కీలక సమాచారాలు అందుతాయి.

**సింహం:** సంక్షేమ పథకాల వలన లాభపడతారు. పొదుపు చేయాలనుకునే ఆలోచనలు కార్యరూపం దాల్చవు.

**కన్య :** కీలక విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**తుల :** పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. ఆస్తివివాదాలు తీరుతాయి.

**వృశ్చికం:** మానవసేవే మాధవసేవని నమ్ముతారు. అనుకూల ఫలితాలు అధికంగా ఉంటాయి. విందులు, వినోదాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** ఉద్యోగస్తులు తమ తోటి వారితో అప్రమత్తంగా మెలగాలి. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**మకరం:** కుటుంబంలో చెప్పుకోదగిన మార్పులు ఏర్పడవు. అంతా మంచికే అనుకొని సర్దుకు పోవటం మంచిది. వస్త్రలాభం.

**కుంభం:** వివాహ యత్నాలు ఫలిస్తాయి. పాతబాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**మీనం:** మనోధైర్యంతో మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో ప్రశంసించ బడతాయి. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



జగన్నాథుని రథం ముందు శుభ్రం చేస్తున్న చంద్రబాబు

# అమరావతిలో జగన్నాథ రథయాత్ర

## ఆధ్యాత్మికత ఒక్కటే ఒత్తిడి తగ్గించే మంత్రం: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 16,ప్రభాతవార్తప్రతినిధి:** రోజువారీ జీవితంలో ఒత్తిడి తగ్గించే అత్యుత్తమ మంత్రం ఆధ్యాత్మికత ఒక్కటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు మన దేవాలయాలని సిఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలో మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన అన్నారు. ఈ కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాల లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. అందరి జీవితాల్లో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరేందుకు ఆధ్యాత్మికతే మార్గమని ఆయన వివరించారు. అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అమరావతి రాజధానిలోని వెంకటపాలెం నుంచి జగన్నాథుడి రథయాత్రను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే సంప్రదాయ క్రతువులను అనుసరిస్తూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలతో కూడిన రథం ముందు సిఎం బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రంచేసి స్వామివారి రథ యాత్రను తాడుతో లాగి ప్రారంభించారు. అమరావతి రాజధాని నగర బృహత్ ప్రణాళికతో కూడిన చిత్ర పటాన్ని శిరస్సుపై ధరించి విశ్వ నగరిగా అమరావతి ఎదగాలని ముఖ్యమంత్రి జగన్నాథ స్వామిని కోరుకున్నారు. అంతకు ముందు అక్కడే ఏర్పాటు చేసిన రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సిఎం ప్రసంగించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన ఉమ్మడి కుటుంబాలు రావాలని మైక్రో ఫ్యామిలీలు కాదని సిఎం అన్నారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే జగన్నాథ రథ యాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందని.. అలాంటి రథ యాత్రను అమరావతిలో తొలిసారి నిర్వహించటంపై సిఎం సంతోషం వ్యక్తంచేశారు. ప్రతీ యేటా జగన్నాథ రథ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ సంస్థ ప్రకటించిందని అన్నారు. ఆధ్యాత్మికత, ప్రజా సేవలో ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25 వేల పాఠశాలల్లో ఆహారం అందిస్తున్నాయన్నారు. ఎపిలోని 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా 1.80 లక్షల మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆహారం అందిస్తోందన్నారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ లాంటి సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. జగన్నాథ రథ యాత్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# కదిలిన జగన్నాథ రథాలు

>> గుండెపోటుకు గురై మృతిచెందినట్లు తేలింది. వీరితోపాటుగా మొత్తం 120 మందికిపైగా గాయాలపాలయ్యారు. లక్షలాదిమంది తరలిరావడంతో రథాలు లాగేందుకు భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట తీవ్రమయింది. ఈకారణంగానే ఇరువురు మృతిచెందడం సుమారుగా వందకుపైగా భక్తులు గాయపడటం జరిగింది. గుండిచా ఆలయం సమీపంలో మరీచకోట్‌కు చేరువలో ఈ దుర్ఘటన సంభవించింది. భక్తులు భారీ సంఖ్యలో రావడంతో అదుపుతప్పి తొక్కిసలాటకు దారితీసినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలో ఆసుపత్రులకు తరలించారు. బోడా దండాపై రథం లాగుతుండగా ఈ ఘటన జరిగింది. ఊపిరాడకపోవడంతో ఒక భక్తుడు స్పృహ కోల్పోయినట్లు సమాచారం. అతడిని వెంటనే పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు, ఆసుపత్రికి చేరుకునేసరికే అతడు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. గాయపడిన వారికి అత్యవసర వైద్య బృందాలు చికిత్స అందిస్తున్నాయి. ఒక్కసారిగా తొక్కిసలాట జరగడంతో ఇద్దరు మృతిచెందడంతోపాటు కిందపడి అనేకమంది గాయాలపాలయ్యారు. ఇక రథయాత్ర కోసం ప్రభుత్వం కూడా భారీగా ఏర్పాట్లు చేసింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్యసిబ్బంది మోహరించారు. అయినాకూడా ఒకచోట పెద్ద ఎత్తున గుమిగూడడంతో ఈ తొక్కిసలాట జరిగినట్లుగా తెలుస్తోంది. వెంటనే పోలీసులు స్పందించి పలువురిని రక్షించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ లక్షలాది మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భక్తులు రథాలవైపు దూసుకురావడంతోనే ఒకరినొకరునెట్టుకుని, కిందపడిపోయి ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో పలువురు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

అత్యంత వైభవంగా గురువారం ప్రారంభమైన రథయాత్ర మహోత్సవంలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు పూరీకి తరలివచ్చారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి కొలువై ఉన్న రథాలను లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. జై జగన్నాథ్ నినాదాలతో పూరీ వీధులు మార్మోగాయి. యేడాదికి ఒకసారి గర్భగుడి నుంచి బయటకు వచ్చి, గుండిచా ఆలయంలోని తన అత్తవారింటికి వెళ్లే జగన్నాథుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. జగన్నాథుడి ఆశీస్సులతో అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. రథయాత్రకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనాతో ఒడిశా ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. భద్రత కోసం 13వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని, కేంద్ర బలగాలను మోహరించారు. 19 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 473 సిసిటీవీ కెమెరాలు, 65 భారీ ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. 13వేల మందికిపైగా భద్రతా సిబ్బంది విధుల్లో నిమగ్నం అయ్యారు.

## మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై16(ప్రభాతవార్త):** మాజీమంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల లో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తూ అందులో భాగంగా గార్డ్ ఆఫ్ హానర్ సందర్భంలో పోలీసులను తోసివేసిన సంఘటనలో మాజీమంత్రి వైకాపా నేత అంబటి రాంబాబుతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు తీవ్ర ఆటంకం కలిగించినట్లు లిఖితపూర్వక ఫిర్యాదుతో పెద్దాపురం డీఎస్పీ, పెద్దాపురం, జగ్గంపేట సీఐల సమక్షంలోనే పోలీసులపై తోపులాటపై ఏఆర్ ఎస్ఐ వెలుదూటి అప్పలరాజు, పలువురు కానిస్టేబుళ్ల ఫిర్యాదుతో కిర్లంపూడి పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 132, 3(5) కింద అంబటి రాంబాబు సహా మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రభుత్వ లాంచనాలు తో దివంగత ముద్రగడ పద్మనాభంకి ఘనంగా వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ప్రభుత్వ లాంఛనంగా పోలీసులు గాడ్ ఆఫ్ హానర్ ప్రారంభించారు. దీంతో పోలీసులకు అడ్డుపడుతూ వారిని అంబటి తోసివేయడంతో ఈమేరకు కేసు నమోదు చేశారు.

# 1.5 టిఎంసిల నీటి విడుదల

>> కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం జూలై 16న విడుదలైన నీరు ఐదు రోజుల వ్యవధిలో కర్నూలు జిల్లాకు చేరనుంది. ముందుగా జిల్లాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపి నగర ప్రజలకు తాగునీటి సరఫరా కొనసాగించేలా చర్యలు చేపడుతున్నారు. అయితే నీరు ప్రయాణించే క్రమంలో ఆవిరి, భూమిలోకి ఇంకి పోవడం తదితర కారణాలతో సుమారు 400 క్యూసెక్కుల మేర నష్టం సంభవించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వర్షాలు లేకపోయినా ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు కొంతమంది రైతులు కాలువల నుంచి నీటిని మళ్లించే అవకాశాలు ఉన్నందున జలచౌర్యం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నీటి విడుదలతో కర్ణాటక రాష్ట్ర పరిధిలోనే భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోకి నీరు ప్రవేశించిన తర్వాత కర్నూలు వరకు నీరు చేరేందుకు పోలీసు, రెవెన్యూ, సాగునీటి శాఖల సమన్వయంతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయంలో తహసీల్దార్లు, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని జిల్లా కలెక్టర్ తెలిపారు. తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించాలని, ట్యాంకుల నుంచి నేరుగా నీటిని తీసుకునేందుకు ప్రయత్నించినా లేదా సాగునీటిగా మళ్లించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు అత్యల్పంగా కురిసినందున ప్రస్తుతం సాగునీటిని అందించే పరిస్థితి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అయితే రైతుల్లో మాత్రం ఆందోళన నెలకొంది. నీటి కొరతతో పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లో తుంగభద్ర నుంచి నీరు విడుదల కావడం ఆశలు కలిగించినా, తాగునీటికే పరిమితం చేయడంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జలచౌర్యం, ప్రవాహ నష్టం కలిపి చివరకు జిల్లా తాగునీటి అవసరాలకు ఎంత మేర నీరు అందుతుందన్న దానిపై అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నీటితో కర్నూలు జిల్లా తాగునీటి సంక్షోభానికి తాత్కాలిక ఉపశమనం లభించే అవకాశం ఉన్నప్పటికీ, రానున్న రోజుల్లో వర్షాలు కురవకపోతే మళ్లీ తుంగభద్ర డ్యాంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఆక్వా రైతుల సబ్సిడీకి తిలోదకాలు ఇచ్చిన జగన్
# ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరం
**• ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**విజయవాడ, జూలై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ విధానాన్ని నిర్వీర్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆక్వా రైతుల గురించి మాట్లాడటం ఆశ్చర్యకర మని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఓ నోట్‌ను విడుదల చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆక్వా ప్రాంతాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్లుగా విభజించి వేలాది మంది రైతులను విద్యుత్ సబ్సిడీకి దూరం చేశారని మంత్రి పేర్కొన్నారు. జగన్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానంతోనే ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని సరిదిద్దుతూ అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ప్రతి అర్హులైన రైతన్నలకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులు, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులకు కూడా విద్యుత్ సబ్సిడీ అందిస్తోందని మంత్రి గొట్టిపాటి వివరించారు. వివిధ వర్గాల జీవనోపాధికి అండగా నిలిచేలా విద్యుత్ రాయితీలను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగంతో పాటు ఆక్వా రంగం, ఇతర కీలక వ్యవస్థలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తూ జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న యాత్రలు, పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ స్వలాభం కోసమేనని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# విజయనగరాన్ని రాష్ట్రానికి వెన్నెముకగా తీర్చిదిద్దండి
**• జలధార-జలహారతితో భూగర్భ జలాలు పెరిగాయి • ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు**
**సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి • రాష్ట్ర ఇన్‌చార్జి, హోం మంత్రి వంగలపూడి అనిత**

**విజయనగరం, జూలై 16 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లాను వెనుకబడిన జిల్లాగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలిచే జిల్లాగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇన్‌చార్జ్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలధార- జలహారతి కార్యక్రమం ఫలితంగా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందన్నారు. జిల్లాలో మొత్తం 8,059 ఎంఐ ట్యాంకులుండగా, వాటిలో 6,447 ట్యాంకుల పనులకు మంజూరు లభించిందని, ఇప్పటికే 6,442 ట్యాంకుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 2,549 కాలువల పనులు కొనసాగుతున్నాయని, రూ.320.62 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు. ఈ పనుల ద్వారా 1.28 కోట్ల పనిదినాలు కల్పించడంతో పాటు పూడిక తొలగింపు కారణంగా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి అదనపు ఆయకట్టుకు అవకాశం ఏర్పడిందన్నారు. సమర్థవంతంగా అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సాగునీటి శాఖ అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.



**ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ:** ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు.

**రైతులకు ఎరువుల కొరత లేదు:** రైతులకు పంటల బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిస్థాయి పారదర్శకతతో జరుగుతోందన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేస్తూ, రైతులను అనవసరంగా ఆందోళనకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతు బజార్లలో ప్రత్యేక ఆర్గానిక్ ఉత్పత్తుల కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగడం శుభపరిణామం. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి విద్యా వ్యవస్థలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

**గృహాల మౌలిక సదుపాయాల పూర్తి:** గృహ నిర్మాణ కార్యక్రమంలో ఇప్పటికే 60 శాతానికి పైగా మౌలిక సదుపాయాలు కల్పించామని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు.

**త్వరలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన అన్ని అనుమతులు లభించాయని, త్వరలో భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అనిత వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా భాగస్వాములు కావాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, గ్రీష్మ, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

## మూడు పోర్టుల అభివృద్ధికి
## రెండో దశ భూసేకరణకు ఉత్తర్వులు

**విజయవాడ, జూలై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు పోర్టుల అభివృద్ధికి రెండో దశ భూసేకరణకు ఉత్తర్వులు జారీ చేశారు. మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల అభివృద్ధికి రెండో దశలో 6,248.54 ఎకరాల భూమి సేకరణకు నిర్ణయం తీసుతున్నారు. రూ.1,638.52 కోట్లతో భూసేకరణకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు 1,903.39 ఎకరాల కోసం రూ.440.52 కోట్లు, మచిలీపట్నం పోర్టుకు 1,420.70 ఎకరాల కోసం రూ.347 కోట్లు, రామాయపట్నం పోర్టుకు 2,924.45 ఎకరాల కోసం రూ.851 కోట్ల వ్యయం వెచ్చించనున్నారు.

## మద్యం మత్తులో క్షణికావేశం
## నిర్ణయాలతో కుటుంబాలను చిన్నాభిన్నం

**విజయవాడ, జూలై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం మత్తులో, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, సంబంధిత వ్యక్తుల భవిష్యత్తును కూడా అంధకారంలోకి నెడతాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. మద్యం తీసుకోవడం వలన ఆలోచనా శూన్యత ఏర్పడుతుందన్నారు. మద్యం వలన కలిగే ప్రమాదాలను ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. మద్యం వలన కుటుంబాలకు కుటుంబాలు అల్లకల్లోలం అవుతున్నాయన్నారు. అలవాటుగా మద్యం తీసుకోవడం. ఏదో కారణ దొరకబుచ్చుకుని లిక్కరు తాగడం చాలా నష్టాన్ని తీసుకుని వస్తుందన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో చోటుచేసుకున్న సంఘటనలే మద్యం వలన కలిగే అనర్థాలకు నిదర్శనమన్నారు. ఈ రెండు ఘటనలపై కాకినాడ జిల్లా పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సున్నితమైన ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

## డాక్టర్ పూర్ణచందుకి లోకగురు పురస్కారం



**విజయవాడ, జూలై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విలువల విద్య, విలువైన విద్య వ్యాప్తికి కృషిచేసే విద్యార్థి వికాస వాహిని స్వచ్ఛంద సంస్థ ఈ సంవత్సరం లోకగురు పురస్కారాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, ఆహార శాస్త్రవేత్త, తెలుగు భాషోద్యమ నేత డాక్టర్ జి వి పూర్ణచందుకి అందిస్తోంది. విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు వేములపల్లి కేశవ రావు తెలిపారు. జివి పూర్ణచంద్ గత యాభై సంవత్సరాలుగా వారి ప్రసంగాల ద్వారా, రచనల ద్వారా ఆరోగ్యశాస్త్రములో, సాహిత్య ప్రక్రియలలో అనేకమంది సామాన్య జనులను విజ్ఞాన వంతులుగా చేసినందుకు ఈ లోకగురు పురస్కారం తో సత్కరించబడుతున్నారు. ఈ కార్యక్రమము విద్యార్థి వికాస వాహిని సంస్థాపక దినోత్సవం గురుపూర్ణిమ సందర్భముగా జులై 29న విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపములోని సర్వోత్తమ గ్రంధాలయములో నిర్వహించబడునని తెలియచేస్తూ విద్యార్థి వికాస వాహిని సభ్యులను, శ్రేయోభిలాషులను, విద్యావేత్తలను, విద్యార్థులను, ఉపాధ్యాయులను, రచయితలను, రోటరియన్లను, పూర్ణచందు సన్నిహితులను సాదరముగా ఆహ్వానిస్తున్నాము. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ శేషసాయి ముఖ్య అతిథిగా విచ్చేసి పురస్కార ప్రదానం చేస్తారు.

# ఆసియాలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా ఎస్వీ జూలాజికల్ పార్క్
**• పార్క్‌లో అతిపెద్ద నైట్ సఫారీ • నైట్ ట్రైన్‌కు రూపకల్పన • లోటు భర్తీకి నిధులు, పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దే దిశగా అడుగులు • స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి**

**తిరుపతిరూరల్, జూలై 16 ప్రభాతవార్త:** శ్రీవేంకటేశ్వర జూలాసికల్ పార్కును ఆసియాలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మెన్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. జూ పార్కులో ఆసియాలోనే అతిపెద్ద నైట్ సఫారీతో పాటు ప్రత్యేక నైట్ ట్రెన్ ఏర్పాటు దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. గురువారం జూ కమిటీ ఎస్వీ జూ పార్కును సందర్శించారు. జూ పార్కును సందర్శించిన కమిటీ ఆధాయం-వ్యయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించింది.

ప్రస్తుతం జూకు సంవత్సరానికి సుమారు రూ.10కోట్ల ఆధాయం వస్తుండగా, నిర్వాహణకు రూ.18కోట్ల రుపాయాలు ఖర్చు అవుతుందని అధికారులు వివరించారు. రూ.8కోట్ల రుపాయాల లోటును భర్తీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయ్యన్నపాత్రుడు తెలిపారు. టిటిడి నుంచి రూ.3కోట్లు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా మరో రూ.3కోట్ల ఎంపి నిధుల నుంచి రూ.2కోట్ల సమీకరించే ప్రణాళిక ఉందని చెప్పారు. జూ పార్కు అభివృద్ధి మూడు దశల్లో అమలుచేయాలని కమిటీ నిర్ణయించింది. ఆధునిక సౌకర్యాలు, ఆకర్షణీయ ప్రదర్శనలు, పర్యాటక అనుభవాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టి, జూను దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కలిగించేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని, అటవీశాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు.





జూ ప్రాంగణంలో పచ్చదనం పెంపొందించేందుకు అయ్యన్నపాత్రుడు, సభ్యులు ఎమ్మెల్యే కలిసి మొక్కలు నాటారు.

చంద్రగిరి ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజవర్గంలో 3100 ఎకరాలలో విస్తరించి ఉన్న ఎస్వీ సూ పార్కు ఆసియాలోనే అతిపెద్దది కావడం గర్వకారణమని అన్నారు. జూను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**సౌకర్యాల పరిశీలన – సందర్శకుల సంఖ్యపై ఆందోళన**
ఎస్వీ జూ సందర్శకుల సంఖ్య తగ్గిపోవడంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి గల కారణాలను విశ్లేషించి మరింత మంది పర్యాటకులను ఆకర్షించే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించింది. జూ పార్కులో మౌలిక వసతుల మెరుగుదలకు రూ.18కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని కమిటీ తెలిపింది. ఆధునిక హంగులు, సదుపాయాలు కల్పించి ఎస్వీ జూ పార్కును దేశ వ్యాప్తంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, టిడిపి నాయకులు బడి సుధాయాదవ్, నాగూరు శ్రీనివాసులు, ఉసిరిపాటి శ్రీనివాసులు, కత్తి సుధాకర్, కాయం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, పార్టీ నాయకులు బడి సుధా యాదవ్, నాగూరు శ్రీనివాసులు, కత్తి సుధాకర్, కాయం వెంకటేష్, ఉసిరిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## శ్రీవారి సేవలో నారా భువనేశ్వరి

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురువారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని శ్రీవారిని ప్రార్థించినట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించారు. ఉదయం ఆమె వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆనందనిలయుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారుల పర్యవేక్షణలో దర్శన ఏర్పాట్లు చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కల్పించారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# 'కొండెక్కని' మోనోరైల్ ప్రతిపాదనలు!

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** అనూహ్యంగా తిరుమలకు రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి తగ్గట్లు మరింత సులభంగా కొండకు భక్తులు చేరుకునేందుకు తీసుకున్న పలు నిర్ణయాలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమైపోయాయి. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు రవాణా మార్గాలుగా ఉన్న రెండు ఘాట్‌రోడ్లు తీవ్ర విపత్తులను తట్టుకోలేక పోతుండటం జరిగింది. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గంగా మోనో, ట్రామ్‌రైల్ నడపాలని గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ, విపత్కర సమయంలోనూ తిరుమలకు ప్రస్తుతం ఉన్న ఘాట్‌రోడ్డులు అనుకూలంగా లేకపోతే వైఖానస ఆగమానికి ఆటంకం లేకుండా రోడ్డుపై నడిచే మోనో,ట్రామ్‌రైల్ తరహాలో నడిపితే ఎలా ఉంటుందనే అభిప్రాయం 2021లోనే అప్పటి పాలకమండలి ప్రతిపాదన చేసింది. ఎట్టిపరిస్థితుల్లోనూ శేషాచలంలో తిరుమలకొండకు తీగలపై నడిచే రైలు వంటి(రోప్‌వే)జోలికి వెళ్ళబోమని కూడా స్పష్టం చేశారు. గతంలోనే ఇదే విషయంగా హైదరాబాద్ మెట్రో ఎండి ఎన్‌విఎస రెడ్డితో చర్చించి నివేదిక కూడా తెప్పించుకుంటామని తెలిపారు. నివేదిక ప్రకారం ఆగమ పండితులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అయితే ఈ హామీ పూర్తిగా నెరవేరలేదు. ఆస్ట్రియాలో ఎత్తయిన కొండలపైకి మోనోరైలు వెళుతోందని, దానిని మోడల్‌గా తీసుకుని తిరుమలకు రైలు ఏర్పాటును పరిశీలిస్తామని చెప్పారు. 2020-2024మధ్య కాలంలో ఈ ప్రతిపాదనపై ఊహాగానాలు తప్ప కనీసం డిపిఆర్ వరకు కూడా వెళ్లలేదు. శేషాచలం అడవుల్లో వెలసిన తిరుమల క్షేత్రంలో పర్యావరణాన్ని పరి రక్షించేందుకు వీలుగా మోనోరైలు ప్రతిపాదన కొంత వరకు ఉపయోగపడుతుందని కూడా భావించారు. ఆ తరువాత ఈ అంశంపై చర్చించిన దాఖలాలు లేవు. 2021నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు తిరుమలకు వచ్చే రెండో ఘాట్ రోడ్డుపై భారీగా కొండచరియలు విరిగి జారి పడటం, రక్షణగోడలు, రోడ్లు ధ్వంసమైన విషయం విదితమే. మూడురోజులు కొండపైకి వాహనాల రాకపోలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఏకంగా అప్పట్లో రాత్రి వేళ పూర్తిగా తిరుమలకు వాహనాలను అనుమతించకుండా నిలుపుదల చేశారు. దీంతో తిరుమలకు మూడో ఘాట్ అవసరాన్ని టిటిడి పాలకమండలి మళ్ళీ తెరపైకి తీసుకువచ్చింది. అయితే పదేళ్ళక్రిందట తీసుకున్న నిర్ణయం, ప్రతిపాదనల మేరకు రెండోఘాట్‌రోడ్డులో లింకురోడ్డు నుంచి మోకాళ్ళపర్వతం మీదుగా తిరుమల జిఎన్‌సి వరకు మూడో ఘాట్ రోడ్డు అవసరమని గుర్తించారు. కానీ ఇప్పటి పరిస్థితుల్లో తిరుమలకు వచ్చే రెండో ఘాట్ రోడ్డు వర్షాలకు తట్టుకుని సాఫీగా లేదని ఐఐటి నిపుణులు హెచ్చరించారు.



దీంతో పూర్తిగా మూడో ఘాట్ రోడు మార్గం అవసరాన్ని మరోసారి అప్పటి టిటిడి పాలక మండలి, అధికారులు తెరపైకి తీసుకువచ్చారు. కానీ ఈ మూడో ఘాట్ రోడ్డు నిర్మాణం కడప జిల్లా వైపు నుంచి కాలినడక మార్గంగా వున్న అన్నమయ్య కాలిబాటను అభివృద్ది చేయాలని కూడా నిర్ణయించారు. ప్రత్యామ్నాయంగా మూడో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపడితే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుకలుగుతుందని గతంలో ఉన్న టిటిడి అధికారులు, పాలకమండలి యోచనచేసింది. ఈ మార్గం వల్ల హైదరాబాద్, కర్నూలు, కడప వైపు నుండి వచ్చే భక్తులకు ప్రయాణదూరం తగ్గడమే గాక సులభంగా తిరుమలకు చేరుకునేం దుకు వీలు కలుగుతుందని భావించారు. ఈ నేపథ్యంలో ఆ పనులు, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవగా మోనోరైలు విషయం చర్చకే పరిమితమైంది.



## శ్రీవారి ఆశీస్సులతో కోరిక నెరవేరింది
**• తిరుమలలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల తిరుమలకు వచ్చినపుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఒక కోరిక కోరుకున్నానని, అది మూడు రోజులకే నెరవేరిందని అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు విశ్వాసం వ్యక్తం చేశారు. తన కుమారుడికి రాజ్యసభ సీటు వచ్చిందన్న స్పీకర్ అయ్యన్న వన్యప్రాణి సంరక్షణ కమిటీ చైర్మన్‌గా తిరుపతి జూపై సమీక్షకు వచ్చాచన్నారు. సౌకర్యాల లేమితో ఉన్న తిరుపతి జూకు భారీగా తగ్గిన సందర్శకుల సంఖ్యతో టిటిడి సహకారంతో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జూలో సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, తన రాజకీయ జీవితానికి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గతంలో తాను స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు రాజ్యసభ ఎన్నికలు ఇంకా జరగలేదని గుర్తుచేసుకున్నారు. స్వామివారి దయ, ప్రజల ఆశీర్వాదమే అని అయ్యన్నపాత్రుడు వివరించారు.

## 26 నుండి కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల26 నుండి 28వ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు ముందుగా 25న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే నిత్యార్చనలు, ఉత్సవాలు, కైంకర్యాల్లో తెలియక సంభవించిన దోషాలకు పరిహారంగా, ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు శైవాగమ శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల ద్వారా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ మరింత వృద్ధి చెందుతుంది.



## మళ్లీ తిరుమల కొండ కిటకిట
## - వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల భక్తజన సంద్రంగా మారింది. వారాంతంకు ముందే ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. వేలాదిగా భక్తులు దేశం నలుమూలల నుంచి తిరుమలకు చేరుకుంటున్నారు. గురువారం ఉదయానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో శిలాతోరణం వరకు బారులు తీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఐదు గంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. గురువారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు సర్వదర్శనంలో మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి వరకు 85,255మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. సాధారణంగా శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. భక్తులు భారీగా చేరుకోవడంతో గదుల కోసం సామాన్యభక్తులు నిరీక్షిస్తున్నారు.

# ఆగస్టు -సెప్టెంబర్ నెలల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు
**• పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అప్రమత్తం • ఇంధన సంస్థలకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్**

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, అలాగే ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న దృష్ట్యా, రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీ తేజ్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ, ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ (గ్రిడ్) ఏ.కె.వి. భాస్కర్‌తో పాటు ఏపీఎస్ఎల్‌డీసీ, ఏపీపీసీసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థల సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ లభ్యత, డిమాండ్, ఆగస్టు-సెప్టెంబర్ 2026 నెలలకు అవసరమయ్యే విద్యుత్ వనరులు,



ఉత్పత్తి సామర్థ్యం, ప్రసార వ్యవస్థ సన్నద్ధత, విద్యుత్ కొనుగోలు, బొగ్గు నిల్వలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.

రాష్ట్రంలో జూలై నెలలో ఇప్పటివరకు ఎన్నడూ లేనంతగా విద్యుత్ వినియోగం నమోదైందని, జూలై 15, 2026న రోజువారీ విద్యుత్ వినియోగం 285 మిలియన్ యూనిట్ల (ఎంయూ)కు చేరుకోవడం రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో జూలై నెలకు సంబంధించి అత్యధిక డిమాండ్‌గా నమోదైందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగడం, నైరుతి రుతుపవనాల ఆలస్యం, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, గృహ వినియోగ రంగాల్లో విద్యుత్ అవసరాలు పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితిని సమీక్షించిన కె. విజయానంద్, రానున్న నెలల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని విద్యుత్ సంస్థలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సంసిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు.

వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటల పాటు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. డిస్కమ్‌లు విద్యుత్ డిమాండ్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైతే పవర్ ఎక్స్ఛేంజీలు, టర్మ్‌అహెడ్ మార్కెట్ వంటి వేదికల ద్వారా ముందస్తుగానే అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు విషయంలో ఆలస్యం జరగకుండా, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తగిన స్థాయిలో బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ జెన్‌కో అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గరిష్ఠ విద్యుత్ అవసరాల సమయంలో ఉత్పత్తిలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా బొగ్గు సరఫరా, నిర్వహణ, యంత్రాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్న విజయానంద్, ఏపీఎస్ఎల్‌డీసీ, ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీపీసీసీ, మూడు డిస్కమ్‌ల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని ఆదేశించారు.

విద్యుత్ డిమాండ్, వనరుల లభ్యత, గ్రిడ్ స్థిరత్వం, ప్రసార వ్యవస్థ సామర్థ్యం, విద్యుత్ కొనుగోలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ వంటి అంశాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రసార వ్యవస్థలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్‌స్టేషన్లు, కీలక విద్యుత్ మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత బలోపేతం చేయాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, గృహ వినియోగదారులు, సేవారంగం సహా అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన 24గంటల విద్యుత్ సరఫరా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముందస్తు ప్రణాళిక, సమయానుకూల విద్యుత్ కొనుగోలు, సమర్థవంతమైన గ్రిడ్ నిర్వహణ, విద్యుత్ సంస్థల మధ్య సమన్వయంతో రానున్న నెలల్లోనూ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ చెప్పారు.

17-7pg4_17-7pg4.qxd 16/Jul/26 10:22 PM Page 1



వార్త


కొంత మందిని అదృష్టం వరిస్తుంది. చిత్రమేమిటంటే వారెప్పుడూ అదృష్టంపై ఆధారపడేవారు కాదు.

న-ఫ్రాంక్లిన్

# ఆర్భాటాలే కానీ ఆచరణేది?

మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం గురించి పెద్దలు పదేపదే చెప్తుంటారు. అమ్మ భాషలో ఉన్న ఆత్మీయత, ఆనందం మరెందులోనూ లభించదని తెలియని విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషలకు లిపి లేకపోవడంతో విద్యారూపంలో అందించే ప్రయత్నాలు చేయకపోవడం తదితర కారణాలతో కాలగర్భంలో కలిసిపోతున్నాయి. రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన తెలుగు భాష పరిస్థితి అంత ఆశాజనకంగా కన్పించడం లేదు. ఒకనాడు సంస్కృతం, ప్రాకృతం, అరబిక్, పార్శీ, ఉర్దూ, పోర్చుగీసు, ఇంగ్లీషుతోసహా అనేక భాషల ప్రభావాన్ని తట్టుకొని నిలబడగలిగిన తెలుగు ప్రస్తుతం ఆశించిన మేరకు ఆదరణ లభించడం లేదేమోననిపిస్తున్నది. అయితే మాతృభాష తెలుగుపై పాలకులకు అభిమానం, ప్రేమావాత్సల్యం లేదనుకోలేం. తెలుగుకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు సభలు, సమావేశాలు ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇదంతా తెలుగుభాషపై ఉన్న మక్కువను చాటేందుకు, తెలుగును నలుదిశలా వ్యాప్తి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలే. మరొకపక్క తెలుగు రాష్ట్రాల్లోనే క్షేత్రస్థాయిలో ఇంగ్లీషు మోజులో పడి తెలుగుకు తీరని అన్యాయం చేస్తున్నారనే వాదనను కొట్టివేయలేం. తెలుగుభాషకు జరుగుతున్న ద్రోహం, అందువల్ల సామాన్యుడు పడుతున్న ఇబ్బందుల గురించి ఆలోచిస్తే ఆవేదన కలగక తప్పదు. ఇదంతా పరాయి ప్రభువులు ఎవరో చేస్తున్నది కాదు. ఉభయ రాష్ట్రాల్లో తెలుగు ప్రజల ప్రతినిధులమని చెప్పుకుంటున్న కొందరు నేతలే కావడం విచారకరం. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారినమాట వాస్తవమే కావొచ్చు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధిచెందుతుంటే తెలుగు, తెలుగు అంటూ పరిమితులు గీసుకుంటే ఎలా అని ప్రశ్నించేవారు ఉన్నారు. అభివృద్ధివైపు పరుగులు పెట్టవద్దని చెప్పడం లేదు. కానీ మాతృభాషపైన అభిమానం పెంచుకోవడం తప్పుకాదు. అన్యభాషలను ద్వేషించమని అనడం లేదు. కానీ తెలుగు రాష్ట్రాల్లో మమ్మీ, డాడీ చదువులు ఆరంభమైన తర్వాత తెలుగు బోధన తగ్గిపోతున్నది. తెలుగు భాష బోధించే ఎయిడెడ్ పాఠశాలలు దాదాపు కనుమరుగైపోయాయి. ఇంగ్లీషు చదివించడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. తెలుగు మాట్లాడే వారిని ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచూపుచూడడం పరిపాటిగా మారిపోయింది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు హిందీతో పోటీపడిన తెలుగు క్రమేపీ తన ప్రభావాన్ని కోల్పోతున్నది. తమిళ, కన్నడ, మళయాలం వంటి వాడుకలో ఉన్న ఇరవైఆరు ద్రవిడ భాషల్లో తెలుగుది ఒక ప్రత్యేకస్థానమని చెప్పొచ్చు. ఒకప్పుడు రాజ్యాలేలిన భాషలు క్రమేపీ కనుమరగయ్యే పరిస్థితికి చేరుకుంటున్నాయి. గ్రీకు, లాటిన్, భారత్‌లో సంస్కృతం తదితర భాషల పరిస్థితి అలాగే ఉంది. ఎన్నో దేశాలు మాతృభాషలోనే విద్యాబోధన చేసుకుంటున్నాయి. ఉన్నతస్థాయిలో ఆంగ్లభాషలోకి భావాలను అనువదించుకుంటూ తల్లి భాషను కాపాడుకుంటున్నారు. జపాన్, సింగపూర్, కాంబోడియా, వియత్నాం, థాయిలాండ్ మలేషియా తదితర దేశాల్లో మాతృభాషలోనే పాఠశాల విద్యాబోధన జరుగుతున్నది. ఇక రష్యా, ఫ్రాన్స్, చైనా తదితర దేశాల అధ్యక్షులు ఆంగ్లభాషలో సరైనపరిజ్ఞానం ఉన్నా విదేశీ నాయకులతో తమతమ భాషల్లోనే మాట్లాడుతున్నారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో తెలుగులో తమ భావాలను స్పష్టంగా చెప్పగలిగినా, ఆంగ్లంలో వ్యక్తం చేసే పరిజ్ఞానం లేకపోయినా, వచ్చీరాని మాటలతో ప్రయత్నిస్తున్నారే తప్ప స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడడం నామూషీగా భావించే రోజులు దాపురించాయి. తెలుగు అమలుకు ఎన్నో చట్టాలు చేశారు. మరెన్నో నిబంధనలు విధించారు. దశాబ్దాలు దాటిపోయినా నేటికీ అవి అమలుకు నోచుకోవడం లేదు. పేరుకు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఏవో నామమాత్రపు అధికారాలు తప్ప కనీసం కార్యాలయాల్లో తెలుగు అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకునే అధికారాలు కట్టబెట్టలేదు. గతంలో పనిచేసిన అధికార భాషా సంఘం అధ్యక్షులు జిల్లాల్లో పర్యటించి ఏమేరకు అమలు చేస్తున్నారో, చేయకపోతేఎందుకు చేయలేదంటూ సమీక్షలు, సమావేశాలు పెట్టి సంబంధిత అధికారులను నిలదీసి నోటీసులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆపరిస్థితికూడా లేదు. అది అలంకారప్రాయంగా తయారయింది. ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు బోధనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చినవారేప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషును ప్రవేశపెడుతున్నారు. జీవిత సారాంశాన్ని వడబోసి రచించిన సుమతీ, వేమన, దశరథి లాంటి శతకాలు కనుమరగైపోయాయి. ఇదంతా ఒక ఎత్తైతే ఉభయ రాష్ట్రాల్లో తెలుగుఅమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, అశ్రద్ధ, సామాన్యులను సైతం తీవ్రఇబ్బందులకు గురిచేస్తున్నది. గతంలో ఒకసారి పోలీసు అకాడమీచేసిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల్లో చాలావరకు ఆంగ్లభాష పరిజ్ఞానం లేకపోవడం, చార్జ్‌షీట్‌లో ఏం రాశారో తెలియక పోవడంతో న్యాయస్థానం ముందు తడబడడంతో కేసులు వీగిపోతున్నాయి. ఒక్క పోలీసు శాఖకు సంబంధించిందే కాదు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే అనేక విభాగాలలో ఇదే పరిస్థితి నెలకొంటున్నది. స్థానికభాష కొంతైనా వచ్చి ఉండాలని ఆనాటి బ్రిటిష్ పాలకుల నిర్ణయం మేరకు 1816లో భారత్‌కు వచ్చిన సివిల్ ఉద్యోగి చార్లెస్‌ఫిలిప్స్ బ్రౌన్ తెలుగుభాషను నేర్చుకోవడమే కాదు ఏకంగానిఘంటువును రూపొందించి తెలుగు ప్రజలకు మరిచి పోలేని సేవలు అందించారు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి తెలుగు గురించి గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోండి కానీ తెలుగుకు పుట్టినిల్లు అయిన తెలుగురాష్ట్రాల్లోనేతెలుగుకు అన్యాయం జరగడం ఏమాత్రం సమంజసం కాదు.

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

సమస్యలు వస్తే గందరగోళపడకు, నువ్వు విజయం సాధించవలసిన పరీక్షలుగా వాటిని భావించి ఎదుర్కో.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### మూఢ నమ్మకాల నిర్మూలన చేపట్టాలి

నిన్న కర్ణాటకలోని చిక్ బల్లాపూర్‌లోని ఒక మహిళ ఒక జడ్జి కూర్చునే కుర్చీపై క్షుద్ర పూజలు లాంటివి చేస్తే ఆమెను అరెస్ట్ చేశారు. డెబ్బైతొమ్మిదేళ్ళ స్వతంత్ర భారతంలో ఇలాంటి క్షుద్ర పూజలు నిజమని నమ్మేవారున్నారంటే ప్రభుత్వాలు సిగ్గుపడాలి. గతంలో ఒకసారి కర్ణాటక ముఖ్యమంత్రి యెద్యూరప్ప కూడా తను నడిచే దారిలో ఎవరో తనకు చేతబడి చేశారని, దారిలో నిమ్మకాయలు, మిరపకాయలు, పసుపు చల్లారని ప్రకటించాడు. అంతే కాదు తనకు కష్టాలురాకుండా ఎవడో సంఖ్యా శాస్త్రజ్ఞుడు చెప్పాడనీ యద్యురప్పపేరును యడియారప్పగా మార్చుకున్నాడు. అయినా కష్టాలుతీరలేదు. కర్ణాటక లోనే ఇప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్నాయన అప్పుడు ముఖ్యమంత్రి, అసెంబ్లీ సమావేశాలు జరిపితే కీడు అని ఎవడో జ్యోతిష్కుడు చెప్పాడనిఅసెంబ్లీ సమావేశాలు కొంతకాలం జరపలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్జెంటుగా మూఢ నమ్మకాల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజలను చైతన్య వంతులుగా చెయ్యాలి.

– నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలి

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్, ఎస్సి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి మండల తహసిల్దార్ అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోని దళిత కమ్యూనిటీ ప్రజల ఆధ్వర్యంలో దళిత గ్రామ అభివృద్ధి కమిటీలను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలి. నూతన సంస్కరణలోభాగంగా గ్రామాలలో ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడిన దళితుల అభివృద్ధి కోసం దళిత అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలి. ఆకమిటీలలో విద్యావంతులు, మహిళలు, యువకులు, దళిత ఉద్యోగి ఒకరు ఉండే విధంగా కమిటీలు ఏర్పాటు చేయాలి.

– ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలి

గ్రామాల్లో ప్రతి ఒక్కమనిషికి అర్హులైన పథకాలను, ఆరోగ్యాన్ని అందించే విధంగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలి. నిధులు గ్రామపంచాయితీ నుండి విడుదల చేసి అందరి ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నెలలో రెండు సార్లు వివిధ పథకాల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పాత భవనాల భద్రత

వర్షాకాలం ప్రారంభమైతే దేశంలోని అనేక నగరాల్లో పాత భవనాల భద్రత మరోసారి చర్చనీయాంశంగా మారుతుంది. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ఒక భవనం కూలిపోవడంతో పలువురు శిథిలాల కింద చిక్కుకున్న ఘటన పట్టణాభివృద్ధిలో భవన భద్రత ఎంత కీలకమో గుర్తు చేసింది. ఇది ఒక్క నగరానికే పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా పాత భవనాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలు, సరైన నిర్వహణలేకపోవడం ప్రజలప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో గోడలు బలహీనపడటం, పునాదులు దెబ్బతినడం వంటి కారణాలతో ప్రమాదాల అవకాశం మరింత పెరుగుతుంది. స్థానిక సంస్థలు పాత భవనాలపై క్రమం తప్పకుండా నిర్మాణ భద్రతా తనిఖీలు నిర్వహించి, ప్రమాదకర భవనాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలోసాంకేతికత జీవితం సులభతరం చేస్తున్న కొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడే శక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవి. మనిషిముఖం, స్వరం, మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సిన ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం.

– కె.నారాయణస్వామి, నల్గొండజిల్లా

### రీల్స్‌కు బానిస కావొద్దు

నేడు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా చాలామంది రీల్స్‌కు బానిసలుగా మారుతున్నారు. చేతిలో ఫోన్ ఉంటే చాలు, గంటల తరబడి రీల్స్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. కొద్దిసేపు చూడాలని ప్రారంభించిన రీల్స్ గంటల తరబడి సమయాన్ని వృథా చేస్తాయి. దీనివల్ల చదువు, పని, కుటుంబానికి కేటాయించాల్సినసమయం తగ్గిపోతుంది. అంతేకాకుండా ఏకాగ్రత తగ్గి, సృజనాత్మక ఆలోచనలు కూడా మందగిస్తాయి సమయం అమూల్యమైనది. కాలాన్ని వృథా చేసే రీల్స్ కంటే, భవిష్యత్తును నిర్మించే పనులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. మీ లక్ష్యాలకు మాత్రమే బానిసలుగా మారండి.

–ఎన్. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# స్వావలంబనే ఆర్థిక స్థిరత్వానికి ఆలంబన

*ఏ ఒక్కదేశం అన్ని రంగాల్లో స్వయంస్వావలంభన సాధించలేదు. కొన్నిదేశాలు ఎన్ని వనరులున్నా ఏదో ఒక విషయంలో వెనకబడే ఉన్నాయి. అది అగ్రరాజ్యమైనా, అభివృద్ధి చెందుతున్న దేశమైనా, పేద దేశమైనా. ఆయిల్ నిక్షేపాలు అధికంగా ఉన్న దేశాలు కూడా కేవలం చమురు ద్వారా భవిష్యత్తులో ప్రజల అవసరాలు తీర్చే పరిస్థితులు ఉండకపోవచ్చు. రాబోయే పరిణామాలను ఊహించి ప్రతీ ఒక్క దేశం వైజ్ఞానిక, సాంకేతిక రంగాలతోపాటు ప్రజలకు నిత్యావసరమైన ఆహారాన్ని సమకూర్చుకోవడంలో విశేష కృషి చేయాలి. పంటలకు అనుకూలంగా లేని భూములపై పరిశోధనలు జరగాలి. శాస్త్రవేత్తలు తలచుకుంటే సాధ్యం కానిదేమీలేదు. భారతదేశం కూడా భవిష్యత్ అవసరాల దృష్ట్యా శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాలతోపాటు ఆహార భద్రతకు వీలు కల్పించే వ్యవసాయాన్ని ఇతోధికంగా ప్రోత్సహించాలి.*



సుంకవల్లి సత్తిరాజు

ఆర్థిక స్థిరత్వం దేశాభివృద్ధికి సోపానం. అయితే ప్రపంచంలోని ఇతర దేశాల్లో సంభవిస్తున్న పరిణామాలు అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయి. కోవిడ్ మహమ్మారి, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌యుద్ధం, భారత దేశం ఆర్థికంగా నష్టపోయిన విషయం కాదనలేని సత్యం. రష్యా, ఉక్రెయిన్ల మధ్య సంవత్సరాల తరబడి సుదీర్ఘంగా సాగుతున్న యుద్ధం ప్రభావం భారత్‌పై పడలేదు. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయినా కొద్ది నెలల క్రితం వరకు భారత్ ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా కొనసాగింది. అయితే ట్రంప్ భారత్‌పై సాగిస్తున్న ట్రేడ్ వార్‌తో, హార్మోజ్ జలసంధి వద్ద ఏర్పడిన ప్రతిష్టంబనతో భారత్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్న మాట వాస్తవం. ఈ కారణంగానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ నాల్గవ స్థానం నుండి ఆరవ స్థానానికి పడిపోయింది. రూపాయి విలువ క్షీణించింది. అయితే ఈ పరిస్థితులన్నింటినీ అధిగమించి త్వరలోనే భారత్ ఆర్థికంగా బలపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుత భారతదేశ జిడిపి 4.15 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కాబడింది. ఇదే సందర్భంలో ప్రజల జీవన ప్రమాణాల స్థాయి మెరుగపడాలి. యువతను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి. ప్రజల జీవన ప్రమాణాల స్థాయి పెంచడమే నిజమైన అభివృద్ధి. భారతదేశం ప్రకృతి సిద్ధమైన వనరులకు పుట్టినిల్లు. సహజ సంపదతో పాటు మానవ వనరులు కూడా విరివిగా ఉండడంతో దేశ ఆర్థికాభివృద్ధికి అత్యంత అనుకూలమైన పరిస్థితులు భారత్ లో ఉన్నాయి. ఇతర దేశాలు పేరుకి సంపన్న దేశాలుగా, అగ్రరాజ్యాలుగా కొనసాగుతున్నప్పటికీ, ఆయా దేశాల్లో యువశక్తి కొరవడడం వలన, ఇతర దేశాలను బెదిరించి బ్రతకడం, ఆయుధాలను అమ్మి ఆర్థికంగా బలపడడం వంటి చర్యలతో తన అస్థిత్వాన్ని కొనసాగిస్తున్నాయి. భారత దేశంలో ఇలాంటి పరిస్థితులు లేవు. భారత్‌కు యువతరం అత్యంత విలువైన సంపద. నదులు, అడవులు, వ్యవసాయ భూములతోపాటు భూగర్భ జల, ఖనిజ వన రులతో భారతదేశం సిరిసంపదలతో తులతూగే పరిస్థితులు న్నాయి. అయితే మనం ఆశించిన కలలు కేవలం కల్లలు గానే మిగిలిపోతున్నాయి. దీనికి గల కారణాలను విశ్లేషించుకుని, దేశాభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకుని కనీసం రాబోవు తరాలకైనా పేదరికం లేని భారత దేశాన్ని అందించాలి. భారతదేశ ఆర్థిక స్థితిగతులను విశ్లేషణ చేసే ముందు 'స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం' అనే అంశం ఆధారంగా దేశ ఆర్థిక అభివృద్ధిని అంచనా వేయాలి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి 33–34 కోట్ల జనాభా గల భారతదేశం నేడు సుమారు 140 కోట్లకు పెరిగి, జనాభాలో ప్రపంచంలో ప్రథమ స్థానం ఆక్రమించింది. జనాభా పెరిగింది. ప్రజావసరాలు పెరిగాయి. అయితే మనం ఆశించిన స్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా పెరగలేదు. ప్రపంచంలో ఒక బలమైన ఆర్థికవ్యవస్థగాభారత దేశం ఎదిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా, చైనా, జర్మనీ, జపాన్, యు.కెల తర్వాత భారత్ ప్రపంచంలో బలమైన ఆర్థికవ్యవస్థ కలిగిన దేశంగా రూపాంతరం చెందింది. మరోవైపు ప్రపంచ బ్యాంకు 2027వ సంవత్సరానికి గాను భారత జిడిపి వృద్ధి రేటు 6.6 శాతంగా ఉంటుందని తెలిపింది. 2027–28 ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధిరేటు



7.2 శాతంగా ఉండవచ్చని ఒక అంచనా. జి.డి.పి పెరుగుదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర శ్రమచేయాలి. అభివృద్ధి అంకెల్లో కాకుండా ప్రజల జీవన ప్రమాణాల స్థాయిలోను, ప్రజల వాస్తవ తలసరి ఆదాయంలోను ప్రతిబింబించాలి. ఏది ఏమైనప్పటికీ భారతదేశంలో పెరిగిన జనాభాకు కావలసిన కనీస అవసరాలు తీర్చడంకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భుజస్కంధాలపై ఉంది. ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రజల వద్ద వివిధరూపాల్లో పన్నులు వసూలు చేస్తున్నాయి. ప్రజల సంపద ప్రజలకు ఖర్చు చేయడం ప్రభుత్వాల విధి. స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో భారతదేశంలో ప్రజలకు కనీస సదుపాయాలు లేవు. విద్య, వైద్య రంగాలు అత్యంత వెనుకబడి ఉన్నాయి. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో పరిస్థితులు చాలావరకు మారిపోయాయి. విద్యారంగం కొంత పుంతలు తొక్కింది. అక్షరాస్యత పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరగడంతోదేశం ఆహార సమస్యను అధిగమించింది. విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. ఉపాధికి అనేక మార్గాలు ఏర్పడ్డాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా దేశ అభివృద్ధి ముఖ్యం. దేశం ముందున్న సవాళ్లను, సమస్యలను అధిగమించడానికి కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలి. అయితే రానురాను అలాంటి భావన అడుగంటుతున్నది. రాజకీయ లక్ష్యాల కోసం జరిగే పోరాటంలో ప్రజలు పరాజితులౌతున్నారు. రాజకీయ వైరం అభివృద్ధికి శరాఘాతంలా మారుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలాంటి పరిణామాలు దేశాభివృద్ధికి అవరోధం కలిగిస్తాయి. దేశంలో ఫెడరల్ వ్యవస్థ మనుగడలో ఉంది. రాష్ట్రాలు చెల్లించే పన్నులతో కేంద్రం వివిధ రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తూ, దేశ భద్రత దృష్ట్యా కొన్ని విశిష్ఠ అధికారాలను రాజ్యాంగబద్ధంగా తనవద్ద కేంద్రీ కరించుకోవడం జరిగింది. రాష్ట్రాలు అభివృద్ధి చెందకపోతే దేశం కూడా అభివృద్ధి సాధించలేదు. కేంద్రంలో ప్రభుత్వాలు ఎలా ఏర్పడుతున్నాయో, రాష్ట్రప్రభుత్వాలు కూడా అదే పద్ధతిలో ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడుతున్న మాటవాస్తవం. ప్రజలు చెల్లించే పన్నులతో నడుస్తున్న ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన బాధ్యతను నిర్వర్తించాలి. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను చులకనగా చూస్తున్నదని, డీ లిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గించాలని చూస్తున్నదనే ఆరోపణల్లో వాస్తవమెంత? కొన్ని రాష్ట్రాల నుండి అధిక పన్నులురాబడుతూ ఆ రాష్ట్రాల వాటా పట్ల వివక్షభావం ప్రదర్శిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ వాదన ఇందుకు భిన్నంగా ఉంది. తాము అన్ని రాష్ట్రాల పట్ల సమభావంతోనే ఉన్నట్టు చెబు తున్నది. ఏ ఒక్కదేశం అన్ని రంగాల్లో స్వయంస్వావలంభన సాధించలేదు. కొన్నిదేశాలు ఎన్ని వనరులున్నా ఏదోఒక విషయంలో వెనకబడే ఉన్నాయి. అది అగ్రరాజ్యమైనా, అభివృద్ధి చెందుతున్న దేశమైనా, పేద దేశమైనా. ఆయిల్ నిక్షేపాలు అధికంగా ఉన్న దేశాలు కూడా కేవలం చమురు ద్వారా భవిష్యత్తులో ప్రజల అవసరాలు తీర్చే పరిస్థితులు ఉండకపోవచ్చు. రాబోయే పరిణామాలను ఊహించి ప్రతీ ఒక్క దేశం వైజ్ఞానిక, సాంకేతిక రంగాలతోపాటు ప్రజలకు నిత్యావసరమైన ఆహారాన్ని సమకూర్చుకోవడంలో విశేష కృషి చేయాలి. పంటలకు అనుకూలంగా లేనిభూములపై పరిశోధనలు జరగాలి. శాస్త్రవేత్తలు తలచుకుంటే సాధ్యం కానిదేమీలేదు. భారతదేశం కూడా భవిష్యత్ అవసరాల దృష్ట్యా శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాలతో పాటు ఆహార భద్రతకు వీలు కల్పించే వ్యవసాయాన్ని ఇతోధికంగా ప్రోత్సహించాలి. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయానికి, వ్యవసాయ ఆధారిత రంగాలకు పెద్దపీట వేయాలి. మన ఆలోచనలు అభివృద్ధి వైపే సాగాలి తప్ప, శాశ్వతం కాని పదవుల చుట్టూ పరిభ్రమించకూడదు. రాజకీయాలు ప్రజాజీవితానికి ఇబ్బంది కలిగించకూడదు. యువశక్తికి దేశాభివృద్ధిలో కీలక భాగస్వామ్యం కల్పించాలి. దేశ ప్రజల తలసరి ఆదాయం వాస్తవంగా ఉన్నత స్థితికి తీసుకురావాలి. నాణ్యమైన జీవన ప్రమాణాలు నెలకొల్పాలి. విద్య, వైద్య రంగాలను ఉన్నతంగా తీర్చిదిద్ది అందరికీ ఉచితంగా విద్య అందించాలి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో భారత దేశ ప్రగతి చక్రాలను సక్రమమైన పంథాలో నడిపించాలి. సరిహద్దు దేశాలపట్ల భారత్ జాగరూకత వహించాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రదర్శిస్తున్న భారత్ వ్యతిరేక వైఖరిని రాబోవు అమెరికా నేతలు కొనసాగించబోరనే గ్యారంటీలేదు. కనుక డాలర్‌తో ముడిపడిన దిగుమతులను

# సవాళ్లను అధిగమిస్తేనే సాంకేతికంగా ముందడుగు

వనకల్ల వీరప్ప


రక్షణ, టెలికాం, ఆటోమొబైల్స్, ఏఐ, ఆరోగ్య సంరక్షణ... ఇలా నేడు అన్నింటికీ సెమీకండక్టర్లు ప్రాణావసరాలుగా మారాయి. ఆధునిక సాంకేతిక జగత్తుకు మెదడుగా, 21వ శతాబ్దపు చమురుగా అవి గుర్తింపుపొందాయి. వాటి తయారీపై ఆలస్యంగా దృష్టిసారించిన ఫలితంగా ప్రస్తుతం దేశానికి కావాల్సిన చిప్‌లలో 90శాతానికి పైగా దిగుమతులే దిక్కవుతున్నాయి. కొవిడ్ సమయంలో సరఫరాలు స్తంభించి పరిశ్రమలు కుదేలయ్యాయి. ఈ దురవస్థను తప్పించేందుకు చిప్‌లను స్థానికంగానే డిజైన్ చేసుకోవడంతోపాటు తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ తదితరాల్లో స్వావలంబన సాధించేందుకు ఇండియా నడుంకట్టింది. అందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆదిలోనే సంక్లిష్ట చిప్‌ల జోలికి వెళ్లకుండా దేశవిస్తృత ప్రయోజనాల రీత్యా వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని నీతి ఆయోగ్ రోడ్‌మ్యాప్ ఇటీవల సూచించింది. ఈ క్రమంలోనే గుజరాత్‌లోని సానంద్‌లో జపాన్, థాయ్‌లాండ్ సంస్థల సహకారంతో సిద్ధమైన కర్మాగారాన్ని ప్రధానమంత్రి మోడీ మొన్న ప్రారంభించారు. ఇది గడిచిన నాలుగు నెలల వ్యవధిలో పట్టాలకెక్కిన మూడో సెమీకండక్టర్ పరిశ్రమ కావడం విశేషం. ఏడాదికి 20కోట్ల చిప్‌లతో మొదలుపెట్టి, రాబోయే రోజుల్లో కొత్త ప్లాంటు తయారీ సామర్థ్యాన్ని 500 కోట్లకు తీసుకెళ్లాలన్నది లక్ష్యం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఇక్కడినుంచి విదేశాలకూ ఎగుమతులు సుసాధ్యమై 'మేకిన్ ఇండియా' ప్రస్థానం మరోమెట్టుకు చేరుతుంది! దేశీయంగా సెమీకండక్టర్ల వినియోగం ప్రస్తుతంతో పోలిస్తే, 2030 నాటికి రెట్టింపవుతుందని అంచనా. పీఎల్ఐ వంటిపథకాల కారణంగా మొబైళ్ల తయారీలో ఇండియా ప్రపంచంలోనే రెండోస్థానానికి చేరింది. ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తిసైతం కొన్నేళ్లుగా జోరందుకుంది. దాంతో సెమీకండక్టర్ల అవసరం అధికమైంది. వాటికోసం చైనా, తైవాన్, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. గడిచిన తొమ్మిదేళ్లలో సెమీకండక్టర్ ఉత్పత్తులకు భారతావని 15వేల కోట్లడాలర్ల విదేశ మారకద్రవ్యాన్ని ధారపోసింది. ఈ పరాధీనతలోంచి బయటపడేందుకు ఇప్పటిదాకా రూ.1.64 లక్షల కోట్ల విలువైన 12సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టులకు ఇండియా ఆమోదం తెలిపింది. డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద 24 చిప్ రూపకల్పన ప్రాజెక్టులకూ ఊతమిస్తోంది. జపాన్, నెదర్లాండ్స్ వంటి దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో ముడిసరుకులు, యంత్రాల సరఫరాలకు ఇబ్బందులు లేకుండాచూసుకుంటోంది. అందులో భాగంగానే అమెరికా నేతృత్వంలోని 'ప్యాక్స్ సిలికా'లోనూ భాగమైంది. ఇలా ఈరంగంలో ఆత్మనిర్భరత కోసం ప్రణాళికాబద్ధంగా కృషి జరుగుతున్నప్పటికీ, ఇండియా అధిగమించాల్సిన సవాళ్లూ కొన్ని ఉన్నాయి! మైక్రో చిప్‌ల తయారీకి నిరంతరం విద్యుత్, నీటి లభ్యత తప్పనిసరి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశీయంగా ఆ మౌలిక వసతులు పాదుకొనాల్సి ఉంది. ప్రపంచవ్యాప్త చిప్ డిజైనర్లలో 20శాతం భారతీయులే అయినప్పటికీ వాటి తయారీలో నేరుగా పనిచేయగలిగిన సాంకేతిక నిపుణుల లేమి వేధిస్తోంది. సెమీకండక్టర్లకు అత్యవసరమైన ముడిసరుకుల కోసమూ విదేశాల వైపు చూడాల్సి వస్తోంది. సెమీకండక్టర్ల సరఫరా గొలుసులో ప్రపంచానికి విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగాలన్న భారత్ కల నెరవేరాలంటే వీలైనంత వేగంగా సంబంధిత

# విద్యాలయాల్లో కులవివక్షను ప్రక్షాళన చేయాలి



పాపని నాగరాజు

ఒక దేశం తన ఉన్నత విద్యాసంస్థల్లో జరిగే కుల వివక్షను స్వయంగా అధ్యయనం చేసి, పంతొమ్మిదేళ్ల తర్వాత అదే వివక్షను మళ్ళీ అధ్యయనం చేయాల్సి రావడం కాకతాళీయం కాదు. అది ఒక వ్యవస్థతనను తాను దిద్దుకోలేని నిర్మాణాత్మక వైఫల్యానికి రుజువు. 2026లో సుఖదేవ్ థోరట్ నేతృత్వంలోని కమిటీ ఢిల్లీ ఎయిమ్స్‌లో 76శాతం మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను పరీక్షకులు నేరుగా కులం అడిగినట్లు, 84 శాతం మంది మార్కులు కులం కారణంగా ప్రభావితమయ్యాయని చెప్పినట్లు నమోదు చేసింది. 88శాతం మంది హాస్టళ్లలో సామాజిక ఏకాంత వాసాన్ని అనుభవించారు. ఈ నివేదికను ప్రభుత్వమే స్వయంగా ఏర్పాటు చేసినప్పటికీ, ఎయిమ్స్ యాజమాన్యం దానిని తిరస్కరిస్తూ ఢిల్లీ హైకోర్టుకెళ్లింది. నాలుగేళ్లపాటు ఏ సిఫారసూ అమలు కాలేదు. ఈ నిర్లక్ష్యానికి మూల్యం ఎవరు చెల్లించారో చరిత్ర చెబుతుంది. అహ్మదాబాద్‌కు చెందిన ప్లంబర్ కుమారుడు దర్శన్ సోలంకి, ముంబై ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ చదువుతూ, తన కులం కారణంగా రూమ్మేట్ల ఎగతాళిని భరించలేక 2023లో ప్రాణం తీసుకున్నాడు. యాజమాన్యం అతని మరణాన్ని విద్యాపరమైన ఒత్తిడిగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. రూర్కీ ఐఐటీలో వైమానిక దళ అధికారి కుమారుడు మనీష్ కుమార్ గుడ్డోలియన్, తన సహవిద్యార్థుల కుల దూషణలను, హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యాన్ని తట్టుకోలేక 2011లోనే ఐదో అంతస్తు నుండి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఇద్దరి మధ్య పన్నెండేళ్ల అంతరం ఉన్నా కథ ఒక్కటే. వ్యక్తిగత దూషణ చేసేవారిని గుర్తించడం సులభమే, కానీ వారిని కాపాడే సంస్థాగత నిర్మాణాన్ని ఎవరూ ప్రశ్నించరు. ఈ సంస్థాగత నిర్మాణాన్నే 2025లో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ నేతృత్వంలోని జాతీయ టాస్క్ ఫోర్స్ నిర్ధారించింది. ఢిల్లీ ఐఐటీలో ఆయుష్ అశ్న, అనిల్‌కుమార్ అనే ఇద్దరు దళిత విద్యార్థుల మరణాలను హత్యలుగా భావించిన తల్లిదండ్రులు, ఎఫ్ఐఆర్ నమోదుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రెండు లక్షల నలభై మూడు వేల మంది విద్యార్థులను, రెండు వేల నూట పంతొమ్మిది సంస్థలను సర్వే చేసిన ఈ టాస్క్ ఫోర్స్, ఆత్మహత్యల నివారణకు ప్రత్యక్షమైన శాసనపరమైన చట్టం దేశంలో పూర్తిగా లేకపోవడమే అత్యంత స్పష్టమైన లోపమని పేర్కొంది. 65 శాతం సంస్థల్లో మానసిక ఆరోగ్య సేవలే లేవు, 73శాతంలో పూర్తికాల నిపుణుడు లేడు. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో సంస్థాగత జవాబుదారీతనాన్ని తప్పనిసరి చేసేచట్టాలున్నా, భారత్‌లో అలాంటి చట్టం లేకపోవడాన్ని టాస్క్ ఫోర్స్ నేరుగా ఎత్తిచూపింది. ఐఐటీ మద్రాస్‌లో పీహెచ్‌డీ స్కాలర్ సచిన్ కుమార్ జైన్ మరణానికి కారణమైన అధ్యాపకుడిని సస్పెండ్ చేసిన తర్వాత ఆ



క్యాంపస్‌లో మళ్ళీ ఆత్మహత్య నమోదు కాలేదు. జవాబుదారీతనం చూపిస్తే ఫలితం ఉంటుందనడానికి ఇదొక్కటే మనకు కనిపించే ఉదాహరణ. ఇక్కడే ఈ సమస్య కేవలం దళిత సమస్యగా మిగలదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2014 నుండి2021 మధ్య ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆత్మ హత్యకు పాల్పడిన 122 మందిలో 24 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు అయితే, 41 మంది అధికారికంగా ఇతర వెనుకబడిన తరగతులుగా పిలవబడే వర్గానికి చెందినవారు. మొత్తం మరణాల్లో 55 శాతం ఈమూడు వర్గాలవే. అయితే సంస్థల్లో వీరి ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తి కంటే చాలా తక్కువ. దళిత ఆదివాసీ బహుజన మరణాలను వేర్వేరు చూసే ధోరణి, కులం, వర్గం ఏకకాలంలో పనిచేసే అణచివేత యంత్రాంగాన్ని దాచిపెడుతుంది. జ్యోతిరావు పూలే విద్యను శూద్రాతిశూద్రులకు బ్రాహ్మణీయ జ్ఞాన గుత్తాధిపత్యం నుండి విముక్తి కలిగించే ఆయుధంగా చూశాడు. అతని దృష్టిలో పాఠశాల భవనం కేవలం ఇటుకల నిర్మాణం కాదు, అది సామాజిక అధికార పునఃపంపిణీ వేదిక. ఆ దృష్టికోణం నుండి చూస్తే, నేటి మెరిట్ భావన కులం, తరగతి కలయిక సృష్టించిన సామాజిక, సాంస్కృతిక వనరులను తటస్థమైన ప్రతిభగా చిత్రీకరించే భావజాల ఆయుధం మాత్రమే. అందుకే రిజర్వేషన్ ద్వారా వచ్చిన ప్రతి విద్యార్థీ అనర్హుడుగా ముద్రవేయబడతాడు. యాజమాన్య కోటాల ద్వారా వచ్చినవారు ఎన్నడూ ఆ ముద్రను భరించరు. మార్క్స్ చెప్పిన మిగులు విలువ దోపిడీ సూత్రం ఇక్కడ మరో రూపంలో కనిపిస్తుంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్ దొరకని 38 శాతం గ్రాడ్యుయేట్ల వాస్తవాన్ని సంస్థలు దాచిపెడుతూ, ఫలితాన్ని విద్యార్థి వ్యక్తిగత లోపంగా చిత్రీకరిస్తాయి. చదువును వస్తువుగా, డిగ్రీని అమ్మకం సరుకుగా మార్చిన ప్రైవేటీకరణ క్రమంలో, అట్టడుగు వర్గాల విద్యార్థి మరణం కేవలం సామాజిక దుర్ఘటనకాదు, పెట్టుబడితనకు లాభసాటికాని శ్రామికశక్తిని వదిలించుకునే క్రూరమైన యంత్రాంగంలో భాగంకూడా. ఈ నిర్వీర్యకరణ కొత్తది కాదు. తెలుగునేలపై దీనికి స్పష్టమైన చరిత్రఉంది. వెయ్యితొమ్మిది వందల తొంభై రెండులో నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ప్రభుత్వం పన్నెండు ప్రైవేట్ మెడికల్, ఎనిమిది డెంటల్ కాలేజీలకు దొడ్డిదారిన అనుమతులిచ్చి క్యాపిటేషన్ ఫీజుల దందాకు తెరలేపినప్పుడు, కామ్రేడ్ మారోజు వీరన్న నాయకత్వంలో పీడీఎస్‌యూ మిగతా విద్యార్థిసంఘాలను ఏకంచేసింది. తెలుగు యువత అసెంబ్లీ, సెక్రటేరియట్ ముట్టడిలతో ప్రభుత్వాన్ని ఊపిరాడకుండా చేసింది. హైకోర్టు ఆ జీవోలను రద్దు చేసి సీఎం అధికార దుర్వినియోగాన్ని తప్పుబట్టడంతో నేదురుమల్లి పదవి నుండి దిగిపోవాల్సి వచ్చింది. తర్వాత వచ్చిన కోట్ల ప్రభుత్వంలో వైద్య మంత్రి సమరసింహారెడ్డి విద్యార్థులపై లాఠీఛార్జీలు చేయించినా, ఆ ఒత్తిడి కొనసాగి చివరికి ఆయనే బర్తరఫ్ అయ్యారు. ఐక్యవిద్యార్థి శక్తి పాలకుల పీఠాలను కదిలించగలదని రుజువైన ఏడాది అది. కురుక్షేత్ర జాతీయ సాంకేతిక సంస్థలో రెండునెలల్లో నలుగురు, గోవా బిట్స్ పిలానీలో పదిహేను నెలల్లో ఆరుగురు మరణించడం ఈసమస్య రాజకీయ సరిహద్దులు దాటిందని చూపుతుంది. కానీపరిష్కారం రాజకీయ పార్టీల విద్యార్థి సంఘాల నీడల్లో దొరకదు. సమకాలీన అంశాలపై విద్యార్థి సంఘాలు స్పందించడంలేదు, ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు, వాళ్లకి వాళ్లు అని కుంచించుకుపోతున్నారు. నాటి ఐక్యత నేటి విద్యార్థి రాజకీయాల్లో పూర్తిగా కనుమరుగైంది. పరిష్కారం రాజకీయ పార్టీల విధేయతలో లేదు, సంస్థాగత జవాబుదారీతనాన్ని చట్టబద్ధం చేయడంలో, బహుజన

ong-5_ong-5.qxd 7/16/2026 10:52 PM Page 1



## ప్రజావేదికలో 75 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని శాసనసభ్యుల పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, భూ, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమ పథకాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, పెన్షన్లు, గృహాలు, ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 75 అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే ప్రతి వినతిని స్వయంగా పరిశీలించి సమస్యల స్వభావాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వెల్లడించిన ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని సంబంధిత శాఖల అధికారులతో వెంటనే చర్చించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి పెండింగ్‌లో ఉన్న అంశాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఆశపడి పెట్టుబడులు పెట్టొద్దు: ఎస్పీ హెచ్చరిక

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఆన్‌లైన్ ట్రేడింగ్, షేర్ మార్కెట్ పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ, డిజిటల్ పెట్టుబడి పథకాల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సూచించారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే పెట్టుబడి ప్రకటనలు, అపరిచితులు పంపే సందేశాలు, పెట్టుబడి గ్రూపులను నమ్మి డబ్బులు పెట్టవద్దని హెచ్చరించారు. తక్కువ సమయంలో భారీ లాభాలు, పెట్టిన మొత్తానికి రెట్టింపు రాబడి, రోజువారీ ఆదాయం వస్తుందని ఆశ చూపించి సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రారంభంలో చిన్న మొత్తాలను లాభాల రూపంలో తిరిగి చెల్లించి నమ్మకం కల్పించి, ఆ తర్వాత పెద్ద మొత్తాలను పెట్టుబడిగా వేయించి చివరికి డబ్బుతో పరారవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదుల వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను కూడా వెంటనే సంప్రదించాలని కోరారు.

## పాముకాటు బాధితులకు 108తో ప్రాణరక్షణ

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

పాముకాటు బాధితులకు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం 108 అంబులెన్స్ సేవల్లో యాంటీ స్నేక్ వెనం (పాముకాటు విరుగుడు) ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచింది. నాగుపాము, కట్లపాము, రక్తపింజర వంటి విషసర్పాలు కాటేసినప్పుడు తొలి గంటలో సరైన చికిత్స అందితే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకాశం జిల్లాలో సేవలందిస్తున్న 22 అంబులెన్సుల్లో యాంటీ స్నేక్ వెనం ఇంజెక్షన్లు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. పాముకాటు జరిగిన వెంటనే బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, కాటు వేసిన అవయవాన్ని కదలకుండా చూసుకోవాలని, గాయం వద్ద కోయడం, విషం పీల్చడం, మూలికలు వేయడం, బిగిగా కట్టు కట్టడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. వెంటనే 108కు ఫోన్ చేస్తే శిక్షణ పొందిన సిబ్బంది ప్రాథమిక చికిత్స అందిస్తూ సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తారని తెలిపారు. పాముకాటు సంభవించినప్పుడు మూఢనమ్మకాలను నమ్మకుండా వెంటనే వైద్య సేవలను ఆశ్రయించాలని, అత్యవసర సమయంలో 108 సేవలను వినియోగించి ప్రాణాలను కాపాడుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీఈఈయూ1104) ప్రకాశం జిల్లా సర్వసభ్య సమావేశం కనిగిరిలోని కేశిరెడ్డి నగర్‌లో యూనియన్ కళా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చేతుల మీదుగా యూనియన్ నోటీసు బోర్డును ఆవిష్కరించగా, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్. సంజీవరావు, సీపీడీసీఎల్ డిస్కం కార్యదర్శి నందిగామ శర్మ చేతుల మీదుగా డివిజన్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అన్నే శ్రీనివాసరావు మీటింగ్ హాల్‌ను ప్రారంభించగా, పూజా కార్యక్రమాల అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో డిస్కం కార్యదర్శి నందిగామ శర్మ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, జిల్లా అధ్యక్షుడిగా తేళ్ల జాన్సన్, జిల్లా కార్యదర్శిగా సి.హెచ్. హరికృష్ణ, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా సి.హెచ్. రవికాంత్, బి. అప్పారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.వి. ప్రతాప్, బి. సురేష్, జిల్లా కోశాధికారిగా యు. రవిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న యూనియన్ నాయకులు, సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా నందిగామ శర్మ మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డీఏ విడుదల, వేతన సవరణ (పీఆర్సీ) అమలుకు రాష్ట్ర యూనియన్ కృషి చేస్తోందని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారమే యూనియన్ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ సభ్యులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## మండవ మురళీకృష్ణ జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**





పారిశ్రామికవేత్త, ప్రముఖ సమాజ సేవకుడు మండవ మురళీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ఒంగోలులో శివం ఫౌండేషన్, సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు సమక్షంలో శివం శరణాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శివం నిత్య అన్నదాన శరణాలయంలో వృద్ధులు, నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడంతో పాటు పౌష్టికాహారం, స్వీట్లు, పండ్లు అందజేశారు. అదే రోజు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్ భాష ఆధ్వర్యంలో ప్రభుత్వ మాతా–శిశు వైద్యశాలలో ప్రసూతి తల్లులు, నవజాత శిశువులకు బేబీ కిట్లు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించడంతో పాటు సూర్యశ్రీ ట్రస్ట్‌లో దివ్యాంగులకు ప్రత్యేక పౌష్టికాహార భోజనం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ గౌరవ సలహాదారు మండవ సుబ్బారావు, మారెళ్ల సుబ్బారావులు మాట్లాడుతూ మండవ మురళీకృష్ణ విద్య, వైద్యం, జీవనోపాధి కోసం ఎన్నో కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ మానవతా దృక్పథంతో సేవలు చేస్తున్నారని కొనియాడారు. సూర్యశ్రీ ట్రస్ట్ స్థాపించినప్పటి నుంచి వేలాది మంది దివ్యాంగులు, అనాథలు, నిరుపేదలకు ట్రైసైకిళ్లు, విద్యార్థులకు ఫీజుల సహాయం, వైద్య సేవలు, జీవనోపాధికి ఆర్థిక తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాల్లో గొల్లపూడి శ్రీహరి, షేక్ సర్దార్ భాష, మోటుపల్లి వెంకటేశ్వర్లు (చౌదరి), చెరుకూరి ఆదిలక్ష్మి, సరస్వతి, నల్లమోతు రమణి, షేక్ మహబూబ్ బాషా (బాబు), డాక్టర్ జోయల్ సంధ్య, ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్లూరి మోహన్‌రావు, జనసేన నాయకులు శ్రీనివాసరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, మేడిశెట్టి సుబ్బారావు, చిక్కాల కిరణ్ కుమార్‌తో పాటు ట్రస్ట్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి 18న ప్రత్యేక లోక్ అదాలత్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



న్యాయస్థానాలలో పెండింగ్లో ఉన్న చెక్ బౌన్స్ కేసులు అప్పీల్ స్థాయిలో ఉన్న చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవడానికి ఈనెల 18వ తేదీ శనివారం స్పెషల్ లోకా అదాలత్ జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్ వి రామకృష్ణ అన్నారు. గురువారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయ స్థానం ఆవరణలోగల బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో నిర్వహించిన సమావే శంలో న్యాయమూర్తి పాల్గొని ప్రసంగిస్తూ ఈనెల 18వ తారీఖు నిర్వహించే స్పెషల్ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదుల సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రమేష్ బాబు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఒంగోలు నగరపాలక సంస్థలో 'హోర్డింగ్' దందా..!

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు నగర పాలక సంస్థ ఖజానాకు గండి కొడుతూ కొందరు అధికారులు సిబ్బంది చేస్తున్న అక్రమ ఓటింగ్‌ల దందా గుట్టురట్టవుతుంది. అడ్డగోలుగా వెలుస్తున్న హోర్డింగ్‌లు, రాజకీయ ఫ్లెక్సీల పున్యమా అని నగర పాలక సంస్థకు, జిల్లాలోని మున్సిపాలిటీలకు లక్షల్లో ఆదాయం అవిరవుతుంటే సామాన్య ప్రజలు మాత్రం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్లుగాసాగుతున్న ఈ అక్రమ తంతుపై ఎవరు నోరుమెదపక పోవడం వెనుక పెద్దల హస్తం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**- 'ఖజానా'కు గండి**

**- అధికారులకు పండుగ**

### నిబంధనలు తుంగలో తొక్కి..:

మున్సిపల్ నిబంధనల ప్రకారం ఏ ప్రకటన బోర్డు ఏర్పాటు చేయాలన్నా కౌన్సెల్‌లో తీర్మానించిన గెజిట్ మేరకు మున్సిపల్ కార్యాలయంలో లేక నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్ధిష్ట రుసుం చెల్లించి అనుమతులు పొందాలి. ముఖ్యంగా రూప్ టాప్ హోర్డింగ్‌ల ఏర్పాటుకు భవనాల, స్ట్రక్చరల్ స్టెబిలిటి దృవీకరణ పత్రం తప్పనిసరి. ఏ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారో నగర పాలక సంస్థకు గాని, మున్సిపాలిటీకి గాని ముందుగా తెలియపరచాలి. అప్పుడు గాని నగర పాలక సంస్థ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి సాయిల్ గట్టితనం, దానిని పరీక్షించి తరువాత అనుమతులు ఇచ్చేందుకు మున్సిపల్ కమీషనర్‌కు లేఖ రాస్తారు. అప్పుడు అన్ని అనుమతులు పొందిన తరువాతనే అక్కడ హోర్డింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సినిమా పోస్టర్ మొదలుకొని రాజకీయ ఫ్లెక్సీల వరకు ప్రతి దానికి నగర పాలక కార్యాలయం అధికారిక ముద్ర ఉండాలి. కానీ ఒంగోలులో ఇవేమి పట్టించుకునే నాధుడే లేడు. అనుమతులు లేకుండా ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడం నేరమని తెలిసినా అధికారుల నిర్లక్ష్యం వల్ల యధేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించబడుతున్నాయి.




### అనుమతులు లేవు.. కానీ అడ్డగోలుగా వసూళ్లు:

నగరంలోని అద్దంకి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రధాన కూడలిలో అనుమతులు లేకుండానే హోర్డింగ్‌లు దర్శనమిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటి అనుమతి గడువు ముగిసి చాలాకాలమైన కోర్టు ఉత్తర్వుల సాకు చూపుతూ అక్రమంగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హోర్డింగ్‌ల ద్వారా ఒక్కో దానికి రూ.లక్షల చొప్పున నాలుగు హోర్డింగ్‌లకు రూ.4లక్షల యజమానుల దగ్గర వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వసూళ్లలో కొంత వాటా మున్సిపల్ టౌన్ ప్లానింగ్‌లోని ఇద్దరు అధికారులకు అందుతుందనేది ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అధికారుల అండదండా:

ఈ అక్రమ వ్యవహారంలో గతంలో నగర కమీషనర్‌గా పని చేసిన అధికారి ప్రస్తుతం టౌన్ ప్లానింగ్‌లో తిష్ట వేసిన ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులు, మరి కొంత మంది సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి ఒకే చోట పాతుకుపోయిన వీరు రాజకీయ అండదండతో కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి తూట్లు పొడుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు నాయకుల పేరుతో వెలుస్తున్న ఫ్లెక్సీల వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ఇతర ప్రాంతాల్లో గాలులకు హోర్డింగ్‌లు పడి వాహనదారులకు పెద్ద ప్రమాదాలు జరిగిన ఉదాంతాలను కూడా అధికారులు నిష్క్రమించడం విడ్డూరం. నిబంధనలు పాటించని వారిపై భారీ జరిమానాలు విధించి కేసులు నమోదు చేయాలని నిబంధనలే చెప్తున్నాయి. కానీ ఒంగోలులో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఒక వైపు మితిమీరిన దనదాహం, మరో వైపు అధికారుల నిర్లక్ష్యం వెరసి నగర పాలక, జిల్లాలోని మున్సిపాలిటీల ప్రతిష్ఠ దృష్టిలో రోజురోజుకు దిగజారిపోతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతుల్లేని హోర్డింగ్‌లను తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యోగుల విభజన ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుత, నూతన జిల్లాల మధ్య ఉద్యోగుల విభజనకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఈ అంశంతో పాటు రీ సర్వే అనంతరం పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై గురువారం సిబ్బంది వ్యవహారాల స్పెషల్ చీఫ్ సెక్రటరీ షంషేర్ సింగ్ రావత్, సీసీఎల్‌ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి. రాజాబాబు, డీఆర్‌ఓ పి.వి. రమణతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల విభజనకు అనుసరించాల్సిన నిబంధనలు, విధివిధానాలను షంషేర్ సింగ్ రావత్ వివరించారు. ఉద్యోగుల విభజన ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి దశను రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కలెక్టరేట్ పరిపాలన విభాగ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రపతి ఉత్తర్వులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటి ప్రకారం ఉద్యోగుల కేటాయింపు, సీనియారిటీ జాబితాలను ఎలాంటి లోపాలు లేకుండా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సర్వీస్ రికార్డులు, కేడర్, అర్హతలు, స్థానికత, ఇతర సంబంధిత వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి తుది జాబితాలను రూపొందించాలని సూచించారు. ఉద్యోగుల నుంచి వచ్చే అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా విభజన ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని కూడా సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరే ప్రధాన లక్ష్యం - సీఎండీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీసీపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ పి.పుల్లారెడ్డి అధ్యక్షతన ప్రకాశం సర్కిల్ పనితీరుపై విజయవాడ కార్పొరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరా నాణ్యత, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం, రెవెన్యూ వసూళ్లు, లైన్ లాస్ తగ్గింపు, విద్యుత్ భద్రత, నిర్వహణ పనులు, వర్షాకాల అత్యవసర సన్నద్ధత, సబ్ స్టేషన్లు, పంపిణీ వ్యవస్థ పనితీరు వంటి అంశాలపై సవివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్– ముఫ్త్ బిజ్లీ యోజన, పీఎం– కుసుమ, ఆర్‌డీఎస్ఎస్, సబ్ స్టేషన్ల పురోగతి తదితర పథకాల అమలు పురోగతిని సమీక్షించి, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ వసూళ్లలో మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వినియోగదారులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని గౌరవ సీఎండీ పి.పుల్లారెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో డైరక్టర్ ఫైనాన్స్ ఎస్.వెంకటేశ్వర్లు, డైరక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరక్టర్ ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తి, ప్రకాశం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులోకి వైద్య సేవలు

**చీమకుర్తి, జూలై 16, ప్రభాతవార్త**





గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి వైద్య సేవలు తీసుకురావడానికి అమరావతి కృషి చేయాలని యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ కుమార్ కోరారు. చీమకుర్తి పట్టణంలో అమరావతి హాస్పిటల్ నందు నూతన లక్ష్మీ దయాగ్నొస్టిక్ కంప్యూటరైజ్ ల్యాబ్ డిజిటల్ ఎక్స రే ఈసీజీను గురువారం ప్రారంభించారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం శిద్దా సుధీర్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూకల సురేంద్ర, బొమ్మిశెట్టి రవికిరణ్, గ్రంధి హరి, చల్లగండ్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## పాతమాగులూరులో వ్యక్తి హత్య

*- గ్రామానికి చెందిన సజ్జల పిచ్చిరెడ్డిగా గుర్తింపు*

*- హత్యకు గల కారణం వివాహేతర సంబంధం*

**సంతమాగులూరు, జూలై 16, ప్రభాతవార్త**



వివాహేతర సంబంధం రెండు కుటుంబాలను చిన్నాబిన్నం చేసింది. ఒక కుటుంబం కుటుంబ పెద్ద హత్యకు గురవడం తో భార్యాబిడ్డలు వీధినిబడితే, రెండవ కుటుంబం జైలు జీవితం అనుభవించాల్సి వచ్చింది. మండలంలోని పాతమాగులూరు గ్రామంలో చోటుచేసుకున్న సజ్జల పిచ్చిరెడ్డి(42) దారుణ హత్య ఘటన మరోసారి వివాహేతర సంబంధాల దుష్పరిణామాలపై చర్చకు దారితీసింది. కుటుంబ బంధాలను, సామాజిక విలువలను దెబ్బతీసే ఇటువంటి సంబంధాలు చివరకు రెండు కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టేస్తున్నాయి. అందిన సమాచారం మేరకు పాతమాగులూరు గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వరమ్మ భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన సజ్జల పిచ్చిరెడ్డితో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో మృతుడు పిచ్చిరెడ్డి వెంకటేశ్వరమ్మ ఇంటికి వచ్చాడు. చెన్నైలో ఉంటున్న కుమారుడు విష్ణువర్ధన్ ఆకస్మికంగా ఇంటికి చేరుకున్నాడు. తల్లి వెంకటేశ్వరమ్మతో వున్న పిచ్చిరెడ్డి ని చూసి ఆవేశానికి గురైనట్లు తెలుస్తోంది. అనంతరం వారి మధ్య జరిగిన ఘర్షణలో పిచ్చిరెడ్డి తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు సమాచారం. ఘటన అనంతరం వెంకటేశ్వరమ్మ, విష్ణువర్ధన్ అద్దంకి పోలీసులకు లొంగిపోయినట్లుగా తెలిసింది.

ఘటనాస్థలాన్ని సందర్శించిన దర్శి డీఎస్పీ, సీఐ: హత్య జరిగిన విషయం తెలుసుకున్న దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ, సీఐ పి. శేషగిరిరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. హత్యకు దారితీసిన కారణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది, వేలిముద్రల నిపుణులు, ఆర్‌ఎఫ్ఎస్ఎల్ ప్రత్యేక నిపుణురాలు డాక్టర్ ప్రియాంక బృందం ఆధారాలను సేకరించారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

## కౌలు రైతుల హక్కులు- ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

**- జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి**

**ఒంగోలు, ప్రభాతవార్త**



కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, హక్కులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై విస్తృత అవగాహన కల్పించాలని ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) వారు కౌలు రైతుల కోసం రూపొందించిన ప్రచారోద్యమం కరపత్రాలను జాయింట్ కలెక్టర్ తమ ఛాంబర్‌లో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్పనా కుమారి మాట్లాడుతూ కౌలు రైతులు తమ హక్కులను తెలుసుకొని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు పంట సాగు పంట రుణాలు పంట భీమా దృవీకరణ పత్రాలు తదితర అవగాహన అంశాలను కల్పించేందుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారు ప్రచార కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని ఆమె అన్నారు. కౌలు రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, వ్యవసాయశాఖ ద్వారా అందించే సేవలు, సంబంధిత అధికారులను సంప్రదించే విధానాలను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో కౌలు రైతులకు చేరువుగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, దర్శి ఏరియా కోఆర్డినేటర్ గుంటూరు నాగమణి స్వచ్ఛ సంస్థల ప్రతినిధి బిళ్ళ శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరుగుచున్న శ్రీ మహా వారాహి నవరాత్రి ఉత్సవ వేడుకలు

**సంతనూతలపాడు, ప్రభాతవార్త**



సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శ్రీ మహా వారాహి దేవత నవరాత్రి ఉత్సవ వేడుకలు ఘనంగా జరుగుచున్నవి. ఈనెల 15వ తేదీన ఈ వేడుకలు ప్రారంభమైనవి. తొమ్మిది రోజులు పాటు ఈ వేడుకలు జరగనున్నవి. గురువారం రాత్రి ఈ వేడుకలు ఘనంగా జరిగినవి. మహిళల ఆధ్వర్యంలో వారాహి వేడుకలు ఘనంగా జరుగుచున్నవి. సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు జరుగుచున్నవి.

6:6.qxd 7/16/2026 11:26 PM Page 1



## ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన భూమిని కబ్జాకు పాల్పడుతున్న వైసీపీ ఎంపీటీసీపై చర్యలు తీసుకోండి

### - భూ సర్వేని అడ్డుకున్న వైసీపీ ఎంపీటీసీ



**నాగులుప్పలపాడు, జులై 16, ప్రభాతవార్త**

ఉప్పుగుండూరు గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణ ప్రక్రియను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అడ్డుకుంటుందని, ఆ పార్టీ ఎంపీటీసీ కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం కొరకు కేటాయించిన భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కనగాల శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ మసిముక్కు భాస్కరరావు,టీడీపీ బీసీ సెల్ నాయకులు ఉప్పుగుండూరు లక్ష్మీనారాయణలు సంయుక్తంగా పేర్కొన్నారు.గురువారం ఉప్పుగుండూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు 1940 సంవత్సరంలో ఆనాటి గ్రామ పెద్దలు ప్రజా అవసరాల కోసం సర్వే నంబర్ 78లో ఒక 1 ఎకరాల 50 సెంట్లు భూమిని ప్రభుత్వానికి దానం ఇవ్వడం జరిగిందన్నారు. ఆ భూమిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి లేఖ ద్వారా గ్రామస్తులు 50 సంవత్సరాల ప్రభుత్వ ఆసుపత్రి చిరకాల కోరిక వారికి తెలియజేయడం జరిగిందన్నారు. ఆసుపత్రి ఏర్పాటుకు భూ సేకరణ కొరకు ఆ భూమికి సర్వే జరిగే సమయంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ మున్నంగి వెంకటరావు సర్వేను అడ్డుకుంటున్నారన్నారు. ఆ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని అతని చర్యలను కట్టిడి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తుంటే ప్రతి పనిని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని అదే విధంగా గ్రామంలో కూడా ఏ అభివృద్ధి పనులు జరగకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అడుగడుగునా అడ్డుపడుతున్నారని వారు తెలియజేశారు. ఇతని ఆగడాలను అరికట్టాలని లేకుంటే ప్రజలే తగిన శాస్తి అతనికి చేస్తారని హెచ్చరించారు. గ్రామ ప్రజల చిరకాల వాంఛ వాటర్ ట్యాంకు ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 78లో ప్రభుత్వ భూమిలో అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉన్నాయని గ్రామంతో పాటు పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు కూడా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం సర్వే నంబర్ 78లోనే జరగాలని కోరుకుంటున్నారన్నారు. అయితే కుట్ర పూరితంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో ఏ అభివృద్ధి పనులు జరుగుతున్నా ఓర్వ లేక అడుగడుగునా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డుపడుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లేక అత్యవసర సమయాల్లో వైద్యం సకాలంలో అందక ఎందరో మృత్యువాత పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుంటే గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భూ సేకరణలో అడుగడుగున అడ్డుకుంటుందన్నారు. గ్రామాభివృద్ధికి అడ్డుపడే వైసీపీ ఎంపీటీసీకి ప్రజలే తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. ఆ భూమిని ఆక్రమించాలనే కుట్ర కోణంతోనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం అడ్డుకుంటే తగు మూల్యం చెల్లించుకుంటారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పిన్నిక శ్రీకాంత్, క్లస్టర్ ఇన్చార్జి కొప్పర్తి నాగయ్య, బీజేపీ నాయకులు ఆత్మకూరు వాసు, మాజీ ఎంపీటీసీ కొండ్రు ఆశీర్వాదం, త్యాగరాజు, టీడీపీ నాయకులు బెల్లం శ్రీనివాసరావు, తెలగతోటి సుబ్బయ్య, గోగినేని దుర్గ, గోపి, నల్లూరి భాస్కరరావు, సింగరయ్య, యలమంచి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతు దీక్షలో వైసీపీ మండల నాయకులు



**హనుమంతునిపాడు, జులై 16, ప్రభాతవార్త**

పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా కనిగిరిలో గురువారం భారీ నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామల సాంబిరెడ్డి, మండల ఎస్సీ సెల్ వేశపోగు గురు ప్రసాద్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు కస్తాల బాలాజీ, మండల మహిళా అధ్యక్షురాలు కస్తాల బేబీ, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు.

## స్త్రీ నిధి ఇన్సెంటివ్, రెండు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

### - సీఐటీయు జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్



**వెలిగండ్ల, జులై 16, ప్రభాతవార్త**

వీఓఏలకు రెండు నెలల వేతన బకాయిలు కనీస వేతనాలు చెల్లించాలని హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, స్త్రీ నిధి ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, స్వాలంబన అభయహస్తం, మహిళా మార్టులు పెట్టిన పెట్టుబడులు పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలని, 10లక్షల వరకు వడ్డీ రాయితీ చెల్లించాలన్నారు. గురువారం వెలుగు కార్యాలయం ఆవరణలో వీఓఏల సమావేశం ఏ.రమణ అధ్యక్షతన జరిగింది. అనంతరం జిల్లా కార్యదర్శి మాలకొండయ్య మాట్లాడుతూ 60 సంవత్సరాలు నిండిన ఈవోఏలకు నిలుపుదల చేసిన వేతన బకాయిలు చెల్లించాలని, 10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పని భారం తగ్గించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్స్ కోరకు ఈ నెల 3 న జిల్లా మార్కాపురం జిల్లా కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కర్ణ నాగేశ్వరి, క్లస్టర్ నాయకులు మాచర్ల వెంకట నాగలక్ష్మి, సుస్మిత, హేమియా, రమాదేవి, రత్నాల, రాయల మాధవి, వరలక్ష్మి, కే.జయమ్మ, శిరిష, జయావ, శాంతి, రూస్నీ, రేవతి, రోశమ్మ, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, సుమలత, ప్రీతి, శివపార్వతి, మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం



**మార్టూరు, జులై 16, ప్రభాతవార్త**

మార్టూరులోని వెంకయ్య ఆశ్రమంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జే.పంగులూరు గ్రామానికి చెందిన కె.శే జాగర్లమూడి శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు సింగమ్మ, వీర రాఘవమ్మలు అన్నదానం నిర్వహించారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివ రాజేష్, డాక్టర్ కొర్రపాటి సుబ్రహ్మణ్యం, మండవ నరేంద్రబాబులు పాల్గొన్నారు.

## రక్షణ సువార్త వినుట ద్వారా విశ్వాసం కలుగుతుంది

### - క్రీస్తును గురించిన వాక్యాన్ని ఆలోచించడం ద్వారానే నిజమైన విశ్వాసం పుడుతుంది



**పెద్దదోర్నాల, జులై 16, ప్రభాతవార్త**

రక్షణ సువార్త వినడం ద్వారా మనిషిలో విశ్వాసం కలుగుతుందని, ఆ వినుట క్రీస్తును గురించిన దేవుని వాక్యాన్ని ఆలకించడం వలనే జరుగుతుందని పాస్టర్ వై.ప్రకాశరావు తెలిపారు. పెద్దదోర్నాల మండలం జమ్మి దోర్నాల పాస్టర్ల చాట్లత్యమ్, చాట్ల విజయ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో మండల క్రిస్టియన్స్ పాస్టర్స్, ఎవాంజిలిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాస్టర్ అబ్రహం నాయక్ అధ్యక్షతన జరిగింది. ఆకలి, ప్రలోభాలకు దూరంగా ఉండి దేవుని వాక్యం నిత్యం వదవాలని, వినాలని, పాస్టర్లకు సూచించారు. పాస్టర్ ఎలకపాటి ఆశీర్వాదం మాట్లాడుతూ నిజమైన విశ్వాసం మన జీవితాలను మారుస్తుందని, దేవుని ఇష్టమైన జీవితాన్ని గడపటానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. యాజకులు దేవుడు నియమించిన ప్రత్యేక సేవకులను, కొత్త నిబంధనలో ఏసుక్రీస్తు ప్రధాన యాజకుడని, ఆయన ద్వారా రక్షించబడిన ప్రతి విశ్వాసి, సేవకుడు రాజులైన యాజక సమూహంలో భాగమై దేవుని ఆరాధించాలన్నారు. ఈ సదస్సులో పాస్టర్లు సిహెచ్ శ్యామ్ కుమార్, చాట్ల విజయ్, తంగరాల సురేష్, అబ్రహం నాయక్, కాంతి వర్ధన్, సాత్విక్, మెజెస్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు షైనింగ్ అవార్డులు



**కందుకూరు జూలై 15, ప్రభాతవార్త**

ప్రకాశం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశించిన "షైనింగ్ స్టార్స్ 2026" అవార్డులలో కందుకూరు పట్టణానికి చెందిన బి.ఆర్. ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీంతో ఒక్కొక్కరికి రూ.20 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు. విజయ సాధించిన విద్యార్థులను అభినేత చైర్మన్ డా. ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జి. బాలభాస్కరరావు, బి.నరేంద్రబాబులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు తమ సంస్థ కృషిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని విజేతలకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

## చెమిడిదపాడులో 27 లక్షలతో తూము నిర్మాణం





**గుడ్లూరు, జులై 16, ప్రభాతవార్త**

గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామంలో ఎలికేరు వద్ద శిధిలావస్థ దశలో ఉన్న తూముకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇరిగేషన్ శాఖ పరిధిలో తూము నిర్మాణం పనులకు 27 లక్షల నిధులు మంజూరు చేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరువతో నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో రెండు చెరువులు ఉన్నప్పటికి 100 ఎకరాలకు పైగా ఎలికేరు వద్ద నిర్మించిన ఈ తూము ద్వారా మాగాణి భూములకు సాగు నీరు అందుతుంది. పనులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు గురువారం జేసీబీతో పాత తూమును తొలగించే పనులు ప్రారంభించారు. కొత్త తూము నిర్మాణం కోసం నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు గ్రామస్తులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రామాయపట్నం పోర్టుపై సర్వహక్కులు ప్రభుత్వానివే

### - నిర్వహణనే పీపీపీలో ప్రైవేటుకు అప్పగిస్తున్నాం - వైసీపీ నేతల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

### - మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి




**కందుకూరు జూలై 15, ప్రభాతవార్త**

రామాయపట్నం పోర్టు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ బాధ్యతలను మాత్రమే పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నట్లు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.అంతేగానీ అమ్మడం లేదన్నారు.ఈ ప్రక్రియతో ప్రభుత్వానికి లాభదాయక మేనన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విధానమే బెటర్ ఆప్షన్ అన్నారు.గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు పోర్టును ప్రైవేటు పరం చేస్తున్నారని ముట్టడిస్తామని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.ఎవరూ నమ్మొద్దొన్నారు.పీపీపీ విధానంలో పోర్టు శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.పారిశ్రామిక హబ్ గా మారుతుందన్నారు.యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే వివరించారు.గతంలో గంగవరం పోర్టు ప్రభుత్వ వాటా అమ్మింది జగన్ కాదా అని ప్రశ్నించారు.వదిలేసిన పోర్ట్ పనులు తమ ప్రభుత్వమే పూర్తిచేసిందన్నారు.అదేవిధంగా ఇరిగేషన్ వ్యవస్థను ధ్వంసంచేశారని ఆరోపించారు.వైసీపీ నేతల ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పోర్టు నిర్వహణ,అభివృద్ధి కోసమే ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.మిగిలిన అన్ని వ్యవహారాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయన్నారు.ప్రభుత్వానికి 12 నుంచి 25 శాతం వాటా ఉంటుందని తెలిపారు..ప్రభుత్వానికి రూ.1500 కోట్లు అడ్వాన్స్ వస్తుందన్నారు.ఏడాదికి రూ.150 కోట్ల వరకు అదనపు ఆదాయం వస్తుందని వివరించారు. పోర్టులో 19బెర్తులలో 4 బెర్తులు నిర్మించడానికి రూ.5వేల కోట్లు ఖర్చు అవుతోంది. మిగిలిన 14 బెర్తులతో పాటు అభివృద్ధి చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించనందున పీపీపీ పద్ధతిని ఎంపికచేసినట్లు తెలిపారు.

### వైసీపీ 50 శాతం పనులు :

వైసీపీ హయాంలో 50శాతం పనులే పూర్తయ్యాయి.భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయటంతోపాటు ఆర్అండ్ఆర్ కాలనీలను కూటమి ప్రభుత్వం పూర్తిచేసిందన్నారు. కావున వైసిపి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు.పోర్టును ముట్టడిస్తామని వైసీపీ నేతలనడం అవగాహనారాహిత్యమేనన్నారు. మేజర్‌పోర్టును మైనర్ పోర్టుగా మార్చి పనులు మధ్యలో వదిలేసి వెళ్లి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని వస్తారని ప్రశ్నించారు.వైసీపీ అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మరన్నారు. కూటమి ప్రభుత్వ సారధ్యంలోనే రామాయపట్నం పోర్టును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు మాదాల లక్ష్మినరసింహం, పూరిమిట్ల గురునాథం,రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు,పార్టీ నాయకులు బెజవాడ ప్రసాద్,షేక్ రఫీ,నాదెళ్ల వెంకటరమణయ్య,కూనం నరేంద్ర, షేక్ రూబీ, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

## ఇనాం ఎస్టేట్ భూముల సమస్యల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, జులై 16, ప్రభాతవార్త**

ఇనాంఎస్టేట్‌భూముల సమస్యలపై విజయవాడ లోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో సీఎస్ సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. పర్చూరు నియోజకవర్గంలోని ఏదుబాడు, చెన్నుబొట్ల అగ్రహారం, వలపర్ల, జంగమహేశ్వరపురం, లక్కవరం, అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇనాం ఎస్టేట్ భూముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రైతుల డిమాండ్లపై సమగ్రంగా చర్చించారు. రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తాం, దశాబ్దాలుగా నలుగుతున్న ఇనాం భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, రైతులకు పూర్తి హక్కులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని సమావేశంలో పాల్గొన్న మంత్రులు, అధికారులు స్పష్టం చేశారు. బాధిత రైతులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రస్తుత ప్రభుత్వం చొరువతో న్యాయమైన పరిష్కారం లభిస్తుందన్న విశ్వాసం రైతుల్లో వ్యక్తమైంది.ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సీసీఎల్ఏ జయలక్ష్మీ,బాపట్ల ఒంగోలు కలెక్టర్లు వినోద్ కుమార్, రాజబాబు, ఏదుబాడు, చెన్నుబొట్ల అగ్రహారం, జంగమహేశ్వరపురం, లక్కవరం రైతులు ఉన్నారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

### - కనిగిరిలో వైఎస్సార్‌సీపీ పొగాకు రైతు దీక్ష సక్సెస్





**కనిగిరి, జులై 16, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కనిగిరి ఆర్డీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పొగాకు రైతు దీక్ష విజయవంతమైంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ నేతృత్వంలో దీక్ష చేపట్టారు. దీక్షకు హాజరైన ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు,జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవి, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, కే.ఆదెన్న, వై.వెంకటేశ్వరరావు, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య తదితర నాయకులకు దద్దాల నారాయణ యాదవ్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పొగాకుకు కిలో రూ.250 వరకు ధర లభించగా, ప్రస్తుతం రూ.160కే పరిమితమవుతోందని, దీంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. సాగు వ్యయం పెరిగినా రైతులకు గిట్టుబాటు ధర దక్కక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్ తిరస్కరణలు అధికంగా నమోదవుతున్నాయని, వేలం ప్రారంభమై దాదాపు 90 రోజులు గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని,లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, రాష్ట్ర సేవా దళ్ వాలంటరీ విభాగం ప్రధాన కార్యదర్శి ఆవుల భాస్కర్‌రెడ్డి, స్వర్ణ ఏడుకొండలురెడ్డి, కనిగిరి నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పల్నాటి భాస్కర్‌రెడ్డి, పైడాల భాస్కర్‌రెడ్డి, పైడాల రామ్మోహన్‌రెడ్డి, ఆవుల కృష్ణారెడ్డి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు రహీం, కృష్ణారావుతో పాటు కనిగిరి నియోజకవర్గానికి చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ, వార్డు స్థాయి నాయకులు, వివిధ అనుబంధ విభాగాల సభ్యులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షను విజయవంతం చేశారు.

## పామూరులో డాక్టర్ మల్లిఖార్జునరెడ్డిని కలిసిన కనిగిరి వైసీపీ నాయకులు



**పామూరు, జులై 16, ప్రభాతవార్త**

పామూరు మల్లిఖార్జున్‌రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ పొలిమేర మల్లిఖార్జునరెడ్డిని కనిగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.శ్రీహరిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా శ్రీశైలం మల్లిఖార్జున స్వామి ప్రసాదాన్ని అందించారు.

## రాజ్యసభ సభ్యులు భాష్యంను కలిసిన యారవ



**పామూరు, జులై 16, ప్రభాతవార్త**

పామూరు, కనిగిరి మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణని ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమాశ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## జిల్లా, మండల విద్యాశాఖాధికారులతో సమావేశమైన ఏఎంసీ చైర్మన్ యారవ



**పామూరు, జులై 16, ప్రభాతవార్త**

పామూరు పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మార్కాపురం జిల్లా విద్యాధికారి,మండల విద్యాధికారులతో సమావేశం అయిన ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్. ఈ సందర్భంగా పామూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన సమస్యలను మరికొన్ని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, మొదలైన వాటి గురించి ఈ సమావేశంలో జిల్లా, మండల విద్యాధికారులతో చర్చించడం జరిగింది. స్పందించిన జిల్లా, మండల విద్యాధికారులు సమస్యలు త్వరితగతిన పరిష్కరిద్దాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

### - మెయిన్ రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు



**పామూరు, జులై 16 ,ప్రభాతవార్త**

పామూరు పట్టణంలోని ఎండీఆర్ ప్లాన్ ద్వారా రూ.2.80కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మెయిన్ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యంరామకృష్ణ, నెల్లూరుపార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర, సహర శాసనసభ్యులు భాష్యం ప్రవీణ, కాకర్ల సురేష్‌లతో కలిసి కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలకుమరింత మెరుగైన,సురక్షితమైన రవాణా సౌకర్యాలను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మౌలికవసతుల అభివృద్ధి కార్యక్రమాల ను నాయకులు అభినందించారు. ఈ నూతన రహదారి నిర్మాణంతో పామూరు పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతోపాటు ప్రజలరాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమం లో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నూతలపాడులో సాగర్ కాలువ పనులు ప్రారంభం



**పర్చూరు, జులై 16, ప్రభాతవార్త**

పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో గురువారం సాగర్ కాలువ అభివృద్ధి పనులను ఏఈఈ కే.సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ విన్నకోట సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందేలా కాలువల మరమ్మత్తులు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సాగునీటి పారుదలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి సాగునీటి వసతులు ఎంతో కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూనూరు సర్పంచ్ సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమం




**పర్చూరు, జులై 16, ప్రభాతవార్త**

పర్చూరులోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి, మార్టూరు రూరల్ సీఐ బి.నాగభూషణం సూచనలతో పర్చూరు ఎస్సై పులి గోపి ఆధ్వర్యంలో ఈగిల్ టీం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పులి గోపి మాట్లాడుతూ ప్రయాణికులు, మహిళలు, యువత, ప్రజలకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, చట్టపరమైన దుష్ప్రరిణామాల గురించి వివరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా 112 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ టీం సభ్యులు, పోలీసు సిబ్బంది, మహిళలు, యువత పాల్గొన్నారు.

## ఓగూరులో క్షయవ్యాది నిర్మూలన పరీక్షలు

### - క్షయవ్యాధి నిర్మూలనకు సహకరించండి

### - జిల్లా మెడికల్ ఆఫీసర్ భానుమతి



**కందుకూరు జూలై 15, ప్రభాతవార్త**

క్షయవ్యాధి నిర్మూలనకు సహకరించాలని జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డా॥భానుమతి ప్రజలకు విజ్ఞప్తిచేశారు.ముఖ్యంగా 2030 నాటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోటి క్షయ వ్యాధిని నిర్మూలించాల్సి ఉందన్నారు. ఇందుకోసం హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఇందులో బాగంగా గురువారం మండలంలోని ఓగూరు సచివాలయంనందు క్షయవ్యాది నిర్ధారణ పరీక్షలు చేపట్టారు.జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ ఆర్గనైజేషన్ బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు.ఈ వ్యాదినివారణ ఆవశ్యతను వివరించారు.ఇందులో బాగంగా అత్యాధునిక సాంకేతికపరిజ్ఞానంతో కూడిన యంత్రాల ద్వారా 92మందికి ఎక్స్ రేలు తీశారు.తీయడం జరిగింది.వీటిని వ్యాది నిర్ధారణ అనంతరం చికిత్స ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమంలో వైద్యపర్యవేక్షణాధికారులు సిబ్బంది ఎన్ సురేష్,కే.కిరణ్ కుమార్,కే.శ్రీమన్నారాయణ,జి మంజుల డి.శరత్ బాబు ఫీల్డ్ కోఆర్డినేటర్ హెల్త్ సూపర్‌వైజర్ యం. శ్రీనివాసరావులతోపాటు పలువురు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు చేయూత.. డయాలసిస్ కేంద్రానికి శ్రీకారం

**కనిగిరి, జులై 16, ప్రభాతవార్త**

కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సారధ్యంలో శుక్రవారం కనిగిరిలో దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాల పంపిణీతో పాటు ప్రభుత్వాసుపత్రిలో నూతన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించ నున్నట్లు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ తెలిపారు. అలిమ్కో సహకారంతో కేంద్ర ప్రభుత్వ ఏడీఐపీ పథకం ద్వారా ఉదయం 9గంటలకు అమరావతి గ్రౌండ్స్ లో నిర్వహించే కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని అర్హులైన దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలు ప్రజలకు



ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని షేక్ ఫిరోజ్ పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## భగవద్గీత సారాన్ని బోధించిన సాయిబాబా

### - గురుపౌర్ణమి ఆధ్యాత్మిక ఉపన్యాసాల ముగింపు

### - వక్తలకు ఘన సన్మానం



**మార్కాపురం, జూలై 16, ప్రభాతవార్త**

గురుపౌర్ణమి పర్వదినాలను పురస్కరించుకుని మార్కాపురంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహించిన వారం రోజుల ఆధ్యాత్మిక ఉపన్యాసాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా రజనీకుమార్ (మార్కాపురం), సుబ్రహ్మణ్యం రెడ్డి (నెల్లూరు) భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. రజనీకుమార్ మాట్లాడుతూ సాయిబాబా భగవద్గీతలోని "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" అనే శ్లోకం ద్వారా గురు-శిష్య సంబంధం, గురుసేవ, వినయంతో ప్రశ్నించి జ్ఞానం పొందే విధానాన్ని నానాసాహెబ్ చందోర్కర్‌కు వివరించారని చెప్పారు. అలాగే సర్వజీవుల్లో భగవంతుడిని దర్శించడం, పండిత-పామరులను సమదృష్టితో చూడడం వంటి భగవద్గీత బోధనలను సాయిబాబా తన జీవితం ద్వారా ఆచరణలో చూపించారని వివరించారు. సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ భక్తులు కష్టాల్లో ఉన్నప్పుడు సాయిబాబా ఎల్లప్పుడూ వారికి అండగా నిలిచేవారని తెలిపారు. కుమ్మరి స్త్రీ బిడ్డ మంటల్లో పడినప్పుడు దూరంలో ఉన్నప్పటికీ బాబా రక్షించారని, అనేక మంది భక్తులకు రోగ విముక్తి కలిగించారని, ప్రాణాపాయంలో ఉన్న తాత్యా, రామచంద్ర పాటిల్‌లను కాపాడారని చెప్పారు. సంతానం లేని వారికి సంతాన భాగ్యం, వికలాంగులకు ఆరోగ్యం ప్రసాదించి భక్తుల అనేక కోరికలను తీర్చిన మహానుభావుడిగా సాయిబాబా నిలిచారని కొనియాడారు. ఉపన్యాసకులు రజనీకుమార్, సుబ్రహ్మణ్యం రెడ్డిలను మందిర అధ్యక్షులు పేరం సత్యనారాయణ, కోశాధికారినాగరాజు, కమిటీ సభ్యులు గోపాలుని కృష్ణమోహన్, విజయ్, రంగప్రసాద్, సాయిబాబా, రమణారెడ్డి, గోపిశెట్టి కొండయ్య, పిచ్చిరావు తదితరులు ఘనంగా సన్మానించారు. వారం రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన ఆధ్యాత్మిక ఉపన్యాసాల్లో పాల్గొన్న భక్తులందరికీ మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు.

## గురు పౌర్ణమి వేడుకలకు శ్రీకారం

### - షిర్డీ సాయి బాబా మందిరంలో అఖండ పారాయణ మహాయజ్ఞం ప్రారంభం



**మార్కాపురం, జూలై 16, ప్రభాతవార్త**

జూలై 29న జరగనున్న గురు పౌర్ణమి మహోత్సవాలను పురస్కరించుకుని మార్కాపురం నెహ్రూ బజార్‌లోని షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం ఉదయం 6 గంటలకు అఖండ పారాయణ మహాయజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వారం రోజుల పాటు రాత్రింబవళ్లు సుమారు 600 మంది భక్తులు బ్యాచ్‌ల వారీగా శ్రీ షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రను పారాయణం చేయనున్నట్లు మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. పారాయణంలో పాల్గొనాలనుకునే భక్తులు తమ పేర్లను మందిర పూజారికి లేదా మందిర మేనేజ్ అంగం సతీష్ నాయుడుకు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని సాయిబాబా అనుగ్రహాన్ని పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

### పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆహ్వానం : జె జే సి తురిమెళ్ళ



**కంభం, జూలై 16, ప్రభాతవార్త**

మండలంలోని తురిమెళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ (గోల్డెన్ జూబ్లీ) వేడుకలు జనవరి-2027లో నిర్వహించనున్న నేపథ్యంలో, కళాశాల పూర్వ విద్యార్థుల మొదటి సమావేశాన్ని 2026 జూలై 19 (ఆదివారం) సాయంత్రం 3:00 గంటలకు కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి సోనీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల అభివృద్ధి, స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణ, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల తురిమెళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి సోనీ విజ్ఞప్తి చేశారు.

### అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం

### - గిద్దలూరు పురపాలక సంఘం కమిషనర్



**గిద్దలూరు,జూలై 16 ప్రభాతవార్త**

పట్టణ పరిధిలో పురపాలక సంఘం ముందస్తు అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు లేదా ఇతర ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని గిద్దలూరు పురపాలక సంఘం కమిషనర్ ఈ రమేష్ బాబు తెలిపారు. గిద్దలూరు పట్టణ పరిధిలో పురపాలక సంఘం అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లు మరియు ఇతర ప్రచార సామగ్రిపై ఈ రోజు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, పట్టణ సౌందర్యం మరియు పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని అనధికార ప్రకటనల ఏర్పాటును పురపాలక సంఘం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదని పేర్కొన్నారు. అందువలన ఇకపై ఎవరైనా వ్యక్తులు, సంస్థలు, సంఘాలు లేదా రాజకీయ పార్టీలు పురపాలక సంఘం అనుమతి లేకుండా ఫ్లెక్సీలు లేదా బ్యానర్లు ఏర్పాటు చేసినట్లయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అలాగే, వాటి తొలగింపు ఖర్చును సంబంధిత నిర్వాహకుల నుండే వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు.

### షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైన స్పందన విద్యార్థులు

**రాచర్ల, జూలై 16, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థుల ప్రతిభను గుర్తించి షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేయగా వారిలో 5 మంది రాచర్ల స్పందన పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి సుధీర్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుండి 7 మంది విద్యార్థులు ఈ అవార్డులకు ఎంపిక కాగా వారిలో 5 మంది స్పందన విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు ఆర రెహనా, వి నాగ సురేంద్ర, పి దివ్య, ఓ అక్షయ్, పివి షణ్ముఖరెడ్డి లకు జిల్లా కలెక్టర్ మరియు విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా రూ.20 వేల నగదు మెమెంటో సర్టిఫికెట్ అందజేయనున్నారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి సుధీర్ కుమార్ రెడ్డితోపాటు ప్రిన్సిపల్ పి సుస్మిత రెడ్డి, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## తాళ్లూరులో 19న ఉచిత మెగా వైద్య శిబిరం

### - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - డాక్టర్ నంబుల మాల్యాద్రి



**కనిగిరి, జూలై 16, ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కేకే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ(ఆదివారం) తాళ్లూరు గ్రామంలోని పాత సచివాలయం సమీపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కేకే హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నంబుల మాల్యాద్రి తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో డాక్టర్ నంబుల మాల్యాద్రి(జనరల్, లాప్రోస్కోపిక్, లేజర్ సర్జన్), డాక్టర్ పాముల శ్వేత(క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్), డాక్టర్ కోలిశెట్టి మౌనిక(స్త్రీల వ్యాధుల నిపుణులు) ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే థైరాయిడ్ సమస్యలు, సిస్టులు, వెరికోస్ వేన్స్, పైల్స్, ఫిస్టులా, ఇతర శస్త్ర చికిత్స అవసరమయ్యే వ్యాధులకు నిపుణుల సలహాలు, వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. తాళ్లూరు, కనిగిరి పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ నంబుల మాల్యాద్రి కోరారు.మరిన్ని వివరాలకు 8008037496 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ప్రమాదకర విద్యుత్ స్తంభాలు తొలగింపు.. గార్లపేటలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**కనిగిరి, జూలై 16, ప్రభాతవార్త**

ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేట బస్టాండ్ వద్ద గర్ల్స్ హైస్కూల్ సమీపంలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఫ్రక్చర్‌ను తొలగించి వాటి స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఫ్రక్చర్‌ను ఏర్పాటు చేశారు. పట్టణ సుందరీకరణలో భాగంగా చేపట్టిన ఈ అభివృద్ధి పనులతో విద్యుత్ భద్రత మరింత మెరుగుపడింది. గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలకు ప్రమాదాల నుంచి రక్షణ కల్పించడంతో పాటు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా మరింత సురక్షితంగా అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి ఆధునిక విద్యుత్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటువంటి పనుల ద్వారా పట్టణంలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.ఉమాకాంత్, మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్,విద్యుత్‌శాఖ ఏఈఈవన్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, బుల్లా బాలబాబు, ఏనుగు శ్రీను, ముక్కుడు అంజినాయుడు, నాగ పాతూరు, పార్టీ నాయకులు, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



మార్కాపురం వార్త

### టౌన్ ఎస్సైగా బార్గవ్

**కందుకూరు జూలై 16,ప్రభాతవార్త**

కందుకూరు టౌన్ పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా బండ్ల భార్గవ్‌ను నియమించారు.బాపట్ల జిల్లా నగరం ఎస్సైగా పనిచేస్తూ ఇక్కడకి బదిలీ అయ్యారు.ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన స్థానిక శాసనసభ్యులుఇంటూరి నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు.శాంతిభద్రతల పరిరక్షణలో చట్టబద్ధంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ఎస్సైకు సూచించారు.ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లో ప్రజాప్రతినిధుల తోపాటు అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలతో పట్టణంలో శాంతి భద్రతలను పరిరక్షంచనున్నట్లు తెలిపారు.



## సమగ్ర ఓటరు జాబితా తయారీని వేగవంతం చేయండి

### - కలెక్టర్ విజయ సునీత - తహశీల్దార్లకు ప్రత్యేక శిక్షణా సమావేశం

### - రెండు రోజుల్లో బీఎల్‌వోలకు శిక్షణ పూర్తి చేయాలని ఆదేశం

**మార్కాపురం, జూలై 16, ప్రభాతవార్త**

సమగ్రమైన ఓటరు జాబితా తయారీకి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత జిల్లాలోని తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం మార్కాపురం కలెక్టరేట్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మరియు రెవెన్యూ అంశాలపై జిల్లాలోని తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 85సంవత్సరాల పైబడిన ఓటర్ల వివరాలు,మ్యాపింగ్ కాని ఓటర్ల సమాచారాన్ని ఎలా సవరించాలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పిపిటి ) ద్వారా వివరించారు. ప్రతి తహసీల్దారు తమ పరిధిలోని బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చి, రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా 2024 సంవత్సరం నుంచి ఇప్పటివరకు పరిష్కరించిన ప్రధాన సమస్యలు,ప్రజలకు కలిగిన ప్రయోజనా లపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన అంశాలను కూడా ప్రత్యేక నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, జిల్లాలోని తహసీల్దార్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.




## గ్రామ, మండల సమైఖ్య సభ్యులు వ్యాపార అభివృద్ధిని సాధించాలి

### - వెలుగు ఏపీఎం సుధాకర్‌రావు



**కొనకనమిట్ల, జులై 16, ప్రభాతవార్త**

గ్రామ, మండల సమైఖ్య సంఘాల సభ్యులు వ్యాపారాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకొని లబ్ధిపొందాలని వెలుగు ఏపీఎం బి.సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బిజినెస్ డవలప్‌మెంట్ కార్యక్రమంపై జరిగిన అవగాహన శిక్షణలో పాల్గొని మాట్లాడారు. వ్యాపారానికి ముందు ప్రణాళికలు తయారు చేసుకొని యూనిట్ నెలకొల్పుకుంటే అభివృద్ధి సాధించడంతో పాటు సుస్థిర అభివృద్ధిని సాధించవచ్చన్నారు. స్త్రీ నిధి మేనేజర్ సులోచన మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి రుణాలు సకాలంలో చెల్లించినట్లయితే స్త్రీ నిధి ద్వారా తిరిగి రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు వై.ఈశ్వరమ్మ, సీసీలు సాయిలు, అకౌంటెంట్ నాగమణి, అరుణ పాల్గొన్నారు.

## ట్రస్టు ఆధ్వర్యంలో 1008 కోట్ల శ్రీ రామనామ జపం కోసం శ్రీకారం







**గుడ్లూరు, జులై 16, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ట్రస్టు ఒక చారిత్రక అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. 108 కోట్ల శ్రీరామ్ నామ తారక మహా మంత్ర జపంతో పాటు 5 కోట్ల హనుమాన్ చాలీసా పారాయణం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారంతో 108 కోట్ల శ్రీరామ నామ జపం భక్తుల సహకారంతో పూర్తయింది. 5 కోట్ల హనుమాన్ చాలీసా పారాయణం 3 కోట్ల 50 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో 1008 కోట్ల శ్రీరామ నామ జపం కార్యక్రమానికి ట్రస్టు శ్రీకారం చుట్టింది. శ్రీరామ రామ రామ అని పలుకుతూ జపమాలతో ఒక్కొక్క పూసను కదుపుతూ చేసిన శ్రీ రామ నామ జపం 11 రోజులకు ఒక సారి భక్తులు తమ కౌంట్‌ను ట్రస్టుకు పంపవచ్చు. అలాగే హనుమాన్ చాలీసా పారాయణం కూడా కౌంట్‌గా పంపవచ్చు. ఇంటింటికి శ్రీరామ నామ జపం, హనుమాన్ చాలీసా పారాయణం కార్యాక్రమంలో భాగంగా నిరంతరం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కారక్యక్రమం 2022 నుంచి నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావు తెలిపారు. అయోధ్య శ్రీ బాలరాముడు విగ్రహం కింద బంగారు యంత్రానికి 6 కోట్ల శ్రీరామ నామ జపం దారపోసిన శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి మంగళ శాసనాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు హనుమంతరావు తెలిపారు. ఆలయం విశేషాలు గురించి వివరిస్తూ శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠకు శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి యంత్ర సమర్పణ చేయనున్నట్లు తెలిపారు. 108 కోట్ల శ్రీ రామ నామ స్థూపం నిర్మాణంతో పాటు ఆలయ నిర్మాణ ప్రాంగణంలో ప్రపంచంలో మొట్టమొదటి సారిగా హనుమాన్ చాలీసా పారాయణం స్థూపం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అందరూ కలిసి ఇటుకలపై శ్రీ రామ నామ మంత్రం లిఖించిన ఇటుకలతో ఆలయ నిర్మాణం జరుగుతున్నట్టు తెలిపారు. ప్రతి మంగళవారం వాలాగ్ర పూజ భక్తుల కోరిక మేరకు జరుగుతోందని, అలాగే ఎవరు పిలిస్తే వారి ఇంటి వద్ద కానీ, ఆ గ్రామంలో దేవాలయాల వద్ద కానీ, ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణం పూర్తి ఉచితంగా ట్రస్టు ఆధ్వర్యంలో 2022 నుంచి నేటి వరకు ప్రతి ఆదివారం, మంగళవారం, శనివారం నిర్వహిస్తున్నట్లు హనుమంతరావు తెలిపారు. ఈ 1008 కోట్ల శ్రీరామ నామ తారక మహా మంత్ర జప యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని ట్రస్టు తరుపున హనుమంతరావు పిలుపునిచ్చారు. 1008 కోట్లకు గాను 61 కోట్ల శ్రీ రామ నామ జపం ఇప్పటి ఒక్క రోజులో విజయనగరం గ్రూపు భక్తులు సమర్పించినట్లు తెలిపారు. 3 సంవత్సరాలుగా వారు చేసిన ఈ నామం ట్రస్టుకు బుధవారం సమర్పించారు. వారికి ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు అధ్యక్షులు హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో మోసాలు.. ఈజీ మనీ కోసం ఆశ పడొద్దు

### - ప్రజలకు పోలీసులు హెచ్చరికలు




**పెద్దదోర్నాల, జులై 16, ప్రభాతవార్త**

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రోజు రోజుకు సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయని, పెట్టిన డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మిస్తూ మోసగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని పోలీసులు తెలియపరుస్తున్నారు. సోషల్ మీడియా, వాట్సప్, టెలిగ్రామ్ వంటి వేదికల ద్వారా ట్రేడింగ్ గ్రూపుల్లో చేర్చి మొదట చిన్న మొత్తాల్లో లాభాలు చూపించి, అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాలా ప్రలోభాలకు గురి చేస్తున్నారని తెలిపారు. డబ్బు పెట్టిన తర్వాత ఖాతాలను బ్లాక్ చేయడం, డబ్బు ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వకుండా మోసం చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఈజీ మనీ అనే ఆశతో తెలియని వ్యక్తులు పంపే లింకులు క్లిక్ చేయకూడదని, ధృవీకరణ లేని ట్రేడింగ్ యాప్స్ లేదా వెబ్‌సైట్లలో పెట్టుబడులు పెట్టవద్దని సూచిస్తున్నారు. పెట్టుబడులు పెట్టే ముందు సంస్థ చట్టబద్ధమైనదేనా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఏదైనా సైబర్ నేరాల నుంచి రక్షణకు ఉత్తమ మార్గమని పోలీసులు స్పష్టం చేశారు. సోషల్ మీడియా చిట్కాలతో ట్రేడింగ్‌లోకి దిగవద్దు. వాట్సాప్ టెలిగ్రాఫ్ గ్రూపుల్లో టిప్స్‌తో జాగ్రత్త కలిగి అప్రమత్తంతో ఉండండి. వేళల్లో పెట్టుబడితో లక్షలు వస్తాయంటే మోసమేనని తెలిపారు. అత్యాశకు వెళ్లి జీవితం ఆగం చేసుకోవద్దని సూచిస్తున్నారు. ఈజీ మనీ అని ఆశపడొద్దని పోలీసులు వివరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, లేదా సమీప పోలీసు స్టేషన్లను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణకు ఉత్తమ మార్గమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డులకు యర్రగొండపాలెం నుండి ఎంపికైన ఆరుగురు విద్యార్థులు




**యర్రగొండపాలెం, జులై 16, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ప్రతిభను గుర్తించి అందించే ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డులకు మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషంగా నిలిచిందని ఎంఈఓలు తెలిపారు. పలు విద్యాసంస్థల నుంచి ఎంపికైన ఈ ఆరుగురికి ఈనెల 20వ తేదీ మార్కాపురం జిల్లాకలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారని పేర్కొన్నారు. ఎస్‌కే అర్షియా, ప్రభుత్వ పాఠశాల, ఓ.గురు ప్రియా చైతన్య హైస్కూల్, ఎస్‌కే మెహతాబ్ బ్రిలియంట్ హైస్కూల్, ఓ.అఖిలారెడ్డి, రైయిన్‌బో హైస్కూల్, ఎం.శ్రీనివాసానాయక్ నలంద హైస్కూల్ వీరంతా ప్రభుత్వ షైనింగ్ స్టార్‌అవార్డులకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి అంకితభావాన్ని కొనియాడారు. విద్యార్థుల విజయం వెనుక వారి కృషితో పాటు ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం ఎంతో కీలకపాత్ర పోషించాయని పేర్కొన్నారు. షైనింగ్‌స్టార్ అవార్డు సాధించిన విద్యార్థినీ,విద్యార్థులకు మార్కాపురం జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారుల చేతుల మీదుగా మెమోంటో, సర్టిఫికేట్ అందుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని, షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి, మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కందుకూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

### - 11 మందికి రూ.78.2లక్షలు అందచేత



**కందుకూరు జూలై 15, ప్రభాతవార్త**

కందుకూరు తెదేపా కార్యాలయంలో గురువారం 111 మంది లబ్ధిదారులకు రూ.78,28,829ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అందచేశారు. నియోజకవర్గంలోని మండలాలవారీగా కందుకూరులో 30 మందికి రూ.24,83,106లు,ఉలవపాడులో 39 మందికి రూ.34,19,413లు, వలేటివారిపాలెంలో 42 మందికి రూ.20,72,998లు విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు 1632 మందికి రూ.12.52కోట్లు సహాయం అందించామన్నారు.ఇందుకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబును ప్రతిఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. పెద్ద సంఖ్యలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మరియు కుటుంబ సభ్యులు, నాయకులతో టిడిపి కార్యాలయంలో సందడి నెలకొంది.ఎప్పుడూ లేనివిధంగా నియోజకవర్గంలో భారీగా వైద్య సహాయాలు అందిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు పనితీరు ప్రశంసనీయమని పలువురు లబ్ధిదారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మినరసింహం,రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, నాదెళ్ల వెంకటరమణయ్య, కూనం నరేంద్ర, పార్లమెంట్ కమిటీ నాయకులు షేక్ రూబీ,రాయపాటి శ్రీను, షేక్ సలాం, షేక్ మున్నా,చిత్తూరు మల్లికార్జున,తన్నీరు కొండలరావు, మాదాల రవి తదితరులు పాల్గొన్నారు.

# దస్త్రాలు లేని ఎరువులకు బ్రేక్

### - అధిక ధరలపై ఏడీఏ జైనులాబ్దుల్ హెచ్చరిక

**కనిగిరి, జులై 16, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని రైతు డిపోలో ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకుడు(ఏడీఏ) జైనులాబ్దుల్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా యూరియా, డీఏపీ నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీలలో సంబంధిత దస్త్రాలు లేని రూ.80వేల విలువైన ఎరువుల నిల్వలను గుర్తించి, వాటి విక్రయాన్ని వెంటనే నిలుపుదల చేశారు.అవసరమైన పత్రాలు సమర్పించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యే వరకు వాటిని విక్రయించరాదని ఆదేశించారు.ఈ సందర్భంగా ఏడీఏ జైనులాబ్దుల్ మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలోని అన్ని ఎరువుల డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా, డీఏపీ ఎరువులను విక్రయించాలని స్పష్టం చేశారు. రైతుల నుంచి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు అందినా, తనిఖీల్లో అక్రమాలు వెలుగుచూసినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లలైసెన్స్‌ను రద్దు (క్యాన్సిల్స్) చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అధిక ధరలు వసూళ్లు చేసినా లేదా ఇతర అక్రమాలు జరిగినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నాణ్యమైన ఎరువులు అందేలా వ్యవసాయశాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు.



ong-8_ong-8.qxd 7/16/2026 10:52 PM Page 1



## కిమ్స్ ఆసుపత్రి ఒంగోలు ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

**అద్దంకి, జూలై 16, ప్రభాతవార్త :**



కిమ్స్ ఆసుపత్రి, ఒంగోలు ఆధ్వర్యంలో అద్దంకిలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 150 మంది ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో ఛాతీ ఎక్స్‌రే, పాప్ స్మియర్, మామోగ్రామ్ పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. పరీక్షల ద్వారా క్యాన్సర్ లక్షణాలను గుర్తించిన రోగులను తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స కోసం కిమ్స్ ఆసుపత్రి, ఒంగోలుకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రామాంజనేయులు, డాక్టర్ కట్టా సాయి తేజ శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ప్రజలు ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డా. రామాంజనేయులు, డాక్టర్ మేరీ, జనరల్ మేనేజర్ అమర్‌నాథ్, అద్దంకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి. కోటేష్‌తో పాటు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైవిని కలిసిన అద్దంకి వైసిపి నేతలు

**అద్దంకి, జూలై 16, ప్రభాతవార్త :**



రాజ్యసభ సభ్యులు, వైసిపి రాష్ట్ర నాయకులు వైవి సుబ్బారెడ్డిని అద్దంకి నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసారు. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్ళి వచ్చిన సందర్భంగా వైవి సుబ్బారెడ్డిని అద్దంకి నియోజకవర్గ వైసిపి నాయకులు ఈదా శ్రీనివాసరెడ్డి, నరసిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు కలిసినవారిలో వున్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి

**దర్శి, జూలై 16, ప్రభాతవార్త**



దర్శి మున్సిపల్ పరిధిలో 20 వార్డులో వేస్తున్న సీసీ రోడ్లను మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పరిశీలించారు. తగు సూచనలు చేశారు. దర్శి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అర్జున్‌రావు, నక్క రంగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**దర్శి, జూలై 16, ప్రభాతవార్త**



దర్శిలోని ఎస్సీస్ కాలువ సమీపంలో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పొదిలి రోడ్డులో గల హ్యాపీ హోమ్స్ వాస్తవ్యులు పావులూరి వెంకట అనిల్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పావులూరి ఆంజనేయులు,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించిన తహసీల్దార్

**ముండ్లమూరు, జూలై 16, ప్రభాతవార్త**



తహసీల్దార్ వారి కార్యాలయం నందు గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ సర్వేయర్లకు పీజీఆర్‌ఎస్, మ్యుటేషన్ ఫైల్స్, రీ సర్వే, ఇతరములు, జీవో ఖాతాలు, రైస్ కార్డులు మొదలైనవి రెవెన్యూ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాల్సిందిగా ఆదేశించిన తహసీల్దార్ రజిని కుమారి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడమే కూటమి యొక్క ముఖ్య ఉద్దేశం

**వలేటివారిపాలెం. జూలై 16,ప్రభాతవార్త**



మండల పరిధిలోని 42 మందికి 20, 72, 998 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఇందులో భాగంగా నల్లదలపూర్ గ్రామానికి చెందిన నారాయణమ్మకు 1,05,000 చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ఆరోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. అని ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అధిక మొత్తంలో వైద్య సహాయాలు అందిస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహా మనం కృష్ణ. ఫీల్డ్ అసిస్టెంట్ నవులూరి కృష్ణయ్య. పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 26న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యోగాసన క్రీడా పోటీలు జూలై 26న ఒంగోలులోని అంజయ్య రోడ్డులో ఉన్న ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్ కార్యాలయం అయోధ్య భవనంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోయపాటి రవిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు యోగాచార్య బాలసుబ్రమణ్యం గంధవళ్ల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యోగాసనాన్ని క్రీడగా ప్రోత్సహిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహిస్తోందన్నారు. మండల స్థాయిలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జిల్లా స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించడమే ఈ పోటీల ఉద్దేశమని తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలతో పాటు 55 ఏళ్ల వయస్సు వరకు వివిధ కేటగిరీల్లో ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్, ట్రెడిషనల్ గ్రూప్, ఆర్టిస్టిక్ గ్రూప్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని పాఠశాలలు,కళాశాలలు, యోగా శిక్షణ కేంద్రాలు, యోగా సంస్థల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. జూలై 25లోపు 9963662100, 7780680121, 9885125053, 9490163312 నంబర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు.

## జప్షైనింగ్ స్టార్స్‌గా మెరిసిన తిరుమల విద్యార్థినులు

**కురిచేడు, జూలై 16, ప్రభాతవార్త :**





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2026 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అనే పేరుతో ప్రతిభా పురస్కారాలను అందజేస్తుంది. జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ ఆడిటోరియంలో కలెక్టర్ మంత్రులు, చేతుల మీదుగా అవార్డులు 20వేల రూపాయలు నగదు మెమెంటోలతో సత్కరించనున్నారు. ఇందులో భాగంగా కురిచేడు మండలం ఎన్ఎస్పి అగ్రహారంలో గల తిరుమల హై స్కూల్ విద్యార్థినులు అయిన క్రిష్ణవేణి వెంకట నాగ బాల అమృత 588 మార్కులు షేక్ జాస్మిన్ భాను 588 మార్కులు సాధించడంతో ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థినులను ఆ పాఠశాల కరస్పాండెంట్ కె.వి రత్నాచారి డైరెక్టర్ సురేష్ బాబు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

## జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు, చికిత్సలు

**సంతనూతలపాడు, జూలై 16, ప్రభాతవార్త**



మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించి తదుపరి చికిత్సలు అందించారు. మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ వైద్య పరీక్షలు అందించారు. రక్త పరీక్షలతో పాటుగా మరికొన్ని ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. వయసుకు తగ్గట్టు ఎత్తు బరువు ఉన్నారో లేదా అనే వాటిని పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులకు ఉండాల్సిన హెచ్‌బి పర్సంటేజ్ పరీక్షించారు. హెచ్బి పర్సంటేజ్ తక్కువ ఉన్న యెడల ఆరోగ్యకరమైన ఇబ్బందులు తలెత్తుతాయని వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అటువంటి ఆహార పదార్థాల గురించి వైద్య సిబ్బంది వారికి వివరించారు. ఈ సంఘంగా విద్యార్థులకు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌తో పాటు వైద్య సిబ్బంది బాలకోటయ్య, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

## మద్దిపాడులో పోలీసు కార్డెన్ సెర్చ్

**సంతనూతలపాడు(మద్దిపాడు), జూలై 16, ప్రభాతవార్త**



శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఆపరేషన్ వజ్ర పహార్‌లో భాగంగా గురువారం మద్దిపాడు కేంద్రంలోని ఘడియపూడి కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్‌ను ఒంగోలు ఎస్సీ రాయపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ముమ్మరంగా చేపట్టారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సై వెంకట సూర్య, అజయ్‌బాబు, మహేంద్ర, బ్రహ్మానాయుడు, భాగ్యరాజు,సుధాకర్ 45 మంది పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. మద్దిపాడు పోలీసు స్టేషన్ తనిఖీలలో భాగంగా అనుమానిత వ్యక్తులు, నిషేధిత వస్తువులు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు, వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఒంగోలు రూరల్ సీఐ ఎం.శేషగిరిరావు మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు ప్రజలు, యువత పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలను నడపాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా ఓటీపీలు, బ్యాంకు వివరాలు సేకరించి మోసాలకు ఎలా పాల్పడుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఆధార్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. అదే విధంగా మహిళా చట్టాలపై కొత్త చట్టాలు, శిక్షలుపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శేషగిరిరావు హెచ్చరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు లేదా డయల్ 112 లేదా పోలీసు వాట్సప్ నంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు.

## ప్రమాదవశాత్తు బావిలో జారి మృతి చెందిన విలేకరి ప్రసాద్

**సంతనూతలపాడు, జూలై 16, ప్రభాతవార్త**



సంతనూతలపాడులోని ఒకటవ సచివాలయం సమీపంలో గల గ్రామ ప్రధాన మంచినీటి బావి నందు సంతనూతలపాడు మండల ప్రజాశక్తి విలేకరి కందుల వెంకట కృష్ణ ప్రసాద్(60) జారి పడి ప్రమాదవశాత్తు మృతిచెందారు. విలేకరి ప్రసాద్ బుధవారం రాత్రి సుమారు 7గంటల 30 నిమిషాల ప్రాంతంలో బావి అంచు మీద కూర్చొని ఫోను మాట్లాడుతుండగా జారి బావిలో పడి మృత్యువాతకు లోనయ్యారు. చివరికి ప్రసాద్ ఆచూకి నిమిత్తం కుటుంబీకులు, కమ్యూనిస్టు పార్టీ నేతలు గాలించి తదుపరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చివరికి గురువారం సాయంత్రం సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు మంచినీటి బావిలో నీటిలో మోటార్ ద్వారా బయటకి వెళ్ళగొట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. దీనిపై విలేకరి ప్రసాద్ సతీమణి కందుల విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు. ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై అజయ్‌బాబులు ప్రమాద సంఘటనలను పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ప్రసాద్ స్వగ్రామం సంతనూతలపాడు మండలం కామేపల్లివారిపాలెం అంబేద్కర్ నగర్. ప్రస్తుతం విలేకరి ప్రసాద్ కుటుంబం ఒంగోలు మంగమూరు డొంక వడ్డి నాని కుంటలో ఉంటున్నారు. మృతి చెందిన విలేకరి ప్రసాద్‌కు భార్య విజయలక్ష్మితో పాటు ఇరువురు కుమార్తెలు కలరు. పెద్ద కుమార్తె స్వరూపాకు వివాహం అయింది. చిన్న కుమార్తె బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ కోర్సు చదువుతున్నారు. జిల్లా సీపీఎం కార్యదర్శి షేక్ మాబు, సీపీఎం మండల కార్యదర్శి కే.పెద్దబ్బాయి, సీపీఎం నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, బంకా సుబ్బారావు, ఎన్.మాలతి, బంకా పద్మ, అబ్బూరి వెంకటేశ్వర్లు, అన్ను సుబ్బారావు, కోదాటి కోటేశ్వరరావు, ప్రజాశక్తి జిల్లా బ్రాంచ్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాద్, ప్రజాశక్తి బ్యూరో ఎస్‌వి బ్రహ్మం, టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టు శిఘాకొల్లి శ్రీనివాసరావు, జర్నలిస్టు నేతలు గుంటూరి శేషారావు, టి.ఏడుకొండలు, బి.శ్రీనివాసరావు, ఎం.రమేష్, ఇస్తర్ల శ్రీనివాసరావు, ప్రసాద్ కుటుంబీకులు, గ్రామస్తులు, ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## రైతుల శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

**సంతనూతలపాడు(మద్దిపాడు), జూలై 16, ప్రభాతవార్త**



మద్దిపాడు మండలంలోని రాచవారిపాలెం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ వారి ఆధ్వర్యంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నాడు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన వ్యవసాయ సాగు పద్ధతులు, నేల ఆరోగ్యం గురించి వివరించారు. ముఖ్యంగా ఎల్‌నినో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం ఈ సంవత్సరం అధికంగా ఉంటుందని వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయ దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులకు తక్కువ నీటి పండే పంటలను పండించాలని సూక్ష్మ సాగునీటి పద్ధతులను అవలంభించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆత్మ పీడీ రత్న మంజుల మాట్లాడుతూ పోషకాల యాజమాన్యం శాస్త్రీయ పద్ధతులు నానో ఎరువుల వాడకం గురించి తెలిపారు. ఆత్మ డీపీడీ డి.మాలకొండయ్య మాట్లాడుతూ రైతులు విచక్షణారహితంగా పురుగు మందులు వాడకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఏడీఏ మాట్లాడుతూ ఎరువులను ఏపీ ఏఐ ఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత మాట్లాడుతూ రైతులందరూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పంటలు పండించాలని అలాగే లోతు దుక్కుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం జడ్పీఎన్‌ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిని మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని తద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చని పంటలపై వేప గింజల కషాయం, అగ్ని అస్త్రం, చేప, బెల్లం ద్రావణం పిచికారి చేసినట్లయితే పురుగులు, తెగుళ్ల అనేవి ఆశించకుండా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం శేషారావు, ఏఈఓ పి.శేషయ్య, వీఏఏలు ప్రసన్న రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రాచవారిపాలెం గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు చింతలపూడి శుభాకాంక్షలు

**కొరిసపాడు, జూలై 16, ప్రభాతవార్త :**



అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ గురువారం మండలంలోని రాచపూడి గ్రామంలో ఇటీవల వివాహం చేసుకున్న గోపతోటి చిన్న సుబ్బారావు కుమార్తె, అల్లుడిని కలిసి,శుభాకాంక్షలు తెలియచేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## తండ్రి, తనయులకు అభిమానుల ఆత్మీయ పలకరింపులు

**బల్లికురవ జూలై 16( ప్రభాతవార్త)**






తమ అభిమాన నేతకు ప్రేమాభిమానాలతో కూడిన, అభిమానుల ఆత్మీయ పలకరింపులకు మండల కేంద్రమైన బల్లికురవ గురువారం వేదిక అయింది. చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి, చీరాల వైకాపా ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబులు ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు బల్లికురవ విచ్చేశారు. ఆయన రాక వార్త తెలుసుకున్న అభిమానులు పలు గ్రామాలనుండి మండల కేంద్రానికి విచ్చేశారు. తమ అభిమాన నేతను, ఆయన తనయుడు వెంకటేష్ ను ఆత్మీయంగా పలకరిస్తూ వారితో పాటు అడుగులో అడుగు కలిపారు. అభిమానుల ఆత్మీయతకు తండ్రి ,తనయులు, అంతే అభిమానంతో వారిని పలకరిస్తూ పేరుపేరునా భుజం తట్టారు. బల్లికురవ, నక్క బొక్కలపాడు, కొనిదేన ,కొత్తపాలెం, గ్రామాలకు చెందిన కరణం అభిమానులు తమ అభిమాన నేతతో ఆత్మీయతను పంచుకున్నారు.

## అంబడిపూడిలో నివాస గృహంల చోరీ

**- 32 గ్రాములు బంగారం, 50 వేల నగదు అపహరణ**

**బల్లికురవ జూలై 16( ప్రభాతవార్త)**





మండలంలోని అంబడిపూడి గ్రామంలో బుధవారం రాత్రి నివాస గృహంలో చోరీ జరిగింది. బల్లికురవ, అద్దంకి రహదారిలో చిన్న అంబడిపూడి గ్రామంలో రహదారి పక్కనే ఉన్న పల్లపు వెంకటేశ్వర్లు గృహం వెనుక నుండి తలుపులు తొలగించి దొంగలు లోనికి ప్రవేశించారు. ఏ మాత్రం చప్పుడు కాకుండా బీరువాలో దాచిన 32 గ్రాముల బంగారు ఆభరణాలు, 50,000 నగదు అపహరించారు. వెంకటేశ్వర్ల తో పాటు కుటుంబ సభ్యులు మొత్తం ఇంటి బయట నిద్రించే క్రమంలో వెనుక నుండి దొంగలు ప్రవేశించారు. వెనుక వైపు అంతా ఖాళీ ప్రదేశం కావడంతో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వెనుక నుండి లోపలికి ప్రవేశించినట్లు భావిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ను రప్పించి, వేలిముద్రల నమూనాలను సేకరించారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభిమానులకు కరణం పరామర్శ

**బల్లికురవ జూలై 16( ప్రభాతవార్త)**



మామిళ్ళపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కరణం కుటుంబ అభిమానులు గుడాల వెలిగుండ్ల రాయుడు, ఏలూరి శివ ప్రసాద్ లను గురువారం చీరాల వైకాపా ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక పార్టీ నేతలు కార్యకర్తలు ఉన్నారు.

## కశ్యాపురం దారి వివాదాన్ని పరిష్కరిస్తా రైతులకు హామీ: తాసిల్దార్

**జె.పంగులూరు జులై 16 ప్రభాతవార్త**



మండలంలోని కశ్యాపురం గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ కోటేశ్వరరావుకు సర్వేనెంబర్ 16 లో పొలములో దారి వివాద దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో తాసిల్దార్ పి.సింగారావు, వి ఎస్ అంకమ్మ నాయుడు, వీఆర్వో సునీత గురువారం పరిశీలించారు. తాసిల్దార్ సింగారావు అక్కడున్న రైతులను సమాచారం అడగగా కశ్యాపురం ఉత్తరం వైపు ఉన్న పొలాలలో 50,60 మంది రైతులు సుమారు 200 ఎకరాలలో రాకపోకలకై రోడ్డు నిర్మాణానికి బళ్లారి లో ఉంటున్న ధూళిపాళ్ళ కోటేశ్వరరావుకు గత ఐదు సంవత్సరాల క్రితమే తెలియపరిచి వారి అంగీకారం ప్రకారమే రోడ్డును ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఇప్పుడు రాకపోకలను అంతరాయం కలిగిస్తూ ఏర్పాటు చేసిన రోడ్డును దున్ని వేశాడని తాసిల్దార్ తెలిపారు. దారి వివాదా దరఖాస్తు చేసిన ధూళిపాల కోటేశ్వరరావు రాకపోవడంతో సమస్య పరిష్కారానికి కోటేశ్వరరావుతో మాట్లాడి వివాదాన్ని పరిష్కరిస్తామని రైతులకు తాసిల్దార్ హామీ ఇచ్చారు.

## పందిళ్ళపల్లి హైస్కూల్‌కి 4 ప్రతిభా అవార్డులు

**వేటపాలెం, జూలై 16, ప్రభాతవార్త**



మండలంలోని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినీలు ఖీషైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డుఖీ కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు తలమల దీప్తి తెలియజేశారు. 2026 మార్చి, 10వ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యడవల్లి తేజస్విని, గద్దె బాంధవ్య, పల్లపోలు భావనిక, యాదల శాంతా కుమారి లు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయిలో మండలాల వారీగా ఎంపిక చేసి, జిల్లా కేంద్రాలలో ప్రతిభా పురస్కారాలను అందజేస్తారు. ఈ అవార్డు కింద ఎంపికైన వారికి 20,000 రూపాయల నగదు, బంగారు పతకం, ప్రశంసా పత్రం అందజేస్తారు. ప్రతిభా పురస్కారానికి ఎంపికైన వారు జూలై 20వ తేదీన బాపట్లలోని ఖీవిఖీ కన్వెన్షన్ హాలులో ప్రతిభా పురస్కారాలను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా అందుకుంటారు. పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల నుండి ఒకే సంవత్సరం నలుగురు విద్యార్థులు ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం పట్ల తమ గ్రామానికి, తమ పాఠశాలకు గర్వకారణమని ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యా కమిటీ, విద్యార్థినీ, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి, ప్రతిభా అవార్డుకి ఎంపికైన వారికి అభినందనలు తెలియజేశారు.

## చదువుతోపాటు వృత్తి విద్యలు నేర్చుకోవాలి

**వేటపాలెం, జూలై 16, ప్రభాతవార్త**



ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా గురువారం వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఒకేషనల్ టీచర్స్ విద్యార్థులకు వృత్తి విద్యలకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించినట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు దేవరకొండ సరోజినీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నేర్పిణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. చేతి అల్లికలు, బ్యూటీ మరియు వెల్నెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు ట్రేడ్ కు సంబంధించి విద్యార్థినీ, విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. కుట్లు, అల్లికలు విభాగంలో వివిధ రకాల ఎంబ్రాయిడరీ డిజైన్లు, వస్త్రాల అలంకరణ నమూనాలను ప్రదర్శించారు. బ్యూటీ అండ్ వెల్నెస్ విభాగంలో వ్యక్తిగత పరిశుభ్రత, చర్మం, జుట్టు సంరక్షణ, గ్రూమింగ్, మెహందీ కి సంబంధించిన నైపుణ్యాలను ప్రదర్శించారు. అనంతరం నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు, ఆత్మవిశ్వాసం మరియు వ్యాపార అవకాశాలపై ఒకేషనల్ టీచర్స్ హిమజ, వరలక్ష్మి, ఆదిలక్ష్మి అవగాహన కల్పించారు. ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొలతోటి కిషోర్‌కి చింతలపూడి నివాళి

**కొరిసపాడు , జులై 16, ప్రభాతవార్త :**



మండలంలోని రాచపూడి గ్రామంలో ఇటీవల మృతిచెందిన మొలతోటి కిషోర్ దశదిన కార్యక్రమం గురువారం జరిగింది. అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఈ కార్యక్రమానికి హజరై కిషోర్ చిత్రపటానికి నివాళు లర్పించారు. ఆయనవెంట వైసిపి నాయకులు వున్నారు.

17-7Pg5_17-7Pg5.qxd 16/Jul/26 10:23 PM Page 1



# సాగుకు రూ. 32.50 లక్షల కోట్ల రుణాలు



## వ్యవసాయరంగానికి క్షేత్రస్థాయి పరపతి కింద భారీగా రుణ పంపిణీ: కేంద్రం

## గ్రామీణ రుణ వ్యవస్థ 13 శాతం విస్తరణ

**న్యూఢిల్లీ, జూలై 16:** దేశంలోని వ్యవసాయ రంగానికి అందుతున్న సంస్థాగత రుణాల పంపిణీ గణనీయంగా పెరిగింది. ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి క్షేత్రస్థాయి పరపతి కింద రూ.32.50 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది. ఇది 2014-15 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.8 లక్షల కోట్లతో పోలిస్తే నాలుగు రెట్లకు పైగా పెరిగింది. ఫ్యాక్ట్‌షీట్ ప్రకారం, 2014-15 నుంచి 2023-24 మధ్యకాలంలో గ్రామీణ రుణ వ్యవస్థ సగటున ప్రతి ఏడాది 13 శాతం చొప్పున విస్తరించింది. వ్యవసాయం, అనుబంధ రంగాలకు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాల కోసం బ్యాంకులకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) రీఫైనాన్స్ సౌకర్యాన్ని కల్పిస్తూ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో అధికారిక ఆర్థిక సేవల విస్తరణ వేగంగా పెరుగుతున్నట్లు నాబార్డ్ నిర్వహించిన రూరల్ ఎకనామిక్ కండిషన్స్ అండ్ సెంటిమెంట్స్ సర్వే (మే2026) స్పష్టం చేసింది. సర్వేలో పాల్గొన్న గ్రామీణ కుటుంబాల్లో 77.2 శాతం మంది తమ వినియోగ వ్యయం పెరిగిందని తెలిపారు. ఇది గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు స్థిరమైన డిమాండ్ కొనసాగుతోందని సూచిస్తోంది. అధికారిక బ్యాంకింగ్‌వ్యవస్థద్వారా రుణాలు పొందుతున్న కుటుంబాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సుమారు 51 శాతం కుటుంబాలు పూర్తిగా అధికారిక ఆర్థిక సంస్థల నుంచే రుణాలు పొందుతుండగా, మరో 27 శాతం కుటుంబాలు అధికారిక, అనధికారిక రెండు మార్గాల ద్వారా రుణ సదుపాయాలను వినియోగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు కూడా విస్తరించాయి. 2014లో గ్రామీణ ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల శాఖలు 41,464 ఉండగా, 2025 జూలై నాటికి అవి 35 శాతానికి పైగా పెరిగి 56,193 శాఖలకు చేరుకున్నాయి. ఇవి గ్రామీణ రుణాల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్‌ఆర్‌బీలు) దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 700 జిల్లాల్లో 22 వేలకుపైగా శాఖలతో సేవలందిస్తున్నాయి. సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్) కూడా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ అలవాట్లను పెంపొందించడంతో పాటు సంస్థాగత రుణాల విస్తరణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఆర్‌బిఐ, నాబార్డ్ గణాంకాల ప్రకారం దేశంలో 1,458 పట్టణ సహకార బ్యాంకులు, 34 రాష్ట్ర సహకార బ్యాంకులు, 352 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరాయంగా రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు విధానాలను అమలు చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన ప్రాధాన్యతారంగ రుణాల విధానం అమల్లో ఉంది. అన్ని బ్యాంకులు తమ సవరించిన నికర బ్యాంకు రుణాల్లో కనీసం 18 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించాల్సి ఉంటుంది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా అమలవుతున్న దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కూడా గ్రామీణ పేద కుటుంబాలకు కీలకంగా మారింది.

ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలను స్వయం సహాయక సంఘాలుగా (ఎస్‌హెచ్‌జిలు) ఏర్పాటు చేసి, వారి ఆదాయాన్ని పెంచడంతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలులో ఉండగా, 2026 జూలై 10 నాటికి 19.83లక్షలకుపైగా స్వయం సహాయక సంఘాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఈ సంఘాలకు మొత్తం రూ.13.28 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది.



# మయన్మార్ తీరంలో రెండు శరణార్థి పడవలు బోల్తా

## 500 మంది మృతిచెందినట్లు యుఎన్ ధ్రువీకరణ

**నేయ్‌పిఇడావ్, జులై 16:** ప్రాణాలకు రక్షణ, మెరుగైన జీవన పరిస్థితుల కోసం శరణార్థులు ప్రమాదకర స్థితిలో సముద్ర ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల శరణార్థులతో వెళ్లిన రెండు పడవలు మయన్మార్ తీరంలో బోల్తాపడి ఉండవచ్చని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు తెలిపాయి. ఆపడవల్లో మొత్తం 500 మంది ఉన్నారని, వారంతా మరణించి ఉండవచ్చని పేర్కొన్నాయి. ప్రాథమిక సమాచారం ఆధారంగా ఈ రెండు పడవలు జూన్ చివరలో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బయలుదేరాయని, వాటిలో ఎక్కువమంది రోహింగ్యా జాతికి చెందిన ప్రయాణికులేనని అంతర్జాతీయ వలససంస్థ, ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ సంయుక్త ప్రకటనలోతెలిపాయి. బంగ్లాదేశ్ లోని శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన కొందరూ ఆ పడవల్లో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనల్లో 500 మందికిపైగా మృతి చెందినట్లు భావిస్తున్నామని పేర్కొన్నాయి. అయితే ఈ ఘటనలు, మృతుల సంఖ్యపై ఇంకా అధికారికంగా ధ్రువీకరణ రాలేదని, అయినా భారీగా ప్రాణనష్టం జరిగి ఉండవచ్చున్న అంశంపై యుఎన్‌హెచ్‌సిఆర్, ఐఒఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని సంయుక్త ప్రకటనలో ఆ సంస్థలు పేర్కొన్నాయి. ఐక్యరాజ్య సమితి సంస్థల సమాచారం ప్రకారం.. తొలి పడవ బయలుదేరిన కొద్దిసేపటికే దానితో సంబంధం తెగిపోయింది. అందులో దాదాపు 250 మంది ఉన్నారు. 280 మందితో ప్రయాణించిన రెండు పడవ జూలై 8న మయన్మార్‌లోని ఇరావడీ తీరంలో బోల్తాపడి ఉండొచ్చని భావిస్తున్నారు.

# 'సైనికులకు టెస్టోస్టిరాన్ పరీక్షలు తప్పనిసరి'

## అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్



**వాషింగ్టన్, జులై 16:** అమెరికా సైన్యాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పెంటగాన్ మరో కీలక నిర్ణయం తీసుకుందని ఆ దేశ రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ ప్రకటించారు. యుద్ధ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా సైనికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 30 యేళ్లు దాటిన సైనికులకు హార్మోన్ పరీక్షలను తప్పనిసరి చేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చినట్లు వెల్లడించారు. పెంటగాన్ ప్రకటించిన కొత్త నిబంధనల ప్రకారం.. యాక్టివ్ డ్యూటీ, రిజర్వ్ విభాగాల్లో పనిచేస్తున్న 30 యేళ్లు పైబడిన సైనికులందరికీ టెస్టోస్టిరాన్ లోపం ఉందా? లేదా? అనే పరీక్ష తప్పనిసరిగా నిర్వహించనున్నారు. ప్రతి యేడాది జరిగే పీరియాడిక్ హెల్త్ అసెస్‌మెంట్‌లో ఈ పరీక్షను భాగంగా చేర్చారు. 30 యేళ్లలోపు ఉన్న సైనికులు కోరితే స్వచ్ఛందంగా ఈ పరీక్ష చేయించుకునే అవకాశం కల్పించారు. రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సేత్ ఆదేశాల మేరకే ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు పెంగాన్ ప్రధాన ప్రతినిధి సాన్ పార్నెల్ తెలిపారు.

సైనికుల్లో దీర్ఘకాలిక ఒత్తిడి, హార్మోన్ లోపం, శారీరక సామర్థ్యం తగ్గడం వంటి సమస్యల సమాహారం అయిన 'ఆపరేషన్ సింద్రోమ్' సమస్యను ఎదుర్కోవడం, యుద్ధ సన్నద్ధతను మరింత బలోపేతం చేయడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ పరీక్షల ద్వారా సైనికుల ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర సమాచారం సేకరించనున్నట్లు పెంటగాన్ తెలిపింది. అవసరమైన వారికి టెస్టోస్టెరాన్ చికిత్స అందించి, సైనిక దళాన్ని ఆరోగ్యంగా, సమర్థంగా ఉంచాలని భావిస్తోంది.



# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిరంతర పర్యవేక్షణ చేయాలి

## కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ,జులై 16:** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు ఇచ్చింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ఆయనకు వైద్యసాయం అందించాలని సూచించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. సొలిసిటర్ జనరల్‌ను ఆయన ఆరోగ్యం గురించి ప్రశ్నించింది. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయన శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 28 నుంచి సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆయన ఈదీక్ష చేస్తున్నారు. గత 18రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో ఆయన దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్ష 19వరోజుకుచేరడం,ఆయన ఆరోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది.

# మేం పాక్‌లో భాగం కాదు.. బలవంతంగా ఆక్రమించారు

## - పివోకేలో నేతల వెల్లడి

**ముజఫరాబాద్,జులై 16:** పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో ఇస్లామాబాద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున తిరుగుబాటుకు దిగారు. అక్కడ జరిగిన ఒక భారీ బహిరంగ సభలో నిరసనకారులను ఉద్దేశించి స్థానిక నాయకుడు అమ్జాద్ అయూబ్ మీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర సంచలనం రేపుతున్నాయి. ఈప్రాంతం స్వతంత్రమైనది కాదని, పాకిస్థాన్ సైనిక బలగాలు దీనిని అక్రమంగా ఆక్రమించుకున్నాయని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. ఈ నిరసన ర్యాలీలో నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాకిస్తాన్ పాలకులు తమ ప్రాంతంలోని సహజ వనరులను, ముఖ్యంగా నీటిని, జలవిద్యుత్‌ను పూర్తిగా దోచుకుంటున్నారని ఆరోపించారు. తమ ప్రాంతంలోనే విద్యుత్ ఉత్పత్తి అవుతున్నప్పటికీ, స్థానిక ప్రజలకు మాత్రం కనీస విద్యుత్‌సరఫరా లేకుండా అంధకారంలో ఉంచుతున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్ ప్రభుత్వం తమను పౌరులుగా కాకుండా, కేవలం బానిసలుగా మాత్రమే చూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ఇస్లామాబాద్ ప్రభుత్వం పీవోకే ప్రాంతంపై అదనపు పన్నుల భారాన్ని మోపడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమకు కనీస సదుపాయాలు కల్పించని ప్రభుత్వం, పన్నులు మాత్రం ఎలా వసూలు చేస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ అణచివేతను ఇకపై భరించే ప్రసక్తే లేదని, తమ హక్కుల సాధన కోసం మరియు పాక్ ఆక్రమణ నుంచి విముక్తి కోసం ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

# ఇస్రోలో రాజీనామాల పరంపర

## ఆమోదించవద్దంటూ కేంద్రం ఆదేశాలు



**బెంగళూరు,జులై 16:** ఇస్రోలో కీలక ప్రాజెక్టులపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలోఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాలపై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. ఈనెల 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్ ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్‌ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్‌ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి.

ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసిన వారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్ 3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్‌ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

# ప్రియాంక గాంధీ పిఎనంటూ రూ.3 కోట్లకు కుట్ర

## ఎమ్మెల్యే ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

**తిరువనంతపురం,జులై 16:** కాంగ్రెస్ కీలక నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వ్యక్తిగత కార్యదర్శిగా నమ్మించేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. కేరళ ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి రూ.3 కోట్లు కాజేసేందుకు ప్రయత్నించాడు. వారి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు. ప్రియాంక గాంధీ ఢిల్లీ కార్యాలయంలో ఆమె వ్యక్తిగత కార్యదర్శి డీఎస్ రాజ్‌కుమార్‌గా నమ్మించేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. ఈనెల 6న కేరళలోని ఏలత్తూర్ ఎమ్మెల్యే కె. విద్యా బాలకృష్ణన్‌కు వాట్సాప్ కాల్ చేశాడు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని తెలిపాడు. రూ.3 కోట్లు ఇస్తే ఆమెకు మంత్రి పదవి ఇప్పించేలా చూస్తానని ఆశ కల్పించాడు. కోజికోడ్‌కు చెందిన మరో ఎంపీ ఆమె పేరును సూచించినట్లు అతడు చెప్పాడు. అనుమానం రావడంతో ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్ ఆ ఎంపీతో పాటు ప్రియాంక గాంధీ కార్యాలయాన్ని సంప్రదించారు.

తనకు కాల్ చేసిన వ్యక్తి రాజ్‌కుమార్‌గా నమ్మించి డబ్బు కాజేసేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించుకున్నారు. దీంతో ఆ ఎమ్మెల్యే ఫిర్యాదుతో కోజికోడ్ సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు కేరళ ఎంపీలు షఫీ పరంబిల్, డీన్ కురియకోస్‌తో పాటు పలు కాంగ్రెస్ నేతలను ఆ వ్యక్తి సంప్రదించినట్లు బయటపడింది. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీ వాద్రా ఢిల్లీ కార్యాలయ కార్యదర్శి రాజ్ కుమార్ దీనిపై స్పందించారు. కేరళ రాష్ట్ర పోలీస్ చీఫ్, వయనాడ్ ఎస్పీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తి తన గుర్తింపు, ప్రియాంక గాంధీ వాద్రా కార్యాలయం పేరు దుర్వినియోగం చేస్తున్నాడని, డబ్బు డిమాండ్ చేసి ప్రజాప్రతినిధులను మోసగించేందుకు ఆ వ్యక్తి ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం వయనాడ్‌లో కూడా కేసు నమోదైంది.

ఢిల్లీ నుంచి వాట్సాప్ కాల్ చేసిన ఆ వ్యక్తి ఉపయోగించిన ఫోన్ నంబర్ ఆధారంగా ఒక అనుమానితుడ్ని గుర్తించినట్లు కేరళ పోలీస్ అధికారి తెలిపారు. నకిలీ గుర్తింపు పత్రాలతో సిమ్ కార్డు కొనుగోలు చేశాడా అని అనుమానిస్తున్నారు. దర్యాప్తు కోసం ఒక బృందాన్ని ఢిల్లీకి పంపిస్తామని పోలీస్ అధికారి వివరించారు.

# అవినీతిపరులకు రెండో ఛాన్స్ ఇవ్వను

## తమిళ సిఎం విజయ్ వార్నింగ్



**చెన్నై,జులై 16:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అవినీతిపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరిక చేశారు. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడినవారికి ఎలాంటి రెండో అవకాశం ఉండదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ అవినీతిపై జీరో టోలరెన్స్ విధానాన్ని మరోసారి ప్రకటించారు. ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తన పార్టీ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శి వీరసామిని విజయ్ పార్టీ నుంచి బహిష్కరించడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన వీడియో వైరల్‌కావడంతో రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు. అనంతరం పోలీసులు కూడా ఆయనను అరెస్ట్ చేశారు. అయితే వీరసామి మాత్రం ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని ఆరోపిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీస్ విచారణ జరుగుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తున్న విజయ్ అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని వరుస చర్యల ద్వారా ఇస్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలమని ఆయన పదేపదే చెబుతున్నారు. అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు.

# డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష భేటీ నిర్వహించండి

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే జరపండి: ప్రధాని మోడీకి ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ, జులై 16:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖరాశారు. రాబోయే వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు, డీలిమిటేషన్‌పై ప్రభుత్వం సవరించిన బిల్లులపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయనను కోరారు. ఈ ఏడాది ప్రారంభంలో ఈ విషయంపై విస్తృత సంప్రదింపులు జరపాలని కాంగ్రెస్ పదేపదే కోరిన విషయాన్ని ఖర్గే తన లేఖలో గుర్తు చేశారు. ప్రభుత్వ డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం కోరుతూ 2026 మార్చి, ఏప్రిల్ నెలంతా తాను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి లేఖలు రాశానని, అయితే ఆ అభ్యర్థనలు అంగీకరించబడలేదని ఆయన తెలిపారు. 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో రాజ్యాంగబద్ధంగా అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు,

2026 గతిని కూడా ఖర్గే ప్రస్తావించారు. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 సవరించిన ప్రతిని తిరిగి ప్రవేశపెట్టడానికి కేంద్రం యోచిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధినేత అన్నారు.

# సంక్షిప్త వార్తలు

## టిఎంసికి రాజీనామాచేసిన ఎంపి కోయల్ మల్లిక్



**కోల్‌కతా,జులై 16:** మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీకి మరో జలక్ తగిలింది. ఆ పార్టీ తరపున రాజ్యసభ ఎంపీగా ఏప్రిల్ 6వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన నటి కోయల్ మల్లిక్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎగువ సభలో టిఎంసికి కష్టాలు మరింత పెరిగాయి. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ ఎంపీ కోయల్ మల్లిక్ రాజ్యసభ చైర్మెన్ సిపి రాధాకృష్ణనన్‌కు లేఖ రాశారు. అయితే జూలై 20వ తేదీ నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఎంపీ కోయల్ రాజీనామా టిఎంసికి పెద్ద దెబ్బే అవుతుంది.

## బంగ్లాలో వధువులను కొనుగోలుచేస్తున్న చైనా పౌరులు

**ఢాకా,జులై 16:** బంగ్లాదేశ్‌లో వధువుల కొనుగోలుకు పాల్పడవద్దని చైనా ప్రభుత్వం తమ పౌరులను తీవ్రంగా హెచ్చరించింది. వివాహం పేరుతో సాగించే ఇలాంటి చర్యలను మానవ అక్రమ రవాణాగా పరిగణిస్తారని, నిబంధనలు ఉల్లంఘిస్తే బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం మరణశిక్ష పడే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢాకాలోని చైనా రాయబార కార్యాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. బ్రోకర్లు లేదా సోషల్ మీడియా వేదికల ద్వారా పరిచయమై, పెళ్లి ముసుగులో సాగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తన పౌరులకు సూచించింది.

## ఎర్రకోటలో సందర్శకులకు అనుమతి నిలిపివేత



**న్యూఢిల్లీ,జులై 16:** దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటను ఆగస్టు 15 వరకు (నెల రోజుల పాటు) సాధారణ సందర్శకులు, ప్రజల కోసం పూర్తిగా మూసివేశారు. ఈ మేరకు భారత పురావస్తు శాఖ అధికారికంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ముందస్తు భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట ప్రధాన వేదిక కావడంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి అధికారులు చాలా వారాల ముందు నుంచే ఇక్కడ విస్తృత ఏర్పాట్లు ప్రారంభించారు.

## ఆస్తికోసం కన్నతండ్రినే కాల్చి చంపిన కొడుకు



**ఘజియాబాద్, జులై 16:** ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగు చూసింది. ఆస్తి వివాదాల నేపథ్యంలో కన్నతండ్రినే ఓ కుమారుడు తుపాకీతో కాల్చి చంపాడు. మోడీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుదానా గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘాతుకం చోటుచేసుకుంది. సుమారు రూ. 150 కోట్ల విలువైన ఆస్తులు కలిగిన హరిఓం చౌదరి (55) అనే వ్యక్తిని ఆయన పెద్ద కుమారుడు నిఖిల్ (32) దారుణంగా హత్య చేశాడు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎసిపి భాస్కర్ వర్మ వెల్లడించారు.

## అపార్టుమెంట్‌లో అనస్తీషియా వైద్యుడి దారుణ హత్య



**ధార్వాడ్,జులై 16:** కర్ణాటకలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ధార్వాడ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 45 యేళ్ల అనస్థీషియా వైద్యుడు దారుణ హత్యకు గురయ్యారు. ఆయన ఎనిమిదేళ్ల కుమారుడు కత్తి పోట్లతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య, వృత్తిరీత్యా కంటి వైద్యురాలైన డాక్టర్ ప్రియాంకను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

17-7Pg6exHMNWJQE_17-7Pg6exHMNWJQE.qxd 16/Jul/26 10:35 PM Page 1



# ఉద్యోగాల భర్తీ, క్యాడర్ల వర్గీకరణపై ప్రభుత్వం కార్యాచరణ

● ప్రత్యక్ష నియామకాల నియంత్రణ, స్థానిక క్యాడర్ల వ్యవస్థీకరణ కోసం ప్రణాళిక

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, క్యాడర్ల వర్గీకరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రపతి ఉత్తర్వులు 2025 అమలు ద్వారా ప్రత్యక్ష నియామకాల నియంత్రణ, స్థానిక క్యాడర్ల వ్యవస్థీకరణ కోసం ప్రణాళికను రూపొందించింది. ఇకపై రాష్ట్రంలో ఆరు జోన్లు, రెండు మల్టీ జోన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా ఆ పరిధిలో ఉద్యోగుల అంశాల్లో వ్యవస్థీకరణ చేస్తారు. అన్ని శాఖల్లోనూ ఈ క్యాడర్లను వ్యవస్థీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా శాఖలు ఇచ్చిన జాబితాలకు అనుగుణంగా సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు. కొత్త నిబంధనల ప్రకారం ప్రత్యక్ష నియామకాల్లో స్థానిక అభ్యర్థులకు ఏకంగా 95శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. మిగతా 5శాతం పోస్టులను మాత్రమే స్థానికేతర(ఓపెన్) కోటా కింద భర్తీ చేస్తారు. నియామకాలు, పదోన్నతులు, సీనియారిటీ, బదిలీలకు జిల్లా, జోన్, మల్టీ జోన్లను వేర్వేరు స్వతంత్ర యూనిట్లుగా పరిగణిస్తారు. గిరిజన సంక్షేమ శాఖలో ప్రధానోపాధ్యాయులను గ్రేడ్2 జోనల్ క్యాడర్‌గా నిర్ణయించారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టును మాత్రం అన్ని శాఖల్లోనూ జిల్లా క్యాడర్ పోస్టుగా పేర్కొన్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రం ఈ స్థానిక క్యాడర్ వర్గీకరణ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఏపీ సచివాలయం, విభాగాధిపతుల (హెచ్ఓడి) కార్యాలయాలు, ప్రత్యేక కార్యాలయాలు, రాష్ట్రస్థాయి సంస్థలు, రాజధాని ప్రాంత పరిధిలోని పోలీసు కమిషనరేట్ పోస్టులకు ఇది వర్తించదు. ఈ క్యాడర్ల వారీగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకు రాష్ట్రంలో ఆంక్షలు అమల్లో ఉంటాయి పలు శాఖల్లోని పోస్టులను జిల్లా, జోనల్, మల్టీ జోనల్ క్యాడర్లుగా వర్గీకరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 1975 నాటి పాత ఉత్తర్వుల స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనల ఆధారంగా ఈ క్యాడర్ విభజన చేపట్టారు. రాష్ట్రంలో కొత్త పోస్టుల సృష్టి, పోస్టుల ఉన్నతీకరణ, ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై ప్రభుత్వం పూర్తి నిషేధం విధించింది. క్యాడర్ విభజన పూర్తయిన తర్వాత సిబ్బందిని కొత్త, పాత జిల్లాల మధ్య కేటాయిస్తారు. కొత్తగా ప్రకటించిన మార్కాపురం, పోలవరం జిల్లాలు ఇంకా రాష్ట్రపతి ఉత్తర్వుల షెడ్యూల్‌లో చేరలేదు. అధికారికంగా చేర్చేవరకు ఆ జిల్లాలకు కూడా పోస్టులను తాత్కాలికంగా కేటాయిస్తారు. ఆయా శాఖలకు మంజూరైన మొత్తం పోస్టులను క్యాడర్ స్ట్రెంత్‌గా పరిగణిస్తారు. ప్రస్తుత ఖాళీలను మినహాయించి, మిగతా వారిని వర్కింగ్ క్యాడర్‌గా గుర్తిస్తారు. డిప్యుటేషన్, సెలవు, శిక్షణ, సస్పెన్షన్‌లో ఉన్న వారిని కూడా పని చేస్తున్న ఉద్యోగులుగానే పరిగణిస్తారు. ఉద్యోగుల సీనియారిటీ జాబితాలను రూపొందించి, కొత్త జిల్లాలకు వారి నుంచి ఐచ్ఛికాలు తీసుకుంటారు.

**కమిటీల ఏర్పాటు:** ఉద్యోగులను పాత, కొత్త జిల్లాల మధ్య పారదర్శకంగా కేటాయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. కొత్త జిల్లా కలెక్టర్ కోఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆయా విభాగాల ఉమ్మడి జిల్లా అధికారి కన్వీనర్‌గా, కొత్త జిల్లా అధికారి కోకన్వీనర్‌గా, కొత్త, పాత జిల్లాల రెవెన్యూ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఆయా విభాగాధిపతులు ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జోన్ పరిధిలోని ఉమ్మడి, కొత్త జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి శాఖాధిపతులు సభ్యులుగా ఉంటారు. విభాగాధిపతి నామినేట్ చేసిన జోనల్ హెడ్ గానీ, సంబంధిత విభాగం అధికారి గానీ కన్వీనర్‌గా బాధ్యతలు చూస్తారు. రాష్ట్ర సచివాలయం పరిధిలో ప్రభుత్వ కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు. కార్యదర్శి నామినేట్ చేసిన అధికారి సభ్యుడిగా, విభాగాధిపతి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పాత జిల్లాల మధ్య ఉద్యోగుల విభజన ప్రక్రియను ఆగస్టు 5 లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విభజన పూర్తయిన తర్వాత స్పౌజ్ (భార్యాభర్తల) కేటగిరికి సంబంధించి బదిలీల దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ అభ్యర్థనలను ఆగస్టు 12 లోపు పరిష్కరించేలా ప్రభుత్వం పక్కా ప్రణాళిక రూపొందించింది.

## లక్కీ మహరాజ్‌కు జనసేన సత్కారం




**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో వెన్నుపాము, మెదడులోని నరాల కణాలను దెబ్బతీసే జన్యుపరమైన వ్యాధి (ఎస్ ఎంఏ)తో బాధపడుతున్న చిన్నారుల చికిత్సకు తెలంగాణ, ఏపితోపాటు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని మహబూబ్‌నగర్‌కు చెందిన బయలుపాటి లక్కీ మహరాజ్ కోరుతూ హైదరాబాద్ నుంచి ఏపిలోని మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తూ గురువారం కంచికచర్ల చేరుకున్నాడు. రూ.16 కోట్ల విలువైన ఒక ఇంజక్షన్ ఆ వ్యాధి సోకిన చిన్నారులను బతికిస్తుంది. అటువంటి చిన్నారులకు ప్రభుత్వాలు సాయం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ని కలవాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న జనసైనికులు ఆయనను దుశాలవాతో ఘనంగా సత్కరించి యోగక్షేమాలు పాదయాత్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (యస్ఎంఏ) అనేది వెన్నుపాము, మెదడు కాండంలోని చలన న్యూరాన్‌లను దెబ్బతీసే ఒక అరుదైన జన్యుపరమైన వ్యాధి. ఇది క్రమంగా, కోలుకోలేని విధంగా కండరాల బలహీనతకు, క్షీణతకు కారణమవుతుంది అని లక్కీ మహరాజ్ తెలిపారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు 15 మంది పిల్లలు ఈ వ్యాధి బారిన పడ్డారని ఈ వ్యాధికి ఉపయోగించే ఇంజక్షన్ ఖర్చు రూ.16 కోట్ల విలువైనదని సాధారణ ప్రజలు కొనేందుకు అసంభవం అని ప్రభుత్వాలు పూనుకుంటే తప్ప పసి పిల్లల ప్రాణాలు దక్కవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కల్యాణ్‌ను కలిసి ఆయన ద్వారా భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఈ సందేశాన్ని చేరవేసి భారతదేశంలోనే ఈ మెడిసిన్ తయారయ్యేలా చూడాలని కోరనున్నట్లు లక్కీ మహారాజ్ తెలిపారు. లక్కీమహరాజ్ కృషిని ఎంతగానో మెచ్చుకున్న జనసైనికులు కచ్చితంగా పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయం చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నాయన సతీష్, దేవిరెడ్డి శ్రీనివాసరావు, కొఠారు దేవేంద్ర, పుప్పాల వేణుగోపాల్, తోట ఓంకార్, పసుపులేటి గోపి, ఖమ్మంపాటి తిరుమల రావు పాల్గొన్నారు.

## ఎఇఇ నియామక షెడ్యూల్‌లో మార్పు లేదు

● అసత్య ప్రచారాలను నమ్మవద్దు: సిఎండి పుల్లారెడ్డి

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) నియామక ప్రక్రియకు సంబంధించిన షెడ్యూలులో ఎటువంటి మార్పు లేదని సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి స్పష్టం చేశారు. ఏఈఈ పోస్టుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 30062026 ఉదయం 10:00 గంటలకు ప్రారంభమై, 20072026 రాత్రి 11:59 గంటల వరకు (మొత్తం 21 రోజులు) కొనసాగుతుందని తెలిపారు. ఈ షెడ్యూలులో ఎలాంటి మార్పులు లేవని, ఇదే అధికారిక షెడ్యూలు అమల్లో ఉందని స్పష్టం చేశారు. ఏఈఈ నియామకాలకు సంబంధించి సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానళ్లు, ఇతర అనధికార వేదికలలో అసత్య వార్తలు, వదంతులు ప్రచారం అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అభ్యర్థులు ఇటువంటి తప్పుడు ప్రచారాలను విశ్వసించవద్దని ఆయన సూచించారు. .అలాగే, ఉద్యోగాలు ఇప్పిస్తామని, నియామకాల్లో సహాయం చేస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులు, మధ్యవర్తులు (దళారులు) పట్ల అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఎండీ సూచించారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగినా, హామీలు ఇచ్చినా వాటిని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రతిభ ఆధారంగా మాత్రమే నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు.

## ఏపికి భారీ పరిశ్రమలు వస్తున్నాయి!

● నాలుగేళ్లలో వలసలు ఆగే పరిస్థితి వస్తుంది ● టిడిపి సీనియర్ నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి




**రాజమహేంద్రవరం అర్బన్, జులై 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా విదేశాల నుంచి భారీ పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు తరలివస్తున్నాయని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నానికి తోడు రాష్ట్రంలో మరో రెండు స్టీల్ ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని, ఆటోమొబైల్, సెల్‌ఫోన్ తయారీ కంపెనీలు కూడా ఏపీకి వస్తున్నాయని తెలిపారు. దీంతో రానున్న నాలుగేళ్లలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరిగి, ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, 1,600 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. బీటెక్, డిగ్రీ, ఇంటర్, పదో తరగతి, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఉద్యోగం పొందిన వారికి అవసరమైన శిక్షణ కూడా అందిస్తామని చెప్పారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ నేతలపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. ఆక్వా రైతులు, మత్స్యకారులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గత ప్రభుత్వ హయాంలో సరైన సహాయం అందలేదని ఆరోపించారు. ముద్రగడ పద్మనాభం అవినీతిపరుడు కాదని, అయితే కుల రాజకీయాల వల్ల ఆయన రాజకీయంగా నష్టపోయారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, తలారి

## కేంద్ర సాహిత్య అకాడమీ యువ రచయితల ఉత్సవానికి తంగిరాల సోనికు ఆహ్వానం



**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర సాహిత్య అకాడమీ దక్షిణ భారత యువ రచయితల ఉత్సవంలో భాగంగా ఆరు రాష్ట్రాల నుంచి కన్నడ, కొడవ, మళయాళం, తుళు, మలైయాళి, తెలుగు నుంచి యువ కవులను ఎంపిక చేసారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ప్రముఖ యువ కవి, రచయిత, తంగిరాల సోని(నవీన్)కు కేంద్ర సాహిత్య అకాడమీ బెంగళూరు నుంచి పిలుపు వచ్చింది. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే యువ కవుల కవితా పఠనం, కవిత్వంపై సోని ప్రసంగిస్తారు. బ్లాక్‌వాయిస్ కవితా సంపుటిని సోని ప్రచురించారు. బహుజన సాహితోద్యమంలో ఉత్సాహంగా సోని పాల్గొంటు న్నారు. తెలుగు భాషను క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేయాలని, ఆ క్రమంలో పల్లెపదాలకు విస్తృత ప్రచారం ఇవ్వాలని దిశలో తంగిరాల ఉద్యమిస్తున్నారు. ప్రాచీన సాహిత్య అధ్యయనం, పద్యం, వచనం, గీతం భాషాభ్యున్నతి దోహదం చేస్తాయనే దిశలో సోనీ సాహిత్య ప్రయాణం సాగుతుంది. ఈ నేపథ్యంలో తంగిరాల సోనిను కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి పిలుపు వచ్చినందుకు పలువురు రచయితలు అభినందనలు తెలియజేశారు.

## ఫొటోగ్రాఫర్ల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం




**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి ఫ్రేమ్ ఒక జ్ఞాపకం.. కాలం మరచిపోయినా.. ఫొటో మాత్రం ఆ క్షణాన్ని సజీవంగా ఉంచుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మధుర క్షణాలను శాశ్వతం చేసే ఫొటోగ్రఫీలో విశేష ప్రతిభకనబరిచిన ఫొటోగ్రాఫర్లకు ఆగస్ట్ 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేస్తామని చెప్పారు. ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా నిర్వహించే పోటీలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, ఫొటో జర్నలిస్టులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ అయిన ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఫొటో జర్నలిస్టులు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, స్టూడియో ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొనవచ్చునని వివరించారు. ఫొటోగ్రాఫర్లు ఆగస్టు 5వ తేదీలోగా తమ ఎంట్రీలు పంపాల్సి ఉంటుందన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని, మొదటి విభాగంలో జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వారసత్వం, పర్యాటకం, సంస్కృతి అంశాల్లో ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో యువత, పి4, ఆర్థికాభివృద్ధిసంక్షేమం అంశాలు, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.7 వేలు తృతీయ బహుమతిగా రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక విభాగం నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు విభాగాల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చన్నారు. 2025, జూన్ 12 నుంచి 2026, జులై 31 మధ్య తీసిన ఫొటోలై ఉండాలని, ఫొటో సైజు 12 ఇంటు10 ఉండాలని, ఫొటోలు ఎన్‌టిఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలని వివరించారు. వాటర్ మార్క్, మార్ఫింగ్ వంటి వాటిని అనుమతించడం జరగదని, ఉత్తమ ఫొటోల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని తెలిపారు. ఒరిజినల్ ఫొటో ఎంట్రీలను డిపిఆర్ఒ కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, విజయవాడ -520002 చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా సమర్పించవచ్చ న్నారు. ఇతర వివరాలకు కె.రవి, డివిజనల్ పిఆర్ఒ (90101 56550)ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐపిఆర్ఒ కె.వి. రమణరావు, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, డివిజనల్ పిఆర్ఒ కె.రవి, విశ్రాంత ఎ.వి. సూపర్‌వైజర్ వివి ప్రసాద్, ఫొటో జర్నలిస్టులు సిహెచ్ విజయ భాస్కర్, సిహెచ్ నారాయణరావు, కెవిఎస్ గిరి, జివన్ రావు పాల్గొన్నారు.

## చేనేత, హస్తకళల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం

**మంత్రి ఎస్. సవిత**



హస్తకళా రూపకల్పనలను మంత్రి సవితకు అందిస్తున్న కళాకారులు

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో చేనేత, హస్తకళల రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోం దని రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. కళాకారులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం, సంప్రదాయ కళలను పరిరక్షిస్తూ ఆధునిక ఆవిష్కరణలను ప్రోత్సహిం చడం, జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాలను కల్పించడం ద్వారా వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తామని ఆమె తెలిపారు. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగు తున్న భారత్ టెక్స్-2026 ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ (లేపాక్షి) పెవిలియన్ ను మంత్రి ఎస్. సవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు. పెవిలియన్‌లో పాల్గొన్న కళాకారులతో మంత్రి ముచ్చటించి, వారి నైపుణ్యాన్ని అభినందించారు. క్రోషే లేస్, పెదన కలంకారీ, కార్పెట్ నేయడం, కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ వంటి సజీవ ప్రదర్శనల ద్వారా ఆంధ్రప్రదేశ్ హస్తకళల వైభవాన్ని దేశానికి పరిచయం చేసిన లేపాక్షి సంస్థను ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా లేపాక్షి ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌కు విశేష స్పందన లభించిందన్నారు. భారత్ టెక్స్-2026లో లేపాక్షి విజయవంతమైన భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు లభించిందని, కళాకారుల జీవనోపాదిని మరింత బలోపేతం చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమన్నారు

**సరికొత్త హంగులతో ఢిల్లీ లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం నేడు ప్రారంభం:** ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లేపాక్షి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని స్టేట్ ఎంపోరియా కాంప్లెక్స్‌లో నూతన హంగులతో తీర్చిదిద్దిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంను 17వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పునఃప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ తెలిపారు. కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ మందిర్ ఎదురుగా ఉన్న ఈ ఎంపోరియంను ఆధునిక హంగులతో పునరుద్ధరించి, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలను ఆకర్షణీయంగా ప్రదర్శించేలా తీర్చిదిద్దారు. ఈ పునఃప్రారంభంతో రాష్ట్ర హస్తకళలకు విస్తృత మార్కెట్ లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నాదెండ్ల బ్రహ్మం చౌదరికి బ్రెయిన్ స్ట్రోక్

గౌతమీ శ్వేతను ఫోన్‌లో పరామర్శించిన మంత్రి లోకేష్



**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి అస్వస్థతతకు గురయ్యారు. అతనికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. దీంతో తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రికి నాదెండ్ల బ్రహ్మం చౌదరిని తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్దితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమీ శ్వేతను మంత్రి లోకేష్ ఫోనులో పరామర్శించారు. బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని అన్నారు. లోకేష్ 'ఎక్స్'లో చేసిన పోస్టులో బ్రహ్మం పరిస్థితి వివరించారు. వైద్యులతో మాట్లాడి బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నానని, త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరానని అన్నారు. బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆయన ఆరోగ్యంపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ, సామాజిక ప్రముకులు కూడా బ్రహ్మం చౌదరి ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. బ్రహ్మం చౌదరి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## శ్రీవసుకోటి ఎల్లమ్మ ఆలయంలో చోరీ

12.5 గ్రాముల బంగారు, హుండీలో నగదు మాయం




**చంద్రగిరి, జులై 16 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలోని శ్రీవసుకోటి ఎల్లమ్మ వారి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు దుండగులు చొరబడి అందినకాడికి దోచుకుపోయారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, మిట్టపాళ్యం పంచాయతీ శ్రీనివాస మంగాపురంలోని శ్రీవసుకోటి అమ్మవారి ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్ఐ అరుణాచలం తెలిపారు. ఆలయం వెనుక భాగంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయనీ, ఈ మార్గంలోని తాళాలను పగులగొట్టి నిందితులు లోనికి ప్రవేశించినట్లు తెలిపారు. సిసి కెమెరాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆలయంలో రెండు హుండీలు వున్నట్లు వెళ్ళడించిన ఆయన ఒక హుండీ స్థానికులు, మరో హుండీని అమ్మవారి భక్తులు సేట్‌లు (పూసల వాళ్ళు) ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో స్థానికులు రెండు రోజుల క్రితం తమ హుండీని తెరచి అందులోని రూ.50 వేలకు పైగా నగదు కానుకలను బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. అయితే నిందితులు లోపల గల మరో హుండీని పగులగొట్టి అందులోని నగదును పట్టుకుపోయినట్లు తెలిపారు. అదేవిధంగా మినరల్ వాటర్ ప్లాంట్ కాయిన్ బాక్స్‌ను సైతం ఎత్తుకుపోయినట్లు తెలిపారు. అమ్మవారి మెడలోని 12.5 గ్రాముల బంగారు తాళిబొట్టును దోచుకుపోయినట్లు తెలిపారు. సంఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా క్లూస్ టీమ్ ఇక్కడికి చేరుకుని వేలిముద్రలు సేకరించుకుని వెళ్ళారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బుక్ ఫెస్టివల్ బాబ్జీ కన్నుమూత

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ పుస్తక మహోత్సవ సంఘ పూర్వ అధ్యక్షుడు, బుక్ ఫెస్టివల్ బాబ్జీ కన్నుమూశారు. గత కొంతకాలంగా కాలేయ సంబంధ అనారోగ్య సమస్యతో ఆయన బాధపడుతున్నారు. విజయవాడ పుస్తక మహోత్సవాల నిర్వహణతో పాటు బుక్ పెస్టివల్ భవన నిర్మాణంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. పుస్తక ప్రచురణ రంగంలోను ఆయనకు మంచి గుర్తింపు ఉంది, బాబ్జీ మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసారు.

## అమరరాజా కంపెనీకి లోకేష్ అభినందనలు

### క్షమాపణలు తెలిపిన మంత్రి

**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణలో కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అమరరాజాకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. జగన్ హయాంలో సొంత రాష్ట్రంలో ప్రోత్సాహం దక్కాల్సిన సంస్థకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు మంత్రి లోకేష్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. వైసిపి హయాంలో అమరరాజా వేధింపులకు గురైందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మళ్లీ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా మారిందని స్పష్టం చేశారు. అమరరాజా భవిష్యత్తు విస్తరణలో ఎపి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. 'ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి' అంటూ గల్లా జయదేవ్‌కు మంత్రి లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు ముందుకు వస్తే అమరరాజాకు అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి స్పష్టం చేసారు.

## రాష్ట్రంలో పరిపాలన గాలికెగిరిపోయింది

● చంద్రబాబు పాలనలో ఎక్కడ చూసినా స్కామ్‌లే ● ప్రజా సమస్యలపై పార్లమెంటులో గొంతెత్తాలి ● ఉభయసభల్లో గట్టిగా వినిపించాలి ● ఎంపిల సమావేశంలో వైఎస్ జగన్



**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పరిపాలన గాలికెగిరిపోయింది, చంద్రబాబు పాలనలో ఎక్కడ చూసినా స్కామ్‌లే అని వైసిపి నేత, మాజీ ముఖ్య మంత్రి జగన్ అభియోగించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైయస్ జగన్ అధ్యక్షతన వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈనెల 20 నుంచి జరగనున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనుసరిం చాల్సిన వ్యూహాలపై సమావేశంలో జగన్ మాట్లాడారు. పార్టీకి సంబందించి 2.0 యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే మనకు ముఖ్యం. వాటి కోసం గళం విప్పండి. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇది వరకే మనం మద్దతు ఇచ్చాం. దాన్ని మరోసారి పునరుద్ఘాటిస్తున్నాం. రాష్ట్రంలో పాలన గాలికి ఎగిరి పోయింది. ఎక్కడ చూసినా స్కాములే. డీఎస్సీ 2025 పోస్టుల భర్తీలో పెద్ద స్కాం చోటు చేసుకుంది. అసలు పోటీ పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు ఇవ్వడం ఏంటి? ఇంకా డీఎస్సీ పరీక్ష పేపర్ల లీక్‌పైనా అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీలో అనేక అవకతవకలు జరిగాయి. కేవలం తమ వాళ్ల కోసం ప్రత్యేకంగా జీవోలు ఇచ్చారు. తమ పని అయిపోగానే ఆ జీవోలు రద్దు చేశారు. సర్టిఫికెట్లు ఇచ్చిన క్రీడా సంఘాలు కూడా వారి చేతుల్లోనే ఉన్నాయి. సాఫ్ట్ బాల్ అసోసియేషన్‌కు టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షుడు. జూడీ సంఘానికి గౌరవ అధ్యక్షుడి గా విశాఖపట్నం ఎంపీ, లోకేష్ తోడల్లుడు భరత్ ఉన్నాడు. రాష్ట్రంలో ఇష్టానుసారంగా భూముల పందేరం జరుగుతోంది. దాదాపు రూ.5 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను లోకేష్ తోడల్లుడికి అప్పనంగా అప్పగించారు. ఘోరమైన అవినీతి జరిగింది. అటు అమరావతి నిర్మాణంలోకూడా విపరీతమైన దోపిడీ జరుగుతోంది. చదరపు అడుగుకు రూ.20 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి రేట్లు లేవు. రోడ్ల నిర్మాణాల్లోనూ దోపిడీయే. పూలింగ్‌కు భూములు ఇవ్వని రైతులపై దారుణాలకు దిగుతున్నారు. బలవంతంగా వారి భూము లను లాక్కుంటున్నారు. ఇప్పటికే తీసుకున్న వేల ఎకరాలకే దిక్కులేదు. ఇప్పుడు మళ్లీ మా భూములు ఎందుకు తీసుకుంటున్నారని రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వ తప్పులను వెలికి తీస్తున్న, ప్రశ్నిస్తున్న వారిపై వేధింపులకు దిగుతున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు. సోషల్ మీడియా పేరిట చంద్రబాబు తీవ్ర అరాచకాలకు పాల్పడుతు న్నారు. ఎవరి మీదనైనా సరే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారు. టెట్ రూపంలో టీచర్ల ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. టెట్ రాకముందు నుంచి టీచర్లుగా పనిచేస్తున్న వారికి ఇప్పుడు టెట్ తప్పనిసరి చేయడం సరికాదు. పైగా వాళ్లంతా కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణులు అయిన వారే. వీళ్ల ఉద్యోగాలు పొందనప్పుడు వీళ్లకు టెట్ అనే పరీక్ష లేదు. కానీ, ఇప్పుడు వీరిని టెట్ రాయమనడం భావ్యం కాదు. సుదీర్ఘ కాలంగా ఒకే సబ్జెక్టు బోధిస్తున్న వారిని, ఇప్పుడు అన్ని సబ్జెక్టులున్న టెట్ పరీక్ష రాయమనడం, దాన్ని తప్పనిసరి చేయడం ఏ మాత్రం సరికాదు. దీనికి సంబంధించి కేంద్ర మంత్రిని కలవాలి. వారికి సమస్యను నివేదించాలి. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతాంగం కూడా చాలా నష్టపోతోంది. భీమవరం సభ ద్వారా ఆక్వా రైతులు ఆగ్రహం పెల్లుబికింది. తాము దగాకు గురవుతున్నామని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఉద్యోగులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ పార్లమెంటు ఉభయ సభలో లేవనెత్తాలి. ఈ ప్రభుత్వ అవినీతి వ్యవహారాలను ఎండగట్టాలి. ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడాలని ఎంపీలకు జగన్ దిశానిర్దేశం చేశారు. సమావేశానికి పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, వై.వి.సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి, గొల్ల బాబూరావు. లోకసభలో పక్షనేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, లోక్‌సభ సభ్యులు ఎం.గురుమూర్తి, అవినాష్‌రెడ్డి, గుమ్మా తనూజారాణి. ప్రత్యేక ఆహ్వానితులుగా పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి హాజరయ్యారు.

17-7Pg7exHMNWJQE_17-7Pg7exHMNWJQE.qxd 16/Jul/26 11:48 PM Page 1



# తిరుమల పుణ్యక్షేత్రంలో అపవిత్రం

- ఆస్థానమండపం వద్ద పాదరక్షలు



**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను మరింతగా పరిరక్షించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంటున్నా ఆచరణలో అమలుకావడం లేదు. సాధారణంగా తిరుమల పవిత్రతను భక్తులు కూడా కాపాడుతారు. అయితే ఇక్కడ ఉన్న పరిస్థితుల్లో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తరలివస్తున్న లక్షమందిభక్తులకుపైగా ధరిస్తున్న పాదరక్షలు ఇబ్బడిముబ్బడిగా ఆలయం ఎదురుగా వాహనమండపం సమీపంలో, ఆస్థానమండపం వద్ద, బేడి ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో పాదరక్షలు వదలిపెట్టేయడం ఆలయ పవిత్రతకు భంగం కలిగించే విషయంగా మారింది. తిరుమలపుణ్యక్షేత్ర మహిమను, పవిత్రతను మరింత పెంపొందించే దిశగా కూడా తీసుకున్న నిబంధనల్లో ఆలయ మాఢవీధుల్లో పూర్తిగా పాదరక్షలు ధరించడం నిషేధించారు. ఈ నిబంధనలు పక్కగా అమలవుతున్నాయి. భక్తులు కూడా ఆలయం ముందు గొల్లమండపం ప్రాంతం, మాఢవీధుల్లో, చివరకు లడ్డూప్రసాదాల వితరణశాల, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, కల్యాణకట్ట తదితర ప్రాంతాల్లో పాదరక్షలు ధరించడం నిషేధించారు. ఇది కొంతవరకు దశాబ్దాల తరబడి అమలవుతోంది. అయితే తిరుమలకు వస్తున్న భక్తులు తమతమ దర్శనం సమయం, క్యూకాంప్లెక్స్‌లలోకి త్వరగా ప్రవేశించే సమయాల్లో, భక్తుల రద్దీ పెరిగినపుడు అదనపు క్యూలైన్లు అమలైతే ప్రవేశమార్గాల ప్రాంతాల్లో భక్తులు తమ పాదరక్షలు వదలిపెట్టి వెళ్ళిపోతున్నారు. ఇలా ఎక్కడబడితే అక్కడ పాదరక్షలు వదలివెళ్ళడం ఇతర భక్తులకేగాక పవిత్రంగా వెంకన్న సేవలో తరిస్తున్న టిటిడి ఉద్యోగులు, చివరకు శ్రీవారి సేవకులు కొంత ఇబ్బందిపడుతున్నారు. మనోభావాలు దెబ్బతినేలా పాదరక్షలు ఎక్కడబడితే అక్కడ వదలి పెట్టేయడంతో ఇదో సమస్య ఎదురవుతోంది. తిరుమలలో అనేక ప్రధాన ప్రాంతాల్లో పాదరక్షల భద్ర పరిచే స్టాండ్‌లు ఉన్నాయి. అయినా చాలావరకు కొన్నిచోట్ల పాదరక్షలు ఎక్కడబడితే అక్కడ అపవిత్రంగా వదలి పెట్టేస్తున్నారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కావున ఇలా అపవిత్రతకు చెక్ పెట్టడానికి తిరుమలలో ఉచిత పాదరక్షల స్టాండ్‌లు మరిన్ని ఏర్పాటు చేయాలని, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

# వైసిపి హయాంలో టిటిడి ఐటి జిఎం సందీప్‌రెడ్డిపై సిఐడి విచారణ

**తిరుమల, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** 2019–24 మధ్యకాలంలో రాష్ట్రంలో అధికారంలోఉన్న వైసిపి ప్రభుత్వం హయాంలోని వైసిపి టిటిడి బోర్డు పెద్దలు నియమించిన ఐటి జిఎం సందీప్‌రెడ్డి అక్రమనియామకంపై తాజాగా సిఐటి విచారణ చేపడుతోంది. ఆయన నియమాకం చెల్లదని, ఆయన అర్హుడు కాదని గతంలోనే నివేదికలు వెల్లడయ్యాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ,టిటిడి బోర్డు గతంలో ఐటీ జీఎంగా సందీప్‌రెడ్డి నియామకంపై సిఐడి విచారణకు ఆదేశించింది. ఆయన నియామకం దగ్గర నుండి ఇప్పటివరకు జరిగిన అంశాలపై ,ఆయన స్విమ్స్‌లో కీలక పోస్టులో ఉండటంపై సమగ్ర దర్యాప్తునకు టిటిడి అధికారులు ఆదేశించారు. ఆయన నియామకం నిబంధనలకు విరుద్ధమంటూ 2024 ఆగస్టులో టిటిడి విజిలెన్స్ ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఇప్పుడు సందీప్‌రెడ్డి నియామకంలో అక్రమాలు జరిగాయా? టిటిడి కీలక సమాచారం బయటకు వెళ్లిందా అనే కోణంలో దర్యాప్తు సాగనుంది. సిమ్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా కొనసాగుతూనే, ఐటీ జీఎంగా జీతం పొందిన అంశంపైనా సీఐడీ ఆరా తీస్తోంది.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

**తిరుపతి, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష    ్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 40/2017 కేసులో తమిళనాడు, తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా మెలకుప్పనూరు గ్రామానికి చెందిన సి. కుమార్ ముద్దాయి అరెస్ట్ అయ్యాడు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 6లక్షల జరిమానా విధిస్తూ

# మద్యం మత్తులో ఘర్షణ.. యువకుడి హత్య



**ఇందుకూరుపేట (నెల్లూరు), జులై 16 ప్రభాతవార్త:** మద్యం మత్తు, క్షణికావేశం ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పల్లిపాడులో చోటుచేసుకున్న ఈ హింసాత్మక ఘటన తీవ్ర కలకలం రేపింది. స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో మొదలైన ఘర్షణ చివరకు హత్యకు దారి తీసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఎస్.కె.సుల్తాన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అతని స్నేహితులు పల్లిపాడు సవక తోటలో మద్యం విందు ఏర్పాటు చేసుకున్నారు. అందరూ కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో రాజేంద్ర అనే యువకుడికి, ఎస్.కె. సుల్తాన్‌కు మధ్య అనుకోకుండా స్వల్ప వివాదం తలెత్తింది. మద్యం మత్తులో ఆగ్రహానికి లోనైన రాజేంద్ర అక్కడే ఉన్న ఒక బీరు సీసాను తీసుకొని సుల్తాన్ తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన సుల్తాన్, తన చేతి కడియంతో రాజేంద్రపై ఎదురుదాడికి దిగాడు. ఈ గొడవ తీవ్రరూపం దాల్చడంతో అక్కడే ఉన్న వారి స్నేహితులు, రాజేంద్ర సోదరుడైన రాజశేఖర్ పక్కనే ఆటోలో దాచిన ఆయుధంతో సుల్తాన్ తలపై బలంగా బాదాడు. తలకు తీవ్ర గాయం కావడంతో సుల్తాన్ కోమాలోకి పోయి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సుల్తాన్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని స్థానికులు విచారం వ్యక్తం చేశారు. సుల్తాన్ తండ్రి అనారోగ్య కారణాలతో మంచంలోని జీవనం సాగిస్తున్నాడు. తల్లి కూలి నాలిచేసుకొని భర్త కొడుకులను పోషిస్తుంది. సమాచారం అందుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తన సిబ్బందితో కలిసి తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.

# గ్లోబల్ ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- దేశ ఆహార శుద్ధి రంగంలో 9శాతం వాటాతో ఏపి నంబర్ వన్
- రూ.30వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- పెట్టుబడిదారులకు లాంగ్‌టర్మ్ వృద్ధి భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్
- 17వ ఫుడ్ వరల్డ్ ఇండియా సదస్సులో రాష్ట్ర మంత్రి టి.జి.భరత్



**విజయవాడ, జులై 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఆహార రంగానికి అవసరమైన ముడిసరుకును అందిస్తూ, అత్యాధునిక సాంకేతికతతో వాటిని శుద్ధి (ప్రాసెస్) చేయడంలో ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఆవిర్భవిస్తోందని రాష్ట్ర భారీ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక సాంగ్రిల్లా హోటల్‌లో ఫిక్కి డెలాయిట్ సంయుక్తంగా నిర్వహించిన 17వ ఫుడ్ వరల్డ్ ఇండియా జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ఈ సదస్సు ముఖ్య ఇతివృత్తం ఆయన 'స్టెప్ అప్- సామర్థ్యం, లాభదా యకత కోసం విస్తృత రూపాంతీకరణ'ను అభినందించారు. సదస్సులో మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ, "ప్రస్తుత దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీ వంటి రంగాల గురించి మాట్లాడుకుంటున్నారనీ కానీ ఈ దశాబ్దంలో అత్యంత భారీ ఆర్థిక వ్యాపార అవకాశం మన డైనింగ్ టేబుల్‌పై ఉన్న 'ఆహారం' రూపంలోనే ఉందని అన్నారు. నేడు ఆహారం అంటే కేవలం వ్యవసాయం మాత్రమే కాదని అది ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, అంతర్జాతీయ భౌగోళిక వ్యూహాత్మక అంశాలతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆహార ప్రాసెసింగ్ రంగం 8.1 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ కలిగి ఉండగా, అందులో భారత దేశ వాటా 543 బిలియన్ డాలర్లని, కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అందులో 49 బిలియన్ డాలర్లు (దాదాపు 9 శాతం) వాటాను అందిస్తూ దేశంలోనే అత్యధిక రిజిస్టర్డ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కలిగిన రాష్ట్రంగా నంబర్ వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు.

**'ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్:** రాష్ట్రంలో సులభతర వాణిజ్యం మాత్రమే కాకుండా, ఒక అడుగు ముందుకు వేసి వేగవంతమైన వాణిజ్యం వైపు అడుగులు వేస్తున్నామని మంత్రి తెలిపారు. పెట్టుబడి దారులు అనుమతుల చుట్టూ తిరగడం కాకుండా, వేగంగా ఉత్పత్తిని ప్రారంభించినప్పుడే లాభాలు వస్తాయని, అందుకోసమే సింగిల్ డెస్క్ అనుమతులు, ప్రత్యేక ప్రాజెక్ట్ హ్యాండ్‌హోల్డింగ్ వేగవంతమైన నిర్ణయాలు ప్రభుత్వ పనివిధానమని స్పష్టం చేశారు.

**రూ.30,000 కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాలే లక్ష్యం:** రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో సాధించిన ప్రగతి మౌలిక వసతులను మంత్రి వివరిస్తూ..మౌలిక సదుపాయాలు:.. రాష్ట్రంలో 1,000 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, 6 కార్యాచరణ రేవులు, 7 విమానాశ్రయాలు, 247 నాణ్యమైన విద్యుత్ మరియు 9 ప్లగ్‌అండ్‌ప్లే ఫుడ్ పార్కులు అందుబాటులో ఉన్నాయన్నారు. 17.20 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆధునిక కోల్డ్ స్టోరేజ్, 33.52 లక్షల మెట్రిక్ టన్నుల వేర్‌హౌసింగ్ వసతులు సిద్ధంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఆహార ప్రాసెసింగ్ రంగం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రిసిషన్ అగ్రికల్చర్, డిజిటల్ సప్లై చైన్, స్మార్ట్ లాజిస్టిక్స్ ఆధారంగా నడుస్తుందని, టెక్నాలజీ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి మద్దతు ఇస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ పెట్టుబడిదారులకు పిలుపునిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం ఒక గమ్యస్థానంగా చూడకుండా, మీ దీర్ఘకాలిక వృద్ధి భాగస్వామిగా చూడాలని, "మీ విజయమే మా విజయం" అంటూ ఆయన ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు.

# గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపు



**వరికుంటపాడు (నెల్లూరు), జులై 16, ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి, ఉపాధి అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం వరికుంటపాడు మండలం కాకొల్లువారిపల్లెలో రూ.1.67 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, విద్య, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో ప్రగతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. దుత్తలూరు ప్రాంతంలో డిఫెన్స్ అమ్యూనిషన్ క్లస్టర్‌లో భాగంగా సుమారు రూ.2,245 కోట్ల పెట్టుబడులతో ఐదు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందన్నారు. ఏడాదిలోపే పరిశ్రమల నిర్మాణ పనులు ప్రారంభమై స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పిలుపునిచ్చారు.

గ్రామస్థాయిలో ఎలాంటి విభేదాలు ఉన్నా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంతో పాటు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన. ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఢిల్లీ పర్యటనల్లో సైతం రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రులతో గంటల తరబడి సమావేశాలు నిర్వహిస్తూ నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని ఎంపీ కొనియాడారు. ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన భాష్యం రామకృష్ణకి కాకొల్లువారిపల్లెలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజా జీవితంలో మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలుగు దేశం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి దర్శనం:** దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఎంపీకి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలి

- కూటమి శ్రేణులకు పిలుపు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**కొడవలూరు (నెల్లూరు), జులై 16 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం కొడవలూరు మండలం నాయుడుపాళెం పంచాయతీలో రూ.50 లక్షలతో నిర్మించిన 1.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు, రూ.21 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన అమలులో, రహదారుల నాణ్యత ప్రమాణాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. నాయుడుపాళెంలో మిగిలిన 1.10 కిలోమీటర్ల రోడ్డును త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు పొడిగించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు ఐక్యంగా పనిచేసి అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఎంపీడీవో వెంకట సుబ్బారావు,మాగుంట సతీష్ కుమార్ రెడ్డి, కరకట మల్లికార్జున్, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, భూలోకం విజయకుమార్, జొన్న శివకుమార్, పల్లం రెడ్డి సురేష్ రెడ్డి, కోవూరు వెంకీ, మయూరి సిద్ధార్థ, బద్దిపూడి సూర్య, పలు శాఖ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుర్గమ్మకి కలెక్టర్ దంపతుల ఆషాఢం సారె





**ఇంద్రకీలాద్రి, జులై 16 ప్రభాతవార్త:** దుర్గమ్మకి గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా దంపతులు ఆషాఢం సారెను సమర్పించారు. వారికి ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు స్వాగతం పలికి మంగళ వాయిద్యాల నడుమ దుర్గమ్మ చెంతకు తోడ్కొని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపించారు. ఆషాఢం సారెను 6వ అంతస్థులోని శ్రీ అమ్మవారికి సమర్పించిన అనంతరం కలెక్టర్ దంపతులకు దుర్గమ్మ జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. పండితులు వేదాశీర్వచనాలందించారు.

**దుర్గమ్మకి ఎండోమెంట్ కమీషనర్ ఆషాఢం సారె:** దుర్గమ్మకి గురువారం దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్రమోహన్ ఆషాఢం సారెను సమర్పించారు. వారికి ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు స్వాగతం పలికి మంగళ వాయిద్యాల నడుమ దుర్గమ్మ చెంతకు తోడ్కొని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపించారు. ఆషాఢం సారెను 6వ అంతస్థులోని శ్రీ అమ్మవారికి సమర్పించిన అనంతరం దుర్గమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. పండితులు వేదాశీర్వచనాలందించారు.

**భక్తబృందాల ఆషాఢం సారె:** గురువారం సాయంత్రం 5 గంటల వరకు 18 భక్త బృందాలకు చెందిన 7,940 మంది భక్తులు దుర్గమ్మకి ఆషాఢం సారె సమర్పించారు. వారికి ఉచితంగా రు.100 దర్శనం కల్పించారు.



**దుర్గమ్మ సేవలో అల్లరి నరేష్:** దుర్గమ్మవారిని సినీ నటుడు అల్లరి నరేష్ గురువారం దర్శించుకున్నారు.

దుర్గమ్మ ఆలయంలో నిర్వ హిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన సిద్దినేని మధుబాబు, కుసుమ కుమారి దంపతులు రు.1లక్ష విరాళాన్ని గురువారం అందించారు. ఉచిత ప్రసాదం పంపిణీ స్కీంనకు ఎన్టీఆర్ జిల్లా పెద ఓగిరాలకు చెందిన గుంటక దుర్గాప్రసాద్ రెడ్డి, ఇంద్రజ దంపతులు రు.1,11,111ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



# అమెరికాలో హైదరాబాద్‌వాసిపై కత్తితో దాడి



**హైదరాబాద్ (మెహిదీపట్నం), జులై 16, ప్రభాతవార్త :** అమెరికాలోని ఓ షాపింగ్ మాల్‌లో వ్యాపార దుకాణాన్ని నిర్వహిస్తున్న హైదరాబాద్ యువకుడిపై కత్తితో దాడి చేశారు. హైదరాబాద్ టోలిచౌకికి చెందిన సయ్యద్ సోహెల్ పై ఓ దుండగుడు 15 సార్లు కత్తితో దాడి చేశాడు. జులై 13న జరిగిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తీవ్రంగా గాయపడిన సయ్యద్ సోహెల్ అమెరికా వెస్ట్ వ్యాలీ సిటీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. సయ్యద్ సోహెల్ గత రెండేళ్లుగా షాపింగ్ మాల్ లో చిన్న వ్యాపార దుకాణం నిర్వహిస్తూ తన భార్య పిల్లలతో అక్కడే నివాసం ఉంటు న్నాడు. స్థానికులు ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడి వద్ద నుంచి కత్తిని తీసుకొని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పీటర్ మైకేల్ గా గుర్తించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి

## నిందితుడికి 20 యేళ్ల జైలుశిక్ష

**చిన్నశంకరంపేట, జులై 16, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో మైనర్ బాలికపై జరిగిన లైంగికదాడి కేసులో నిందితుడికి న్యాయస్థానం 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ గురువారం తెలిపారు. 2022 అక్టోబర్ 10న చిన్నశంకరంపేటకు చెందిన బాలిక (13) ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా పక్కనే ఉన్న పంక్చర్ దుకాణ యజమాని మహ్మద్ షంషోద్దిన్ బాలిక వద్దకు వెళ్లి మీ అమ్మకు డబ్బులు ఇవ్వాలని బాలికను బయటకు పిలిచి బలవంతంగా పక్కనే ఉన్న చెట్ల చాటుకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు జరిగిన విషయం తెలుపడంతో అప్పటి చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ పోక్సో కింద కేసు నమోదు చేశారు. తూప్రాన్ డిఎస్పీ యాదగిరిరెడ్డి విచారణ చేపట్టి బాధితురాలికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బాధిత బాలికను భరోసా కేంద్రానికి తరలించగా, న్యాయ సలహాదారు శ్వేత పూర్తి సమాచారాన్ని అందించింది. పీపీ బాలయ్య న్యాయస్థానం ముందు బలంగా వాదనలు వినిపించారు. పూర్తి వివరాలను పరిశీలించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి సుభావలి.. నిందితుడు మహ్మద్ షంషోద్దిన్‌ను దోషిగా నిర్ధారించి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు.

# నేడు తొలి హైడ్రోజెన్ రైలు పట్టాల పైకి




## హర్యానాలో ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం

**న్యూఢిల్లీ, జులై 16:** దేశంలో తొలి హైడ్రోజన్ రైలు హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభం కానున్నది. ప్రధాని మోడీ ఈనెల 17వ తేదీన ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడుస్తుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటా యి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్ సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వ హించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవు తుంది. ఆనోడ్‌పై హైడ్రో జన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణా లు ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవు తాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటా న్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రం గా ఉంటుందని భావిస్తున్నారు.

# విచారణ ఖైదీ ఆత్మహత్యాయత్నం చికిత్స పొందుతూ మృతి

**హైదరాబాద్ (సికిందరాబాద్), జులై 16, ప్రభాతవార్త:** ఆత్మహత్యకు యత్నించిన అండర్ ట్రయల్ ఖైదీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి లో నివాసం ఉండే రోహిత్ పవార్ (20)పై గత మే నెలలో లైంగిక దాడి కేసు నమోదైంది. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. కాగా రెండు రోజుల కిందట నిందితుడు జైలులోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకున్నాడు. అప్రమత్తమైన సిబ్బంది తక్షణమే గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచాడు. కేసు దర్యాప్తులో ఉంది.

17-07pg10-f_17-07pg10-f.qxd 17/Jul/26 12:24 AM Page 1



## ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ప్లేయర్ల వివాదాస్పద బ్యానర్




**అట్లాంటా,జులై 16:** ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు వివాదాస్ప రీతిలో బ్యానర్లు ప్రదర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు జరుపుకున్నారు. అయితే మైదానంలోనే ఆ ప్లేయర్లు ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఫాక్‌ల్యాండ్స్‌కు మద్దతు ఇచ్చే రీతిలో ఉన్న బ్యానర్‌ను ఆటగాళ్లు పట్టుకున్నారు. దీనిపై వివాదం చెలరేగింది. లాస్ మాల్వినాస్ సన్ అర్జెంటీనాస్ అని బ్యానర్‌లో రాసింది. అర్జెంటీనాకే ఫాక్‌ల్యాండ్స్ చెందుతాయన్న అర్థం వచ్చే రీతిలో బ్యానర్ ఉన్నది. అట్లాంటిక్ సముద్రంలో ఉన్న ఫాక్‌ల్యాండ్స్ దీవులు ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఆ దీవులు తమకే చెందుతాయని అర్జెంటీనా పోరాడుతోంది. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు బ్యానర్లు ప్రదర్శించడం వివాదానికి దారి తీసింది. ఫుట్‌బాల్ ప్లేయర్లు రాజకీయ సంకేతాలు ఇవ్వడం సరికాదు అని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 1982లో ఈ రెండు దేశాల మధ్య ఆ దీవుల కోసం యుద్ధం కూడా జరిగింది. ఆ యుద్ధంలో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 2014లో అర్జెంటీనా ప్లేయర్లు ఇలాగే ఓ వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించారు. అప్పుడు ఆ జట్టుకు 20 వేల పౌండ్ల జరిమానా వేశారు. అయితే తాజాగా జరిగిన ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నట్లు ఫిఫా అధికారులు చెబుతున్నారు. ఆటగాళ్లు నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## ఐపిఎల్ పంజాబ్‌కింగ్స్ రికార్డు బ్రేక్‌చేసిన వాషింగ్టన్ ఫ్రీడమ్!




**న్యూయార్క్,జులై 16:** ఈ ఏడాది ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పెట్టిన 265 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ ఛేదించిన టీ20 క్రికెట్‌లో రికార్డును మేజర్ లీగ్ క్రికెట్(ఎంఎల్‌సీ) ఫ్రాంచైజీ వాషింగ్టన్ ఫ్రీడమ్ పంజాబ్ కింగ్స్ రికార్డును బ్రేక్ చేసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఉఫ్ అనేసి టీ20 క్రికెట్‌లో వరల్డ్ రికార్డు సృష్టించింది. గురువారం ఎంఎల్‌సీ లీగ్‌లో ఎంఐ న్యూయార్క్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్ ఈ ఘనత సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 266 రన్స్ చేసింది. కెప్టెన్ నికోలస్ పూరన్ 33 బంతుల్లో 106 పరుగుతో మెరుపు శతకం బాదాడు. 31 బంతుల్లో సెంచరీ చేసిన అతను ఫ్రాంచైజీ టీ20ల్లో గేల్(30) తర్వాత ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అతనికితోడు డికాక్(51), కీరన్ పొలార్డ్(64) కూడా హాఫ్ సెంచరీలు చేశారు. దీంతో ఎంఐ న్యూయార్క్ వాషింగ్టన్ ఫ్రీడమ్ ముందు 267 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఈ టార్గెట్‌ను ఆ జట్టు మరో 8 బంతులు మిగిలి ఉండగానే ఛేదించడం విశేషం. 4 వికెట్లు కోల్పోయి 270 పరుగులు చేసి గెలుపొందింది. ఆ జట్టులో ఆండ్రీస్ గౌస్(132), స్టీవ్ స్మిత్(110 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కి వాషింగ్టన్ ఫ్రీడమ్‌ను గెలిపించారు. వీరిద్దరే 241 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో పలు రికార్డులు కూడా నమోదయ్యాయి. ఓ టీ20 మ్యాచ్‌లో ముగ్గురు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. ఈ గేములో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 51 సిక్సర్లు వచ్చాయి. టీ20 మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు ఇవే. ఇంతకుముందు 42 సిక్సర్లు రికార్డుగా ఉండగా ఈ మ్యాచ్ దాన్ని బ్రేక్ చేసింది.




## ఛాన్సొస్తే కెప్టెన్సీకి నేను రెడీ

### స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన

**లండన్,జులై 16:** టీమిండియా మహిళా క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీమ్ సారథ్య బాధ్యతలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించి తన మనసులోని మాటను బయటపెట్టింది. ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్థానంలో భవిష్యత్తులో కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు స్మృతి మంధాన స్పష్టం చేశారు. జట్టు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న స్మృతి మంధాన గత కొన్నేళ్లుగా హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో జట్టు కోసం కీలక పాత్ర పోషిస్తున్నారు. హర్మన్‌ప్రీత్ జట్టుకు అందుబాటులో లేనప్పుడు తాత్కాలిక కెప్టెన్ గా భారత జట్టును విజయ పథంలో నడిపించిన అనుభవం స్మృతి మంధానకు ఉంది. భారత మహిళా జట్టు కెప్టెన్సీ మార్పునకు సంబంధించి వస్తున్న ఊహాగానాలపై స్మృతి మంధానకు ఓ ప్రశ్న ఎదురైంది. ఒకవేళ భవిష్యత్తులో భారత జట్టు సారథ్య బాధ్యతలు అప్పగిస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారా అని అడగితే అవును తప్పకుండా నేను దానికి సిద్ధంగా ఉన్నానని స్మృతి మంధాన ఎంతో నమ్మకంతో సమాధానమిచ్చింది. ఎంతో ఒత్తిడితో కూడిన మ్యాచుల్లో కూడా కూల్ గా నిర్ణయాలు తీసుకుని జట్టును నడిపించిన అనుభవం కూడా స్మృతి మంధానకు ఉంది. ఆ టాలెంటే స్మృతి మంధానను కెప్టెన్ రేసులో నిలబెట్టింది. స్మృతి మంధాన కెప్టెన్సీ రికార్డు భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీకి స్మృతి మంధాన బలమైన పోటీదారుగా నిలిచింది. ఆమె 18 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లకు, నాలుగు వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించి, మొత్తం 15 మ్యాచ్‌లలో జట్టును విజయపథంలో నడిపించింది. ఆమె నాయకత్వంలో ఆడిన నాలుగు వన్డేలలోనూ భారత జట్టు అజేయంగా నిలిచింది. లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్ చారిత్రాత్మక విజయం సాధించిన అనంతరం స్మృతి మంధాన ఈ ప్రకటన చేసింది. లార్డ్స్‌లో జరిగిన చారిత్రాత్మక మహిళల టెస్ట్ మ్యాచ్‌లో, భారత జట్టు ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 341 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఆ తర్వాత భారత బౌలర్లు ఇంగ్లండ్‌ను రెండు ఇన్నింగ్స్‌లలోనూ వరుసగా 170, 186 పరుగులకే ఆలౌట్ చేసి విజయాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన కీలక పాత్ర పోషించింది, తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగులు చేసి, ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతమైన అర్ధశతకం సాధించింది. స్మృతి మంధాన మాట్లాడుతూ, "లార్డ్స్‌లో జరిగిన తొలి మహిళల టెస్ట్ మ్యాచ్‌లో భాగం కావడం, అంతకంటే ముఖ్యంగా దానిని గెలవడం ఒక అద్భుతమైన అనుభవమని స్మృతి చెప్పింది.




## కోహ్లి, రోహిత్‌ల సంయుక్త రికార్డు

### అంతర్జాతీయ క్రికెట్‌లో 8వేల పరుగులు చేసిన జంట

**కార్డిఫ్,జులై 16:** టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్‌కోహ్లి, రోహిత్‌శర్మలు సంయుక్తంగా మరో రికార్డుసాధించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఇద్దరూ ఎనిమిదివేల పరుగుల భాగస్వామ్యం పూర్తిచేసారు. ఈ ఘటన సాధించినమూడో భారత జోడిగా,ఓవరాల్‌గా తొమ్మిదోజోడీగా రికార్డుల్లోకెక్కారు. అందకుముందు భారత్ తరపున గంగూలీ టెండూల్కర్‌లు 12,400, ద్రవిడ్ టెండూల్కర్ 11,037 పరుగులుచేసారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ రికార్డు శ్రీలంక స్టార్ ద్వయం మహేళ జయవర్ధనే, కుమార సంగక్కర 13,368 పరుగులుచేసి వారిపేరిట ఉంది. ఈ ఎనిమిదివేల పరుగుల ఘనత కార్డిఫ్‌లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో చోటుచేసుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌చేస్తున్న భారత్ 50ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులుచేసి మరింతగా ఇంగ్లండ్‌కు చెక్‌పెట్టేందుకు దూకుడుగా ఉంది.

## వెయ్యి సిక్సర్ల యోధుడు కీరన్‌పోలార్డ్!



**ముంబయి,జులై 16:** వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ కీరన్‌పోలార్డ్ టి20 క్రికెట్‌లో కీలక మైలురాయిని తాకాడు. మేజర్ లీగ్‌క్రికెట్ ఎమ్మెల్సీ 2026లో వాషింగ్టన్‌ఫ్రీడమ్‌తో జరిగిన ఎలిమినేటర్‌మ్యాచ్‌లో 8 సిక్సర్లు బాదిన ఆతడు పొట్టి ఫార్మాట్‌లో 1000సిక్సర్లు పూర్తిచేసాడు. ఈ ఘటన సాధించిన రెండో బ్యాటర్‌గా రికార్డుల్లో నమోదయ్యాడు. మరో క్రికెటర్ కూడా విండీస్ వీరుడేజ క్రిస్‌గేల్ 1056 సిక్సర్లు సాధించాడు. కెరీర్‌లో ఇప్పటివరకూ 746 టీ20 మ్యాచ్‌లు ఆడిన పోలార్డ్ 1001 సిక్సర్లతోపాటు 923 ఫోర్లుకూడా బాదాడు. టి20 క్రికెట్‌లో టాప్ ఐదుగురిలో క్రిస్‌గేల్ 1056, పోలార్డ్ 1001, రసెల్ 792, పూరన్ 764, బట్లర్ 630 సిక్సర్లు బాదారు. మ్యాచ్‌పరంగాచూస్తే పోలార్డ్ 25 బంతుల్లో 64 పరుగులుచేసాడు. 8 సిక్సర్లు ఒక ఫోర్‌సాధించాడు. నికొలస్‌పూరన్ మెరుపుశతకంతో ఎంఐ న్యూయార్క్‌నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లనష్టంతో 266 పరుగులుచేసింది. భారీ స్కోరుచేసిన ఎంఐ బౌలర్లు కాపాడుకోలేకపోయారు. ఫ్రీడం బ్యాటర్లు స్టీవ్‌స్మిత్ 110 నాటౌట్, ఆండ్రియస్ గౌస్ 132 పరుగులుచేసి శతకాలుచేసారు.మరో 8 బంతులు ఉండగానే టార్గెట్‌ను ఛేదించారు.

## సత్తాచూపిస్తున్న బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు!

**టోక్యో,జులై 16:** జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు సత్తాచాటుతోంది. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో రౌండ్‌లో ఆమె తన కంటే మెరుగైన ర్యాంకర్ అయిన వరల్డ్ నం.5 హాన్ యూ(చైనా)కు షాకిచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 21-16, 21-14 తేడాతో విజయం సాధించింది. 35 నిమిషాల్లోనే సింధు వరుసగా రెండు గేముల్లోనూ నెగ్గింది. హాన్ యూపై సింధుది తిరుగులేని తిరుగులేని ఆధిపత్యం. ఈ మ్యాచ్‌కు ముందు 8 మ్యాచ్‌ల్లో ఎదురుపడితే ఏడింట సింధునే గెలిచింది. ఈ మ్యాచ్‌లోనూ ఆమె ఆధిపత్యం ప్రదర్శించింది. రెండు గేముల్లోనూ సింధు దూకుడు ముందు ప్రత్యర్థి నిలువలేకపోయింది. ఈ సీజన్‌లో సింధు క్వార్టర్స్‌కు చేరుకున్న 6వ టోర్నీ ఇది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జోడీ రెండో రౌండ్‌లో ఓడిపోయింది. చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జీ హువాంగ్ డాంగ్ పింగ్ జంట చేతిలో 22-20, 21-17 తేడాతో పోరాడి ఓడింది. సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టి, ఉన్నతి హుడా ఇప్పటికే ఇంటిదారిపట్టిన విషయం తెలిసిందే. పురుషుల డబుల్స్‌లో సాత్విక్,చిరాగ్ జోడీ గాయం కారణంగా తొలి రౌండ్ మధ్యలోనే వైదొలిగింది. దీంతో ఇప్పుడు టోర్నీలో భారత్ తరపున మిగిలిన ఏకైక ప్లేయర్ సింధు.అయితే, క్వార్టర్స్‌లో ఆమెకు కఠిన సవాల్ ఎదురైంది. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో ఆమె వరల్డ్ నం.1 క్రీడాకారిణి నోజోమి ఒకుహారా(జపాన్)ను ఎదుర్కోనుంది.




# వాణిజ్యం




## విప్రో తొలి త్రైమాసిక లాభం 4.3% తగ్గుదల

### రూ.3,352 కోట్ల నికర లాభం

**ముంబయి, జులై 16:** దేశీయ ఐటీ దిగ్గజం విప్రో తొలి త్రైమాసికం నికర లాభం 4.3 శాతం తగ్గి రూ.3,352 కోట్లకు చేరింది. అంతకుముందు త్రైమాసికంలో కంపెనీ రూ.3,502 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ అంచనాలతో పోలిస్తే కూడా కంపెనీ లాభం కొంత నిరాశపరిచింది. విశ్లేషకులు విప్రో నికర లాభం రూ.3,466 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా, కంపెనీ ప్రకటించిన లాభం ఆ అంచనాలకు తక్కువగా నమోదైంది.లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం స్వల్పంగా 1 శాతం పెరిగి రూ.24,479 కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో ఇది రూ.24,236 కోట్లుగా ఉంది. ఈ ఆదాయం మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నమోదైంది. కంపెనీ వడ్డీ, పన్నులకు ముందు లాభం 8.4 శాతం తగ్గి రూ.3,829 కోట్లకు పడిపోయింది. గత త్రైమాసికంలో ఇది రూ.4,181 కోట్లు. అదే సమయంలో ఆపరేటింగ్ మార్జిన్ 17.2 శాతం నుంచి 15.6 శాతానికి క్షీణించింది. అంటే 160 బేసిస్ పాయింట్లు తగ్గింది. విప్రో ఒక్కో రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు రూ.2 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈనెల 27, 2026ను రికార్డు తేదీగా నిర్ణయించింది. డివిడెండ్ చెల్లింపును ఆగస్టు 14 లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపింది. కంపెనీ మొత్తం బుకింగ్స్ 2.4 శాతం తగ్గి 3.37 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐటీ సర్వీసుల ఆదాయం 1.4 శాతం తగ్గి 2.62 బిలియన్ డాలర్లుగా నమోదైంది. త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ 12 నెలల ఉద్యోగుల నిష్క్రమణ రేటు 13.9 శాతంగా నమోదైంది. మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.43 లక్షలుగా ఉంది.కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీని పల్లియా మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు వల్ల మార్కెట్ అవకాశాలు తగ్గడం కాకుండా మరింత విస్తరిస్తున్నాయని తెలిపారు. కంపెనీ డీల్ పైప్‌లైన్ బలంగా కొనసాగుతోందని చెప్పారు.టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ విభాగాల్లో మంచి వృద్ధి కొనసాగుతోందని, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ విభాగం రెండో త్రైమాసికంలో వేగం అందుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

## ఎక్కడి సూచీలు అక్కడే..

### పశ్చిమాసియా ఎఫెక్ట్‌తో నామమాత్రంగా లాభాలు!



**ముంబై, జులై 16:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం దాదాపు నిలకడగా ముగిశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ఆసియా మార్కెట్లలో బలహీన ధోరణి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు ఆర్థిక రంగ (ఫైనాన్షియల్) షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడం ప్రధాన సూచీలపై ప్రభావం చూపింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 1.44 పాయింట్ల స్వల్ప లాభంతో 77,186.87 వద్ద ముగియగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 5.75 పాయింట్లు లేదా 0.02 శాతం స్వల్ప నష్టంతో 24,072.75 వద్ద స్థిరపడింది.రోజువారీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 394 పాయింట్లు ఎగబాకి 77,579.69 గరిష్ఠ స్థాయిని తాకింది. అనంతరం లాభాల స్వీకరణ, అమ్మకాల ఒత్తిడి కారణంగా 77,086.42 కనిష్ఠ స్థాయికి చేరింది. ఇదే సమయంలో నిఫ్టీ కూడా 108 పాయింట్లకు పైగా పెరిగి 24,186.50 ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేయగా, తరువాత 24,050 కనిష్ఠ స్థాయిని తాకింది.రంగాల వారీగా చూస్తే వినియోగదారుల అవసరాలకు సంబంధించిన కంపెనీల షేర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ 1.48 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. నిఫ్టీ కెమికల్స్ 1.41 శాతం, నిఫ్టీ మీడియా 1.18 శాతం, నిఫ్టీ ఐటీ 0.67 శాతం, నిఫ్టీ ఆటో 0.46 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ50లో ఎటర్నల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో కొన్ని షేర్లు మూడు శాతం వరకు క్షీణించాయి. పశ్చిమాసియా పరిణామాలు, ముడి చమురు ధరల్లో అస్థిరత, ఆసియా మార్కెట్ల బలహీనత వంటి అంశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్ రోజంతా పరిమిత శ్రేణిలోనే కదిలింది.డాలరుతో రూపాయి విలువలు 96.33వద్ద నిలిచింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ మార్కెట్‌దరలు 0.19శాతం క్షీణించి రూ.1.41,585కి చేరాయి. ముడిచమురు బ్యారెల్‌కు 84.73 డాలర్లుగా కొనసాగింది.

## మెట్రో నగరాల్లో అద్దె డిపాజిట్లు 1.26 లక్షల కోట్లు



**ముంబయి,జులై 16:** దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాలు ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, బెంగళూరు, ఢిల్లీఎన్‌సీఆర్, చెన్నై, హైదరాబాద్, పుణే నగరాల్లో అద్దె ఇళ్లకు సంబంధించిన భద్రతా డిపాజిట్ల (సెక్యూరిటీ డిపాజిట్లు) రూపంలో సుమారు రూ.1.26 లక్షల కోట్లు ఇళ్ల యజమానుల వద్ద నిలిచిపోయినట్లు ప్రముఖ ప్రాప్‌టెక్ సంస్థ నోబ్రోకర్ నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనం ప్రకారం, ముంబైలో రూ.41,156 కోట్లు, బెంగళూరులో రూ.31,628 కోట్లు భద్రతా డిపాజిట్ల రూపంలో నిలిచిపోయి ఉండగా, దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ఇవే అత్యధిక మొత్తాలు. బెంగళూరులో 75 శాతం మంది అద్దెదారులు, అధిక సెక్యూరిటీ డిపాజిట్ కారణంగా తాము ఇష్టపడిన ఇంటిలోకి మారలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రధాన మెట్రో నగరాల్లో ఈ శాతం అత్యధికంగా నమోదైంది.అదే సమయంలో ఢిల్లీఎన్‌సీఆర్‌లో లీజు గడువు ముగిసిన తర్వాత 58 శాతం మంది అద్దెదారులు తమ పూర్తి డిపాజిట్‌ను తిరిగి పొందగా, సుమారు 30 శాతం మందికి కొంత మొత్తం కోత పడింది. మరో 12 శాతం మంది డిపాజిట్ తిరిగి పొందడంలో తీవ్ర వివాదాలను ఎదుర్కొన్నారు. నోబ్రోకర్ నివేదిక ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో నివసించే అద్దెదారుల నెలవారీ ఖర్చుల్లో ఇంటి అద్దెనే అతిపెద్ద వ్యయంగా మారింది. దాదాపు సగం మంది అద్దెదారులు తమ నెలవారీ ఆదాయంలో 30 శాతానికి పైగా అద్దెకే వెచ్చిస్తున్నారు. ముంబైలో 25 శాతం మంది అద్దెదారులు తమ ఆదాయంలో సగానికి పైగా అద్దెకే ఖర్చు చేస్తుండగా, మరో 15 శాతం మంది 41-50 శాతం ఆదాయాన్ని అద్దెకు చెల్లిస్తున్నారు. ముంబైలో ప్రతి 10 మంది అద్దెదారుల్లో నలుగురు తమ ఆదాయంలో 40 శాతానికి పైగా గృహ అవసరాలకే వెచ్చిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. ఒకే రకమైన ఇంటికి 30 ఏళ్ల గృహ రుణానికి చెల్లించాల్సిన ఈఎంఐ దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో నెలవారీ అద్దె కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది. బెంగళూరులో ఈఎంఐఅద్దె నిష్పత్తి 2.07 నుంచి 2.38,హైదరాబాద్లో 2.21 నుంచి 2.47, ముంబైలో 2.03 నుంచి 2.19కు పెరిగింది. జెన్‌జెడ్ అంటే 18-24 ఏళ్ల వయస్సు అద్దెదారులు, ఇతర వయస్సు వారితో పోలిస్తే సుమారు 1.5 రెట్లు ఎక్కువగా ఇళ్లు మారుతున్నారు. వీరిలో 30 శాతం మంది ప్రతి ఆరు నుంచి 12 నెలలకోసారి ఇల్లు మారుతుండగా, పెద్ద వయస్సు గల వారిలో కేవలం 10 శాతం మాత్రమే ఉంది. బెంగళూరులో 4.8 శాతం, హైదరాబాద్‌లో 4.6 శాతం అద్దె రాబడితో దేశంలో అగ్రస్థానాల్లో నిలిచాయి.

## అంచనాలను మించి 40% పెరిగిన భెల్ రాబడి!




**న్యూఢిల్లీ, జులై 16:** ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం బిహెచ్‌ఇఎల్ తొలి త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ ఆదాయం, నిర్వహణ లాభదాయకత (ఎబిట్డా), నికర లాభం అన్ని ప్రధాన సూచీల్లో అంచనాలను అధిగమించాయి.గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.456 కోట్ల నష్టాన్ని నమోదు చేసిన బీహెచ్‌ఈఎల్, ఈసారి రూ.378 కోట్ల సమీకృత నికర లాభాన్ని ఆర్జించింది. కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 40.3 శాతం పెరిగి రూ.5,487 కోట్ల నుంచి రూ.7,698 కోట్లకు చేరుకుంది.నిర్వహణ లాభం (ఎబిట్డా) గత ఏడాది రూ.537 కోట్ల నష్టంలో ఉండగా, ఈసారి రూ.504 కోట్ల లాభంగా నమోదైంది. ఎబిట్డా మార్జిన్ 6.5 శాతానికి చేరుకుంది. నికర లాభం కూడా నిపుణులు అంచనావేసిన రూ.33.9 కోట్లతో పోలిస్తే ఎంతో ఎక్కువగా నమోదైంది.ఇతర ఆదాయం కూడా గత ఏడాది రూ.171.2 కోట్ల నుంచి ఈసారి రూ.214.1 కోట్లకు పెరిగింది. కంపెనీ వృద్ధికి విద్యుత్ విభాగం ప్రధాన ఆధారంగా నిలిచింది. ఈ విభాగం ఆదాయం గత ఏడాది రూ.3,898.9 కోట్ల నుంచి రూ.5,919.5 కోట్లకు పెరిగింది. పరిశ్రమ విభాగం ఆదాయం కూడా రూ.1,588.1 కోట్ల నుంచి రూ.1,778.2 కోట్లకు పెరిగింది.ఇదిలా ఉండగా, సూడాన్‌లో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా మాజీ ఎన్‌ఈసీ సూడాన్ సంస్థ నుంచి రావాల్సిన రూ.196 కోట్ల బకాయిలు ఇంకా అందలేదని బీహెచ్‌ఈఎల్ వెల్లడించింది. గురువారం ట్రేడింగ్‌లో షేరు ధర 2 శాతం వరకు పెరిగి రూ.426.15కు చేరుకోగా, అదే సమయంలో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ50 సూచీ కేవలం 0.1 శాతం మాత్రమే లాభపడింది.

## టెక్ మహీంద్ర లాభం రూ.1465 కోట్లు




**ముంబై, జులై 16:** దేశీయ ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా తొలి త్రైమాసికంలో ప్రాతిపదికన పెరిగినప్ప టికీ, మార్కెట్ నిపుణుల అంచనాలను అందుకోలేకపోయింది. త్రైమాసికంలో టెక్ మహీంద్రా సమీకృత నికర లాభం రూ.1,465 కోట్లుగా నమోదైంది. ఇది మార్చి త్రైమాసికంలోని రూ.1,354 కోట్లతో పోలిస్తే 8.2 శాతం అధికం. అయితే, నిపుణులు అంచనా వేసిన రూ.1,607 కోట్ల కంటే తక్కువగా ఉండటంతో మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది.కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 4.2 శాతం పెరిగి రూ.15,712 కోట్లకు చేరుకుంది. గత త్రైమాసికంలో రూ.15,076 కోట్లు కాగా, మార్కెట్ అంచనా రూ.15,422 కోట్లు. దీంతో ఆదాయం అంచనాలకు అనుగుణంగానే నమోదైంది.వడ్డీ, పన్నులకు ముందు లాభం రూ.2,073 కోట్ల నుంచి రూ.2,264 కోట్లకు పెరిగి 9.2%వృద్ధి నమోదు చేసింది. అలాగే ఎబిడిటామార్జిన్ 13.7 శాతం నుంచి 14.4 శాతానికి పెరిగింది. కొత్త ఒప్పందాల మొత్తం విలువ ఏడాది ప్రాతిపదికన 33.3 శాతం పెరిగి 1.08 బిలియన్ డాలర్లకు చేరుకోవడం విశేషం. కంపెనీ సీఈఓ మోహిత్ జోషి మాట్లాడుతూ, వరుసగా మూడు త్రైమాసికాల్లో 1 బిలియన్ డాలర్లకు పైగా కొత్త డీల్ విజయాలు సాధించడం సంస్థ వ్యాపార బలాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. అలాగే 50 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయం అందించే ఖాతాదారుల సంఖ్య ఏడు పెరగడం, అన్ని వ్యాపార విభాగాలు వార్షిక ప్రాతిపదికన వృద్ధిని నమోదు చేయడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు.ఉద్యోగుల నిష్క్రమణ రేటు 12.1 శాతం నుంచి 11.8 శాతానికి తగ్గిందని, కృత్రిమ మేధ రంగాలవారీ ప్రత్యేక సామర్థ్యాలు, ప్లాట్‌ఫారమ్‌లు, ప్రతిభావంతులైన ఉద్యోగులపై పెట్టుబడులు కొనసాగిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సంస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఫలితాల ప్రకటనకు ముందు ఎన్‌ఎస్‌ఈలో టెక్ మహీంద్రా షేరు 1.13% పెరిగి రూ.1,515.60 వద్ద ముగిసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps